


కొన్ని వేల సంవత్సరాల క్రిందట శ్రావస్తి నగరాన్ని దానశీలుడనే రాజు పరిపాలిస్తుండేవాడు. ఆ చుట్టుపక్కల రాజు లందరిలోకీ దానశీలుడే గొప్ప. ఏమంటే, లక్షల కొలది సైన్యం వుంది. దాసదాసీ జనాలకు లెక్కలేదు. ఇక ఆ రాజు ధనాగారం రత్నాలు, మొహరీలు, వజ్రాలు, వైఢూర్యాలు మొదలైన అన్ని రకాల వెలలేని మణులతోనూ వెండి, బంగారు ధనరాసులతోనూ నిండి వుండేది. అన్నిటినీ మించిన అదృష్టం అనుకూలవతి, అపురూప సౌందర్యవతి అయిన కాంతిరేఖ రాజుకు రాణి కావటమే. మరో గొప్ప విషయం ఏమిటి అంటే, ఇంత ఐశ్వర్యంతో తులతూగుతున్నా ఆ రాజుకు ఏకోశానా గర్వం అనేది లేదు. దైవ భక్తి కూడా అపారం. ఇక ఆయన చేసే దానధర్మాలకు అంతేలేదు. యాచకులకు లేదనకుండా ఏదో ఒకటి యిచ్చి పంపేవాడు. ఆ కారణం చేతనే రాజు దానశీలుడు అనే తన పేరు సార్థక పరుచుకున్నాడు.

ఇలా వుండగా కొన్నాళ్ళకు ఒక పెద్ద ఆపాంతరం వచ్చింది. ఎంతో ఆరోగ్యంగా తిని తిరుగుతున్న రాణి కాంతిరేఖ వున్నట్టుండి హఠాత్తుగా చనిపోయింది. రాజు కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చాడు. ప్రజల దుఃఖానికి అంతేలేదు. కాని ఎంత ఏడ్చి, చనిపోయిన రాణిని తిరిగి బతికించటం ఎవరివల్ల అవుతుంది?

[illegible]



క్రమంగా రోజులు గడుస్తున్న కొద్దీ రాజూ, ప్రజలూ కూడా చనిపోయిన రాణిని గురించి తలచటం మానివేశారు. ఇప్పుడు అందరికీ ఒకే ఒక దిగులు పట్టుకుంది. రాణి కడుపున సంతానం కలుగక మునుపే చనిపోయింది. తమ రాజు తదనంతరం, రాజ్యం పరులపాలు కాకుండా వుండటానికి రాజు తిరిగి వివాహం చేసుకుని, సంతానం పొందటం అవసరం. మంత్రులూ, సామంతులూ రాజును తిరిగి వివాహం చేసుకోమన్నారు. రాజు ఒప్పుకోక తప్పిందికాదు. ఒక సుముహూర్తాన రాజు తిరిగి వివాహం చేసుకున్నాడు. కాని, దురదృష్టమేమో కాని రెండవ భార్య కూడా కొద్ది రోజులకే ఆకస్మికంగా చనిపోయింది.

ఈ వార్త ఆ రాజ్యంలో ప్రజలందరి నోటా పడి, క్రమంగా చుట్టుపక్కల రాజ్యాలకు కూడా పాకిపోయింది. మంత్రులూ, సామంతులూ ఈ సారి కూడా రాజును తిరిగి మూడో వివాహం చేసుకోమని వేడుకుని, ఎలాగైతేనేం రాజు చేత ఒప్పించగలిగారు. కాని, రాజుకు భార్య అయిన ఇల్లాలు పెళ్ళి అయిన కొద్ది రోజులకెల్లా చనిపోతూన్న దన్న వార్త విన్న తర్వాత, ఏ తండ్రి చూస్తూ చూస్తూ తన బిడ్డను మృత్యు ముఖంలోకి పంపటానికి ఒప్పుకోగలడు? రాజవంశీయులు కాదుగదా, కడకు సామాన్య సంసారులు సైతం తమ పిల్లను రాజుకు ఇవ్వటానికి ఒప్పుకోలేదు. అయినా పట్టువిడవకుండా మంత్రులూ, సామంతులూ దేశం నలుమూలలా యింకా వెతుకుతూనే వున్నారు.

అలా వెతకగా వెతకగా కొన్నాళ్లకు తన కుమార్తెను ఇవ్వటానికి ఒక పేదరాలు ఒప్పుకున్నది. ఆ పిల్ల బీద వంశంలో పుట్టినప్పటికి అందచందాలలో ఏ రాజకుమార్తెకూ తీసిపోలేదు. అతి రూప సౌందర్యరాశి అయిన ఆ పిల్లను చూసి మంత్రులూ, సామంతులూ ఉప్పొంగి

పోయారు. వెంటనే ఈ వార్త రాజుకు అందజేశారు. ఒక సామాన్య స్త్రీ యీ సారి తనకు రాణి కాబోతుందని తెలిసినప్పుడు రాజు విచారించలేదు సరికదా, ఎంతో సంతోషించి మంత్రులతో, "మృత్యు దేవతకు పేదలైనా ఒకటే, భాగ్యవంతులైనా ఒకటే. ఇంత ఐశ్వర్యంతో తుల తూగుతున్నా, నా రాణులను రక్షించుకో గలిగానా? బతికే యోగం వుంటే ఎవరైనా బతుకుతారు. కనుక మీరు చూచి వచ్చిన ఆ స్త్రీని చేసుకోవటానికి నాకు అభ్యంతరము లేదు," అన్నాడు.

అది విన్న మంత్రులు ఉత్సాహభరితులైనారు. మరి కొద్ది రోజులకల్లా మంచి ముహూర్తాన రాజుకూ, ఆ పేదరాలి కూతురుకూ వివాహం ఏర్పాటు చేశారు. వివాహం సలక్షణంగా జరిగేవరకూ ఎవరికీ గుండెధైర్యం లేదు, ఎందువల్లనంటే, అంతకుముందు రాజు వివాహం చేసుకున్న రాణులు కూడా వివాహం అయిన తర్వాత ఒక వారం తిరక్కుండానే చనిపోయారు.

కాని యీ సారి అలా జరగలేదు. క్రమంగా రోజులు, నెలలు ఏ అవాంతరమూ లేకుండా గడిచిపోయినై. అప్పటికి రాజుకూ, మంత్రులకూ, ప్రజలకూ కొంత ధైర్యం చిక్కింది. నాటినుంచి ప్రజలు, "ఈ మూడవ భార్యవల్లనైనా మా రాజుకు సంతానం ప్రసాదించు, తండ్రీ!" అని దేవుడిని ప్రార్థించసాగారు.





ప్రజల ప్రార్థన దేవుడు విన్నాడు కాబోలు. మరో నెలకల్లా రాణి గర్భవతి అయినట్టు వార్త పొక్కింది. ఈ వార్త విన్న ప్రజల సంతోషానికి మేరలేక పోయింది. ఇక రాజు, అతని పరివారం సంగతి చెప్పేదేమిటి?

క్రమంగా నవమాసాలూ నిండి, మంచి నక్షత్రాన రాణి పద్మముఖి సుఖప్రసవమై ముగ్గురు కవలల్ని కన్నది. కాని తమ వంశోద్ధారకుడుగా ఒక పుత్రుడు పుడతాడని ఎంతగానో ఆశతో ఎదురు చూస్తున్న రాజు, పుట్టిన ఆ ముగ్గురు కవలలూ ఆడపిల్లలే అని విన్నప్పుడు కొంత నిస్పృహ చెందకపోలేదు. అయినా, రాజు తన నిస్పృహ పైకి ఏమాత్రం కనబరచలేదు. నాకు మగపిల్లలైనా, ఆడపిల్లలైనా ఒక్కే—అనుకొని మనస్సును సమాధానపరుచుకున్నారు. ఏమైతేనేం, ఆ ముగ్గురు కవలల్నీ రాజూ, రాణీ ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు.

ముగ్గురు పిల్లలకూ తల్లిదండ్రులు వరుసగా సుహాసిని, సుభాషిణి, సుకేశిని అని నామకరణం చేశారు. క్రమంగా ముగ్గురు పిల్లలూ, ఆ ఏటికాఏడు పైబడిన కొద్దీ, చక్కటి అందాల భరిణెలుగా తయారవుతున్నారు. ఆ పిల్లల చక్కదనాన్ని చూసిన వాళ్ళు, "ఒక్కొక్క కుమార్తె పదిమంది కొమాళ్ళ పెట్టు!" అని మెచ్చుకొనేవారు.

అంతటి ఆనందంలోనూ మధ్య మధ్య ఒక చిన్న ఆవాంతరం వచ్చి రాజునూ, రాణినీ కంగారు పరుస్తూండేది. ముగ్గురు పిల్లలలోనూ ఎవరో ఒకరు ఏదో ఒక అపాయంలో చిక్కుకోవటం, మళ్ళీ ఎలాగో తప్పుకోవటం జరుగుతూ వుండేది.

ఒకసారి సుహాసిని, తండ్రితో కోటలో షికారు చేస్తూండగా ఒక పెద్ద సర్పం ఆ పిల్లను కాటువెయ్యటానికి వచ్చింది. సమయానికి రాజు తన కత్తితో ఆ సర్పాన్ని నరికేశాడు గాని, లేకపోతే ఆ నాటితో సుహాసినికి లోకానికి ఋణం తీరిపోయేదే.


మరొకసారి సుభాషిణి, తల్లితో నది ఒడ్డుకు విహారానికి వెళ్ళింది. అంత వరకూ ప్రశాంతంగా వున్న నది, ఒక్కసారిగా పొంగి, ఒడ్డున నిలుచున్న సుభాషిణిని లోపలికి ఈడ్చుకు పోయింది. దైవానుగ్రహం వల్ల సరిగ్గా ఆ సమయానికి ఒక పల్లెకారి ఆ చోటికి రావటం, రాణి కంగారుపడుతూ వుండటం చూసి, వాడు నదిలోకి దూకి ఎలాగైతేనేం సుభాషిణిని ప్రాణాలతో బైటికి తెచ్చి బతికించటం జరిగింది. ఆ పల్లెకారే అటు రాక పోతే నాటితో సుభాషిణి నది గర్భంలో కలిసిపోయివుండును.

ఇదేవిధంగా మరొకసారి మూడవపిల్ల సుకేశిని ఒక గండం గడిచి బైటపడింది.

అది ఏమిటి అంటె—ఒక రోజున సుభాషిణి, సుహాసిని, సుకేశిని కలిసి తోటలో పూలు కోయటానికి వెళ్ళారు. ముగ్గురూ మూడు బుట్టల్లో పూలు కోసుకుని తిరిగి మేడకు బయలుదేరారు. ముందు సుభాషిణి, ఆ వెనక సుహాసిని, ఆ వెనక సుకేశిని నడుస్తున్నారు. ఇంతలో వున్నట్టుండి సుకేశిని కెవ్వున కేకపెట్టి పడిపోయింది. మిగతా పిల్లలిద్దరూ హడలిపోయారు. తల్లి దగ్గరకు పరిగెత్తి జరిగిన సంగతి చెప్పారు.

తల్లి, వాళ్ళను వెంటబెట్టుకుని సుకేశిని పడివున్న చోటుకు వచ్చిచూడగా, పక్కనే పూలబుట్ట, ఆ పూలలో పాకుతూ వున్న ఒక మండ్రగబ్బ కనిపించెను.






అప్పటికి తెలిసింది దాదికి, మంత్రగబ్బ కుట్టటం వల్లనే సుకేశిని అలా ఏడి ఫుంటుందని. దానిని చంపి ఆమె వెంటనే పిల్లను ఎత్తుకుని మేడకు తిరిగి వచ్చింది. ఆస్థాన వైద్యుడికి కబురంపగా, ఆయన వచ్చి ఏదో మందు వేశాడు. కొంతసేపటికి తిరిగి సుకేశిని లేచి మాటాడసాగింది.

అలా, లేక లేక తమకు కలిగిన ఈ ముగ్గురు పిల్లలలో ఎప్పుడూ ఎవరికో ఒకరికి ఏదో ఒక గండం రావటం చూసే సరికి రాజు మనస్సు పరిపరి విధాల పోయింది. ఆయన తహ తహ లాడి పోయాడు. ఉండబట్టలేక ఒక రోజున జ్యోతిష్కుణ్ణి పిలిపించి, తన కుమార్తెలు ముగ్గురి జాతకాలు చూపించాడు.

జ్యోతిష్కుడు చాలాసేపు దీర్ఘంగా ఆలోచించి, తర్వాత ఏమీ చెప్పకుండా ఊరుకునే సరికి రాజు ఆరాటం మరింత హెచ్చింది. ఆయన జ్యోతిష్కుడితో, "ఏదో అనుమానిస్తున్నట్టున్నారే? ఉన్న దున్నట్టు చెప్పండి. నిజం వెల్లడిస్తారనే ఉద్దేశంతోనే మిమ్మల్ని రప్పించాను." అంటూ ఆప్యాయంగా జ్యోతిష్కుడి భుజం తట్టాడు.

అప్పుడు జ్యోతిష్కుడు, "ఈ పిల్లలు చాలా అంద చందాలతో వెలిగిపోతూ వుంటారు. ఆ నాటి కా నాటికి వారి అందం వృద్ధి పొందుతుందేగాని, తీసి పోదు. కాని విచారించ వలసిన విషయం ఏమిటి అంటే, వారి అపురూప సౌందర్యమే వారికి శత్రువవు తున్నది. వారు పుట్టిన దగ్గిర్నుంచి ఎప్పుడూ ఏదో ఒక గండం దాటవలసి వస్తూనే ఉండాలి...." అని ఆగాడు.

జ్యోతిష్కుడి నోటి వెంట వచ్చిన ప్రతి ఒక్క మాటకు రాజు గుండె తరుక్కు పోతోంది. ఆయన కంటి వెంట ఏకధారగా కన్నీరు కారటం చూసి జ్యోతిష్కుడు మాట మధ్యలో ఆగాడు. కాని రాజు ఎంత కష్టానికైనా ఓర్చుకుని



జాతకంలోని నిజా నిజాలు తెలిపవలసిందని పట్టుబట్టారు. ఆయన జ్యోతిష్కుణ్ణి. "ఆగారేం? చెప్పండి." అని హెచ్చరించారు.

"నిజం చెప్పి మీ మనస్సు కష్టపెట్టవలసి వచ్చిందే అని విచారిస్తున్నాను." అన్నాడు జ్యోతిష్కుడు.

"ఫరవాలేదు. చెప్పండి. నా చిట్టి తల్లుల్ని నా శాయశక్తులా రక్షించుకోవటానికి ప్రయత్నిస్తాను. మీరు వున్న సంగతి దాపరికం లేకుండా చెప్పండి." అని దైన్యావస్థతో అడిగారు రాజు.

అప్పుడు జ్యోతిష్కుడు యిలా చెప్పాడు: "మన అమ్మాయిలకు ఏడేళ్ళు నిండే వరకూ దిన దిన గండం నూరేళ్ళాయుష్షు అన్నట్టుగానే వుంటుంది. కాని, ఈ ఏడేళ్ళూ గండాలన్నీ గడిచి బైటపడ్డారంటే యిక మన అమ్మాయిలకు ఎటువంటి భయమూ లేదు. కనుక ఏడేళ్ళు నిండే వరకూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకో గలిగితే మనం ధన్యులమే. ఇంతకు మించి జాతకంలో చెప్పతగ్గ విశేషం లేదు."

రాజు, జ్యోతిష్కుణ్ణి అనేక విధాల సత్కరించి పంపివేశారు. తర్వాత రాణి దగ్గరకు వచ్చి, జ్యోతిష్కుడు చెప్పిన విషయాలన్నీ చెప్పలేక చెప్పలేక ఎలాగో మనసు విడిచి చెప్పారు. వింటూ వింటూ రాణి స్పృహ తప్పి పడిపోయింది.

దాస దాసీలు ఉపచారం చెయ్యగా కొంతసేపటికి రాణికి స్పృహ వచ్చింది. రాజు ఆమెను ఓదారుస్తూ వుండగా, పిల్లల్ని కాపాడుతున్న దాది పరిగెత్తుకుంటూ వచ్చి, "మన అమ్మాయిలు ముగ్గురూ స్పృహ తప్పి పడిపోయారమ్మా, తోటలో," అంటూ గొల్లున ఏడ్చింది.

రాణి కంగారు పడుతూ తోట వైపుకు పరుగెత్తింది. దాది ఆమె వెంటపడింది. ఆస్థాన వైద్యుడికి కబురు పంపారు. రాజు కూడా తోట వైపుకు పరుగెత్తారు.

—(ఇంకా వుంది)






## 2

[శ్రావస్తీనగరాన్ని ఏలే దానశీలుడనే రాజుకు లేక లేక ముగ్గురు కవలపిల్లలు పుట్టారు. ముగ్గురూ ఆడపిల్లలే. వాళ్ళు పుట్టినప్పటి నుంచి ఏదో ప్రమాదానికి లోనవుతూనే వున్నారు. రాజు దీన్ని గురించి జ్యోతిష్కులతో మాట్లాడుతూండగా, కవలలు ఉద్యానవనంలో స్పృహ తప్పి పడిపోయినట్టు తెలిసింది. రాజూ, రాణీ వాళ్ళ దగ్గిరకు పరిగెత్తారు. తరవాత—]

రాజూ, రాణీ ఉద్యానవనాన్ని చేరుకునే సరికి ముగ్గురు పిల్లలూ కళాకాంతి లేకుండా పడి వున్నారు. పరీక్షించి చూడగా ఒళ్ళు చల్లబడింది. శ్వాస సరిగా ఆడటం లేదు.

అది చూసి కంగారుపడి, "ఇదేమిట్రా. భగవంతుడా!" అని చెప్పి అమిత విచారంతో రాజూ, రాణీ కొయ్యబారి పోయారు. మరికొద్ది సేపటికి ఆస్థానవైద్యుడు వచ్చి, రాజు కుటుంబం తక్కిన వరకూ వారు యీ ప్రపంచంలోనే లేరు.

అప్పుడు ఆస్థానవైద్యుడు ఆ చుట్టు ప్రక్కల పరిశీలించాడు. పిల్లలు పడి వున్న చోటికి కొంచెం దూరంలో ఒక పండు కనిపించింది. పండు పైన అక్కడక్కడ పళ్ళు దిగబడిన గాట్లు కనిపించినై. ఆస్థానవైద్యుడు ఆ పండును తీసుకొని వాసన చూసి, "ఓహో, ఇదా సంగతి!



ఇది విషవృక్షపండు. దీనిని కొరకటం వల్లనే పిల్లలు యిలా పడిపోయారు." అని వెంటనే ఏదో మందు పిల్లలకి వాసన చూపించాడు. అలా చూపటం వల్ల, ఆకస్మిక ప్రమాదం ఏమీ కలగకుండా, ఆ పిల్లలు అదే స్థితిలో నిలిచి వున్నారు. తర్వాత ఆయన ఆ పండును దాదికి చూపుతూ, "ఈ పండు ఎక్కడిదో నీకు తెలుసా?" అని అడిగాడు.

అందుకు జవాబుగా దాది యిలా చెప్ప సాగింది: "మామూలు ప్రకారం అమ్మాయిలను షికారు కని వెంటబెట్టుకు వచ్చానంది. కొంతసేపు అలా అలా తిప్పి, చివరికి యీ చెట్టు కిందకి వచ్చి కూర్చున్నామంది. ఇంతలోనే అమ్మాయిలు, 'దాహంగా వుంది, నీళ్ళు తెమ్మని' అడిగారంది. నేను నీళ్ళు తీసుకుని తిరిగి వచ్చేటంతలో పెద్దమ్మాయి, చిన్నమ్మాయి అప్పటికే స్పృహ తప్పి పడిపోయి వున్నారంది. నేను సరిగ్గా వాళ్ళ దగ్గిరికి వచ్చే వేళకి, బుల్లి అమ్మాయిగారు యీ పండు కొరుకుతున్నారంది. ఏమిటా యీ పండు అని నేను చూచేటంతలో, బుల్లిఅమ్మాయిగారు కూడా స్పృహతప్పి పడిపోయారంది. ఇంతకు మించి నాకు ఇక్కడ జరిగినది మరేమీ తెలియదంది," అని చెప్పి ఆగింది.

ఆస్థానవైద్యుడు తల ఎత్తి ఒక్కసారి చెట్టు పైకి చూచేసరికి, దానిపైన ఒక గద్ద కనిపించింది. "అదుగో, ఆ పాపిష్ఠి పక్షే యీ పండు వదిలి వుంటుంది. ఇంకా చూస్తారేం, చంపండి దాన్ని!" అని అరిచాడు.

అక్కడ చేరిన వాళ్ళలో ఒకడు తన బాణంతో ఆ గద్దను కొట్టబోయేసరికి, అది రివ్వున ఎగిరి, మరి కనబడకుండా పోయింది.

ఈలోగా ఆస్థానవైద్యుడిచ్చిన ఔషధం పని చేసి, పిల్లలు ముగ్గురూ కదల సాగారు. అప్పటికి గాని అక్కడ చేరిన వారిపరికి ప్రాణాలు కుదుటపడలేదు.

తర్వాత ముగ్గురు పిల్లల్నీ తీసుకుని, ఆస్థానవైద్యుడితో సహా రాజూ, రాణీ తమ మేడ చేరుకున్నారు. తిరిగి ఆస్థాన వైద్యుడు మరో ఔషధం ఇచ్చాడు. మరి కొంతసేపటికల్లా పిల్లలు ముగ్గురూ లేచి కూర్చున్నారు. ఇంత జరిగినా ఆ పిల్లలు కొంచెం కూడా అలిసినట్లు కనిపించ లేదు. యథాప్రకారం కిలకిల్లాడుతూనే ఉన్నారు. పిల్లలు కిలకిల్లాడుతూ ఉండటం చూసి, రాజూ, రాణీ, ఆస్థాన వైద్యుడూ కూడా ఎంతగానో సంతో షించారు.

ఈ ప్రమాదం జరిగిన నాటికి పిల్లలు నాలుగేళ్ళవాళ్ళు. జ్యోతిష్కుడు చెప్పిన ప్రకారం ఇంకా మూడేళ్ళవరకూ వాళ్ళకి దినదిన గండమే అని రాజు నిశ్చయించుకునే ఉన్నాడు. ఈ మూడేళ్ళు వాళ్ళకి ఏ ఆపదా రాకుండా కాపాడటం ఎలాగా అని ఇప్పుడు తీవ్రంగా ఆలోచించ సాగాడు.

ఒకనాడు రాజు ఒంటరిగా తోటలో షికారు చేస్తూంటగా ఒకచోట ఒక బండ రాయి కనిపించింది. ఆ బండపైన, "భూగృహం" అని రాసి ఉండటం కని పించేసరికి, రాజు ఎంతగానో ఆశ్చర్య పోతూ ఆ బండని పక్కకు తొలిగించి చూశాడు. మెట్లు కనిపించినై.

రాజు ఒక్కొక్క మెట్టే దిగిపోయి పోయి ఒక పెద్ద మహలు చేరుకున్నాడు. ఆ మహలు ఎవరు ఎప్పుడు ఎందుకు






కట్టిందారో రాజుకి తెలియదు. దాని గోడలన్నీ పాలరాతితో చెక్కబడి వున్నై. నేల అంతా పచ్చలతో తాపటం చేసి వున్నది. అనేకరకాల వింతలతో, విలువైన వస్త్రాలతో ఆ మహలు ఎవరో గొప్ప ప్రభువు, ఎంతో కాలం కిందట కట్టించి నట్టుగా వున్నది.

రాజు ఆ మహలు అంతటా వింతగా చూచి, తిరిగి వచ్చిన దారినే పైన తోటలోకి చేరుకున్నాడు. బండని మళ్ళీ యథాప్రకారం వుంచి, అక్కడ ఆ బండ వున్నట్లు తనకు తప్ప మరెవరికీ తెలియకుండా వుండేటందుకు గాను, అక్షరాలు రాసి వున్న వైపు లోపలికి మూసి, అప్పటికి మనసుకి తృప్తి కలగక, ఆ చుట్టు పక్కల వున్న ఆకూ అలమూ తెచ్చి, కంటికి కనిపించకుండా బండ కప్పి వేశాడు.

తరవాత రాజు మేడకి తిరిగి వచ్చాడు. కాని, తాను తోటలో చూచిన, 'భూగృహం' గురించి రాణికి కూడా చెప్పలేదు. ఎందువల్ల నంటే, భూగృహ రహస్యం తనకి తప్ప, ఎలాంటి పరిస్థితులలోనూ మరే పురుగుకి కూడా తెలియ కూడదని రాజుకి ఆరాటం పట్టుకొన్నది.

అప్పుడు అటువంటి రహస్య గృహం తలవని తలంపుగా కంటబడింది గనక, రాజు ఇక తన కుమార్తెలకి అపదలు రాకుండా చూడటానికి చేయవలసిన ఏర్పాట్లు గురించే తన దృష్టి అంతా కేంద్రీకరించాడు.

మొట్ట మొదట రాజు ఒక వంద మందికి, మూడేళ్ళపాటు సరిపడేటంత ఆహారసామగ్రి అవీ, నమ్మకమైన సేవకుల సహాయంతో భూగృహంలోకి చేర్పించాడు. ఆ సేవకులను తిరిగి బయటికి రానివ్వకుండా, అందులోనే బంధించి, తాను మాత్రం తిరిగి మేడకు రోజూ లాగానే చేరుకున్నాడు. తర్వాత ముగ్గురు దాసీలతో తన ముగ్గురు కుమార్తెలను వెంటబెట్టుకొని తోటలోకి వెళ్ళాడు. రాజు





పిల్లలను షికారుకు తీసుకు వెళుతున్నాడు అనుకున్నది రాణి.


తోటచేరుకోగానే రాజు సరాసరి భూగృహద్వారం వద్దకు వెళ్ళి, అక్కడి ఆకూ అలమూ అవతలికి విసిరివేసి, దాని కిందవుండే బండను తొలగించాడు. దాసిలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయి, రాజు యింకా ఏమి చేస్తాడో అని ఆత్రంతో చూస్తున్నారు. రాజు ముందు దాసిలను పిల్లలతో సహా మెట్లుదిగి లోపల ప్రవేశించమని, వాళ్ళ వెనకనే తనూ లోపలికి వెళ్ళి, వెంటనే ఎవళ్ళకూ తెలియకుండా బండతో తిరిగి ద్వారం మూసివేశాడు.

ఒక్కొక్క మెట్టు దిగుతున్న కొద్దీ దాసిలకు భయం జాస్తి కాసాగింది. రాజు తమనీ, తన పిల్లల్నీ యిలా ఎక్కడికి ఎందుకు తీసుకు పోతున్నాడో వాళ్ళకు అర్థంకాలేదు. పోనీ అడిగి తెలుసుకుందామంటే, రాజుని ప్రశ్నించేందుకు వాళ్ళకు ధైర్యం చాలలేదు. అందుచేత ప్రాణాలు అరచేతుల్లో పట్టుకొని అలా దిగుతూ పోయి, చివరకు మహాలు చేరుకున్నారు. అంతకు ముందే రాజు అక్కడ ఉంచిన సేవకులను చూసేసరికి, దాసిలకు కొంత ధైర్యం కలిగింది. ఇదంతా రాజు ఏదో ముందు ఆలోచనతోనే ఏర్పాటు చేశాడని అప్పటికి తెలిసింది వాళ్ళకు.

ఆ తర్వాత రాజు అక్కడ వున్న వంద మంది నౌకర్లకూ, ఆ ముగ్గురు దాసిలకూ తన ముగ్గురు పిల్లల్నీ ఒప్పగిస్తూ, "ఈనా బిడ్డ తల్లులు ముగ్గురూ, నాకు లేక లేక కలిగిన సంతానం అని మీ అందరికీ తెలుసు కదా? వాళ్ళకు ఇప్పుడు నాలుగేళ్ళు. ఈ నాలుగేళ్ళలోనూ వాళ్ళు ఎన్నో గండాలు గడిచి, ఎలాగో బ్రతికి బైట పడిన సంగతి కూడా మీకు తెలిసే వున్నది. జాతక రీత్యా వాళ్ళకు మరో మూడు సంవత్సరాల వరకూ, దిన దిన గండమనట. ఈ మూడేళ్ళూ గడిచిపోతే

ఆ తర్వాత వాళ్ళకు ఎటువంటి భయమూ వుండదని తెలిసింది. ఈ మూడేళ్ళ పాటూ పిల్లను ఈ భూగృహంలో దాచి, మీకు ఒప్పగిస్తున్నాను. ఇందులోకి మరో పురుగు రావటానికి అవకాశంలేదు.

"నా పిల్లల్ని మీరు యిక్కడ కాపాడుతున్నట్లు మీకూ, నాకూ తప్ప మరెవ్వరికీ తెలియదు. రాణీకయినా తెలియదు. పుట్టినప్పటి నుంచీ యీ నా పిల్లల్ని ఏదో దుష్ట గ్రహం వెంటాడుతూ వున్నదని నా నమ్మకం. వాళ్ళు ఈ భూగృహంలో వున్నట్లు ఆ గ్రహానికి ఏ మాత్రం తెలిసినా, ఎలాగో పిల్లను తన పొట్టబెట్టుకుంటుంది. కనుక ఈ విషయం బైటికి పొక్కకుండా చాల జాగ్రత్తగా వుండటం మీ అందరి విధి. పిళ్ళు యిక్కడ వుంటున్నట్లు, పిట్టకయినా తెలిసింది అంటే, అది నా వల్లనన్నా కావాలి, లేదా మీ వల్లనన్నా కావాలి. నేను మాత్రం యీ మూడు సంవత్సరాలూ ఈ విషయం ఎత్తనే ఎత్తను. అలాగే మీరూ జాగ్రత్తతో వుండి నాకు సాయపడాలి. ఇందుకు భిన్నంగా జరిగిందీ అంటే జాగ్రత్త. అలా కాక నమ్మకంగా నా తల్లుల్ని కాపాడారంటే, గడువు తీరిన తర్వాత మీరు కని విని ఎరుగని గొప్ప బహుమతులు యిస్తాను.



"మీకు యీ మూడేళ్ళ పాటూ కావలసిన ఆహార పదార్థాలూ అవీ అన్నీ యిక్కడ వున్నై. కనుక యింతకు ముందు నా మేడలో వుంటగా నా తల్లులు ఎలా సుఖంగా వుండేవారో, యిప్పుడూ అలాగే ఏ కొరత లేకుండా వుండవచ్చు. నా చిట్టితల్లులు మరేదైనా అవసరమని మిమ్మల్ని అడిగితే, నాతో చెప్పండి. వెంటనే సమకూరుస్తాను. ఎప్పటికప్పుడు వచ్చి మీ అందరి క్షేమం కనుక్కుంటూనే వుంటాను. మరి ఇక నే వెళ్ళుదునా?" అని అడిగాడు రాజు.

ఇది వింటున్న ఆ వంట మంది, సేవకులూ, ముగ్గురు దాసీలూ మొట్ట మొదట

భయంతో తెల్లబోయి చూచినా, రాజు తీరా యీ సందర్భంలో చెప్పదలచిన సంగతులన్నీ చెప్పి ముగించే సరికి, వారందరూ ఎంతో సంతోషంగా కని పించారు.

దాసీలలో ఒకతె రాజుతో, "మొదట మొదట మమ్మల్ని యీ భూగృహంలోకి ఎందుకు తెచ్చారో అర్థంకాక మేము ఎంతో భయపడ్డాము. కాని యిప్పుడు నిజం తెలుసుకున్నాం. కనుక మాకు ఏవిధమైన చింతా లేదు. అమ్మాయిలను కంటికి రెప్పలా కాపాడవలెననే విషయం మీరు ప్రత్యేకించి ఇంత దూరం మాకు చెప్పవలెనా? అది మా విధి. మా ధర్మం మేము తప్పక నెరవేర్చు కుంటాము. మీరు యీ విషయమై ఎలాంటి దిగులూ పెట్టుకోక నిశ్చింతగా వుండండి. కాని, మా సందేహమల్లా ఒక్కటే. అమ్మాయిలను ఇక్కడ దాచినట్టు రాణిగారికి కూడా తెలియదంటిరే! మరి ఇప్పుడు మీరు ఒంటరిగా మేడకుపోతే, రాణిగారు అమ్మాయిలు ఏమైనారని అడగరా?" అన్నది.

"అదంతా నేను చూసుకుంటాను. మీరు పిల్లల విషయమై జాగ్రత్తపడండి!" అని చెప్పి రాజు తిరిగి తన మేడకు బయలుదేరాడు.

ఇక అక్కడ రాణి సంగతి ఎలా వుందో చూడండి. పిల్లల్ని షికారు కని తీసుకు వెళ్ళిన రాజు, అప్పటికి ఎంతో సేపు అయినా కూడా తిరిగి రాకపోయే సరికి, మళ్ళీ ఏం ప్రమాదం వచ్చి పడిందో అని ఖంగారు పడుతూ, ఎప్పు డెప్పుడు వస్తారా అని రాణి ఎదురు చూస్తున్నది.

ఇంతలో రాజు పెద్ద పెట్టున ఏడుస్తూ అక్కడికి చేరుకున్నాడు. షికారుకని పిల్లల్ని వెంటబెట్టుకు వెళ్ళిన రాజు, వాళ్ళు లేకుండా ఒక్కడే తిరిగి రావటం, పైగా ఏడుస్తూ రావటంచూసి మనస్థైర్యం తప్పి, రాణి మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది. —(ఇంకావుంది)





[illegible]

**3**

[దానశీలమహారాజు ఒకనాడు తోటలో షికారు చేస్తూండగా, ఒక బండరాయి కదిలించింది. ఆయన దానిని పక్కకు నెట్టి చూడగా, దిగువున భూగృహం వున్నది. రాజు తన ముగ్గురు కుమార్తెలనూ, పొత్తిళ్ళ పసికందులుగా ఆ భూగృహంలో వుంచి, దుఃఖిస్తూ తన భవనానికి బయలుదేరాడు. ఇది చూసిన రాణి భయంతో మూర్ఛపోయింది. తరవాత—]

రాజభవనంలోని పరిచారకులూ, దాస దాసీలూ రాజును ఓదారుస్తూ, రాణికి ఉపచారాలు చేయసాగారు. కొంతసేపటి వరకూ అక్కడ చేరిన వారిలో ఎవరి ముఖానా కళాకాంతి లేదు. ఈ లోగా ఆస్థానవైద్యుడు వచ్చి రాణికి ఒక ఔషధం యిచ్చాడు. మరి కొంతసేపటి కల్లా రాణికి స్పృహ వచ్చింది. అప్పుడు రాజుకు కాస్తంత స్థిమితం చిక్కింది. తరవాత ఆస్థానవైద్యుడు, రాజును అడిగే సరికి ఆయన యిలా చెప్పసాగాడు:

"నేను అలవాటు ప్రకారం దాసీలతో సహా పిల్లలను వెంట తీసుకొని మన తోటలో షికారుకు పోయాను. ఈ నాలుగేళ్ళలోనూ అమ్మాయిలు ఎన్ని గండాలు గడిచి బ్రతకటం కళ్ళారా చూసిన వాడినే కనుక, ఎప్పటికప్పుడు ఎంతో జాగ్రత్తతో వుండటం అవసరమైంది. అందుకని,



పిల్లలు ఇల్లు వదలి బైటికి కదిలినప్పుడల్లా, వాళ్ళ వెంటనే నేనూ, ఒక వంద మంది సేవకులను వెంటబెట్టుకుని వుండ వలసి వస్తున్నది. అలాగే ఇవాళ కూడా తోటలో చుట్టూ వందమంది సేవకులను కాపలా వుంచి, వాళ్ళ మధ్య నేనూ, దాసీలూ, అమ్మాయిలను వెయ్యికళ్ళతో కనిపెడుతూనే వున్నాం. ఇంతలో ఒక పెద్ద సుడిగాలి వచ్చింది. ఆ సుడిగాలికి బ్రహ్మాండమైన దుమ్మురేగి, మేము ఒక్క క్షణం కన్నుమూశాము. తిరిగి కన్ను తెరిచేంతలో, మూడు రాబందులు వచ్చి నా చిట్టితల్లులు ముగ్గురినీ ఎత్తుకు పోవటం కనిపించింది." అని రాజు యింకా ఏమో చెప్పబోతూండగా రాణి, "హా" అంటూ విరుచుకు పడిపోయింది.

పరిచారికలు రాణికి ఉపచారాలు చెయ్యసాగారు. కొంతసేపటికి రాణికి స్పృహ వచ్చింది. అప్పుడు రాజు తిరిగి యిలా చెప్పకు పోయాడు: "ఇదంతా ఒక్క" క్షణంలో జరిగిందంటే నమ్మండి. అప్పటికి గబ గబ ఆ రాబందులు ఎగిరి పోయిన దిక్కుకు నేనూ, వందమంది నౌకర్లూ, దాసీలూ కూడా పరుగెత్తాము. నడక అలవాటు లేని నేను వెనకపడ్డాను. కాని, నా పరిజనము మాత్రం, శర వేగంతో ఆ రాబందులు వెళ్ళిన దిక్కుగా వెంబడించారు. ఐతే, మరి కొంచెం సేపటికి రాబందులు కంటికి కనిపించ కుండా మాయమైపోవటంతో, నిరాశ చెంది పరివారమంతా మళ్ళుముఖం పట్టారు. ఇది చూసి నాకు మరి ముందుకు అడుగు పడక ఆగిపోయాను.

"ఆ సమయంలో మరొక గొప్ప చిత్రం జరిగింది. తిరిగివస్తూన్న నా పరివారం—వంద మంది సేవకులూ, ముగ్గురు దాసీలూ — నేను చూస్తూవుండగానే కొంత దూరం వచ్చి వచ్చి, ఒక్కసారి పక్షులుగా మారి, ఆ రాబందులు పోయిన దిక్కుగానే వాళ్ళూ ఎగిరిపోయారు. ఇదంతా కళ్ళబడటంతో నా మనస్సు

వికలమై పోయింది. ఇంకెన్ని కష్టాలు అనుభవించాలో. దేవుడు నన్నింకా యీ లోకంలో ఎందుకు అట్టేపెట్టాడో అని ఏంచింది," అని రాజా దుఃఖించసాగాడు.

ఈ లోగా యీ వార్తలు చెవినిపడిన జ్యోతిష్కుడు కూడా అక్కడకు రావటం జరిగింది. జ్యోతిష్కుణ్ణి చూస్తూనే రాణి ఆయన పాదాలపైన పడి. "మీరు ఆనాడు అంత చెప్పినా కూడా పిల్లల్ని రక్షించుకోలేక పోయాం. నా చిట్టితల్లులు నా ఎదట లేకపోతే పోయారు. దాపరికం లేకుండా ఒక్క సంగతి చెప్పండి. కనీసం వాళ్ళు ప్రాణాలతోనైనా వున్నారో లేదో తెలుసుకుంటే కాని నేను బతకను," అంటూ భోరున ఏడ్చింది.

జ్యోతిష్కుడు మళ్ళీ ఒకసారి పిల్లల జాతకం తెప్పించింది. నిదానంగా పరిశీలించి చూసి యిలా చెప్పాడు: "అమ్మా, జాతకరీత్యా పిల్లలకు యీ పీడు, ఏ విధమైన గండమూ కనపడదే! మరి, యిది ఎలా జరిగిందో నాకే బోధపడటంలేదు. పిల్లలు ఎక్కడ వున్నారో మాత్రం యీ పళంగా చెప్పలేను గాని. వున్నచోట మాత్రం వారు ముగ్గురూ క్షేమంగానే వున్నారు. అమ్మాయిలే కాదు. వారి వెంట అండగా వెళ్ళిన వందమంది పరిచారకులూ, దాసీలూ కూడా సురక్షితంగానే వున్నారు. ఈ మూడేళ్ళలో వాళ్ళు ఏ నాటికో ఒక నాటికి తిరిగి మామూలు రూపంలో వచ్చే అవకాశం స్పష్టంగా






కనిపిస్తోంది. కనుక దేవుని మీద భారం వేసి అటువంటి సుదినం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడటం కంటె, మనం చేయగలిగింది ఏ ముంది, తల్లీ!" అని ధైర్యం చెప్పాడు.

రాజు యింతకు ముందు పెద్ద పెట్టున ఏడుస్తూ రావటం, ఆ తర్వాత తన విధానికి అనుగుణంగా అనేక విషయాలు జరిగినట్టుగానే రాణికి నచ్చచెప్పటం, అన్నీ రాజు కావాలని కల్పించినవే అని, అక్కడ వున్నవారెవరూ తెలుసుకో లేక పోయారు. తన ముగ్గురు కుమార్తెలూ, వాళ్ళతో పాటు బయల్దేరిన ముగ్గురు దాసీలూ, మరో వంద మంది నౌకర్లూ కన్పించకుండా పోవటం చూసి, రాణి తనను ప్రశ్నిస్తే ఏమి జవాబు చెప్పటమా అని రాజు తీవ్రంగా ఆలోచించే, ఈ నాటకం కల్పించాడు.

పిల్లల్ని భూగృహంలో దాచిన సంగతి వెల్లడి చేదామా అంటే ఆ సంగతి తన కుమార్తెలను పొట్టబెట్టుకోవాలని చూస్తున్న దుష్టగ్రహం చెవిని పడుతుం దేమోనని రాజు అనుమానం. ఏమైతేనేం, లేక లేక కలిగిన తన కుమార్తెలను రక్షించుకోవటాని కని రాజు ఎంతో నేర్పుగా, ఎవరికీ అనుమానం కలగకుండా, ఈ విధంగా పెద్ద అబద్ధం ఆడేశాడు.

రాజు ఆడిన యీ కపటనాటకం రాణి నమ్మింది. సిబ్బందులు అందరూ నమ్మారు. కాని ఒకటి; తన పిల్లలు ఎక్కడో ఒక చోట ప్రాణాలతో బ్రతికే వున్నారు అని జ్యోతిష్కుడు చెప్పటం వల్ల రాణి కొంచెం కుదుటపడింది. ఎక్కడో అక్కడ బ్రతికి బాగా వుంటే, అదే పదివేలు అనుకొని మనస్సులో తృప్తిపడింది. వెంటనే సేవకులను రాజ్యంలో నాలుగు మూలలకూ పంపి, బిడ్డలను వెతికి తెప్పించ వలసిందని రాజును అదేపనిగా వేధించ జొచ్చింది. పిల్లలు భూగృహంలో వున్నారని తెలి



యుదా రాజుకి? ఐనా, రాణి కోరిక ప్రకారం ఆమెను తృప్తిపరచేందుకు సేవకులను దేశం నలుమూలలకీ పంపక తప్పిందికాదు.

తక్షణమే రాజుగారి సేవకులు గుర్రాల మీద బయల్దేరి వెళ్ళారు. కాని ప్రపంచంలో బైట మనుషులకు కనిపించే చోట వుంటేగా ఆ పిల్లలు, ఆ సేవకులకు ఆచూకి దొరికేది? వాళ్ళు భూగృహంలో సురక్షితంగా వున్నారాయె. అందువల్ల బయల్దేరి వెళ్ళిన సేవకులు ఒక్కొక్కరే బిడ్డలు కనిపించ లేదంటూ తిరిగి వచ్చేశారు.

రోజులు గడిచిన కొద్దీ రాణికి బిడ్డల గురించి ఆరాటమూ, బెంగా హెచ్చు అవుతూవుంది. రాజు మాత్రం తెలివిగా నాటకం ఆడి తన పిల్లల సంగతి ఎవరికీ ఏ మాత్రం ఆచూకి దొరకకుండా కట్టుబాట్లు చేశాను గదా అని మురిసిపోతున్నాడు. కాని, పైకి మాత్రం తను పిల్లలను గురించి బెంగపడుతున్న వాడిలాగా లోకం కోసం దుఃఖం నటిస్తూనే వున్నాడు.

ఇలాగా రాజు ప్రతి రోజూ మూడో కంటివానికి తెలియకుండా భూగృహంలోకి వెడుతున్నాడు, వస్తున్నాడు. తన ముగ్గురు బిడ్డలూ సురక్షితంగా, తను ఏర్పరచిన నౌకర్ల అండన పెరుగుతూ వుండటం చూచి పరవాలేదు గదా అని నిశ్చింతగా వున్నాడు. ఇలా ఒకవారం రోజులు గడిచినై. మళ్ళీ రాజుకు ఇప్పుడు మరొక పెద్ద అనుమానం పట్టుకున్నది. అదేమిటి అంటె—తను భూగృహంలోకి వెళ్ళి, పిల్లలను చూచి, వాళ్ళు సురక్షితంగా వున్నారా లేదా అని తెలుసుకుంటె గాని ఒక్క రోజు కూడా నిలవలేదు. కాని మరో పురుగుకి కూడా తెలియకుండా యిలా రోజూ దొంగతనంగా భూగృహంలోకి వెడుతూ వస్తూ వుండటం చాలా కష్టమైన పనిగా తోచింది. ఒక నాడు కాకపోతే ఒక నాటికైనా ఈ సంగతి ఎవరి కంటనో ఒకరి కళ్ళ పడుతుంది.



అది ఆ నోటా ఆ నోటా వెల్లడి అయి, తను ఏ దుష్టగ్రహాన్ని గురించి భయ పడుతున్నాడో ఆ గ్రహానికి తెలిసిపోవచ్చు. పిల్లల జాడ తెలిసిందీ అంటే ఆ గ్రహం ఏదో విధంగా వాళ్ళను పొట్టబెట్టుకుం టుంది కాని మానదు. కనుక, ఏమి చెయ్యటమా అని రాజు యీ క్రొత్త దిగులులో కుంగిపోసాగాడు. ఎంత ఆలో చించినా ఏమీ పాలుపోయింది కాదు. అలా మరి నాలుగు రోజులు గడిచినై.

ఒకనాడు రాజు ఆ సాయంత్రమే భూగృహంలో పిల్లల్ని చూసి కొంచెం సేపటి క్రితమే వచ్చాడు. బిడ్డలు సుర క్షితంగానే వున్నారు. అందువల్ల రాజు తన శయనాగారంలో ఏ బెంగా లేకుండా నిశ్చింతగా నిద్రిస్తున్నాడు. మంచి నిద్రలో వుండగా ఒక రాత్రివేళ ఎవరో వచ్చి తనను తట్టి లేపుతున్నట్టు అలికిడి అయింది. కళ్ళు తెరిచి చూశాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. ఎందు వల్లనంటే, ఆ వచ్చినది మరెవ్వరో కాదు, తన ముద్దుల కూతురు సుహాసిని!

కొంత సేపటివరకూ రాజు యిది కల అనే అనుకున్నాడు. కాని సుహాసిని పక్క పైన కూచుని, తండ్రిని ఎక్కి తొక్కుతూ, చిలిపి చేష్టలు చేస్తూ, "నాన్నా, నాన్నా!" అని పిలిచేసరికి, రాజు అది ఎంతమాత్రమూ కల కాదు అని నిశ్చయించాడు. తన కళ్ళ ఎదుట తన చిట్టితల్లి సుహాసిని చిన్నారిచేష్టలు చేస్తూ వుంటే, ఎలా కాదనటం? చిలకపలుకు లతో తనను పిలవటం స్పష్టంగా విన బడుతూ వుండగా, అది కల అని ఎలా అనుకోవటం? రాజు వెంటనే లేచి తెలివి తెచ్చుకొని, సుహాసినిని గుండెలకి హత్తు కుంటూ, "ఇదేమిటి తల్లీ, ఈ అర్ధరాత్రి వేళ నువ్వు యిక్కడికి ఎలా వచ్చా వమ్మా? ఏరి, మన దాసీలు ఏరి? పరి వారమంతా ఎక్కడ? నౌకర్లు ఏమైనారు? అంతమందిని విడిచిపెట్టి నివు ఒక్కర్తివే ఎలా వచ్చావు, తల్లీ! చిత్రంగా వుందే."

అంటూ, ఒక వంక ఆశ్చర్యంతోనూ, మరొక వంక చెప్పరాని ఆత్రంతోనూ వందలూ, వేలూ ప్రశ్నల వెంబడి ప్రశ్నలు కురిపించాడు.

సుహాసిని కొంతసేపటివరకూ బదులు చెప్పలేదు. కాని తండ్రి చెయ్యిపట్టుకొని, మంచం మీదినించి క్రిందికి దిగమని సైగ చేసి, తర్వాత ఆ గదిలో ఉన్న ఒక పెద్ద పటం దగ్గిరికి తీసుకువెళ్ళి, "అదో, ఆ బొమ్మ చూశా?" అని అడిగింది. రాజుకి ఏమీ అర్థం కాలేదు.

"నువ్వు యిక్కడికి ఎలా వచ్చావు, తల్లీ అని అడుగుతుంటే పటం చూపిస్తా వేమిటమ్మా? ఆ పటం నీకు కావాలంటావా? అలాంటివే కాదు. అంతకన్న మంచి మంచి పటాలు ఎన్నో యిస్తాను. నువ్వు యిక్కడికెలా వచ్చావో ముందు చెప్పు, తల్లీ?" అని రాజు మళ్ళీ బ్రతిమాలసాగాడు.

అప్పుడు సుహాసిని, "అదే నాన్నా! అదే, ఆ పటంలోంచే వచ్చా," అన్నది.

పటంలోంచి ఏమిటి, రావటం ఏమిటి అని రాజు కొంతసేపు మథనపడి, చివరకు పటాన్ని తొలగించి చూశాడు. పటాన్ని గోడ నించి తొలగించటం తోటే కంటబడిన దృశ్యం చూసి రాజు కొయ్యబారి, అలాగే నిలబడిపోయాడు. ఎందువల్లనంటే, పటం తీసిన చోట గోడలో ఒక పెద్ద ద్వారం కనిపించింది. రాజు కాసేపటికల్లా తెప్పరిల్లుకొని, కూతురుని



వెంట బెట్టుకుని, ఆ ద్వారం వెంట లోపలికి పోయారు. అలా పోగా పోగా అది ఒక సొరంగం అని రాజు తెలుసుకున్నాడు. అందుచేత బిడ్డను నడిపించక, ఎత్తుకుని జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ సాగాడు.

సొరంగంలో సగం దూరం వెళ్ళేసరికి, మహిషిని పెంచేటటువంటి దాది ఎదురు వచ్చింది. మహిషిని గదిలోంచి మాయం అయ్యేటప్పటికి దాది నిద్రలో వున్నది. కాని మరుక్షణంలోనే మెలకువ వచ్చి చూసేసరికి పక్క మీద మహిషి లేక పోవటం, అందుకు తగినట్టు గోడలో అదివరకు అడ్డం వున్న చోట ద్వారం కనిపించటం. దాదికి హడలు పుట్టించింది.

దాది పిల్లను వెతుక్కుంటూ తనకు తెలియకుండానే ఆ సొరంగంలోకి వచ్చేసింది. పిల్లను వెంట బెట్టుకుని వస్తున్న రాజుని చూచేసరికి ఆమెకు ప్రాణం లేచి వచ్చింది. ముగ్గురూ కలిసి తీరా సొరంగం చివరికి వచ్చి చేరుకునేసరికి, అంతకు ముందు అక్కడ మహిషిని గదిలోకి దారి నిచ్చే ద్వారం కనిపించలేదు. రాజూ, దాదీ కూడా హడలిపోయారు. ఒకవేళ యీ సొరంగంలో దారి తప్పి వచ్చామా అని అనుమానం కలిగింది వాళ్ళకు.

రాజు వెంటనే మహిషిని, దాదిని అక్కడే వుండమని, తను తిరిగి సొరంగం చివరిదాకా పోయాడు. ఎంతదూరం పోయినా ఒక్కటే మార్గం కాని, రెండు మార్గాలున్నట్టు కనిపించలేదు. సొరంగం పోయి పోయి మళ్ళీ రాజు గదిలోకి దారి తీసింది. అందువల్ల రాజు యిప్పుడు మరీ భయపడసాగాడు. ఏమిచేయటమా అనే ఆలోచనతో తిరిగి దాది వున్న చోటికి వచ్చాడు. కాని చిత్రంలో చిత్రం!

ఒక్క క్షణం క్రితం అక్కడ తను వదిలి వెళ్ళిన దాది, కుమార్తె కూడా మాయమయ్యారు. ఇదంతా చూచి రాజుకి పిచ్చెత్తినట్లయింది. ఏమీ పాలుపోక అలా ఆ సొరంగంలోనే అటూ యిటూ పచారు చెయ్యసాగాడు. —(ఇంకావుంది)






**4**

[తన ముగ్గురు కుమార్తెలనూ రాబందులు ఎత్తుకు పోయినవని రాజా అందరికీ చెప్పి, నమ్మించాడు. ఒక రాత్రివేళ ఆయన శయనాగారం లోపలికి పెద్ద కుమార్తె సుహాసిని వచ్చింది. రాజా ఆ పిల్లను దాదికి ఒప్పచెప్పి, శయనాగారం వైపుకు వున్న సొరంగ మార్గాన్ని పరీక్షించి, తిరిగి వెళ్ళేసరికి సుహాసినీ, దాదీ కూడా కనిపించలేదు. తరవాత—]

సొరంగ మార్గంలో మరెక్కడైనా రహస్య ద్వారాలున్నవేమో అనుకుంటూ రాజా మరికొంత దూరం వెళ్ళేసరికి, ఒక చోట హఠాత్తుగా ద్వారం ఒకటి కనిపించింది. దాని ముందు దాదీ, సుహాసినీ కనిపించే సరికి రాజాకు ప్రాణం లేచి వచ్చింది. అతడు ద్వారం గుండా లోపలికి పోయే సరికి, అది సుహాసిని పడక గదికి చేర్చింది.

ఈ వింత సొరంగాన్ని గురించిన రహస్యం ఏమిటా అని చూడగా, సుహాసిని గది గోడలకి చుట్టూ ఎక్కడా సందు లేకుండా పై కప్పు నించి కింద నేలవరకూ అద్దాలు వున్నై. ఆ అద్దాలన్నింటిలోకీ ఒక అద్దం చాలా విచిత్రమైంది. నేల మీద ఒక చోట ఒక చిన్న మీట వుంది. దానిని నొక్కితే, ఆ అద్దం నేలలోకి దిగి పోయి, అక్కడ ఒక ద్వారం ఏర్పడు



తుంది. ఆ ద్వారమే సొరంగంలోకి దారి తీసింది. గదిలో వున్నట్టుగానే ద్వారం దాటగానే, సొరంగం మొదటిలో కూడా ఒక చిన్న మీట వున్నది. అది నొక్కితే అద్దం మామూలుగా పైకి వచ్చి ద్వారం మూసుకుపోతుంది. మళ్ళీ మీట నొక్కితే అద్దం భూమిలోకి దిగిపోయి, ద్వారం కనిపిస్తుంది.

ఐతే, సుహాసిని రాజు గదికి ఎలా చేరుకున్నది. అనే ప్రశ్న ఒకటుంది. మామూలు ప్రకారంగా దాది, సుహాసినిని తన పక్కలో పడుకో బెట్టుకుని, నిద్ర పోతున్నది. ఒక రాత్రివేళ సుహాసినికి మెలుకువ వచ్చింది. ఆ పిల్ల ఏమీతోచక గదిలో అటూ యిటూ తిరుగుతూండగా, ఆమె కాలు అక్కడ నేల మీద వున్న మీట పైన పడింది. వెంటనే అద్దం భూమిలోకి దిగిపోవటం, అక్కడ ద్వారం తెరుచుకోవటం జరిగింది.

ఈ వింత చూసి సుహాసిని సొరంగంలో ప్రవేశించి నడవగా, అది చివరికి రాజు శయనాగారంలోని పటం వెనకకు చేర్చింది. చీకటిగా వుండటం చేత, అక్కడివరకే సొరంగం వున్నదని, అది దాటి మరొక్క అడుగు వేస్తే, అక్కడ పటం వుందని సుహాసినికి తెలియలేదు. ఇంకా పోదామని ముందుకు నెట్టుకు పోయేసరికి, పటం సందిచ్చి, ఆ సందు లోంచి నిద్రిస్తున్న రాజు కనిపించాడు ఆమెకు. తక్షణమే సుహాసిని, తండ్రి వద్దకు పోవాలనే ఆత్రంతో ఎన్నో శ్రమలు పడి, బ్రహ్మాండమైన ఆ పటాన్ని ఒత్తిగించింది. ఆ తరవాత రాజు ఈ వింత సొరంగంలో చిక్కుకొని, దారీ తెన్నూ తెలియక చాలాసేపు తిరిగాడు.

ఈ విధంగా వింత సొరంగం యొక్క రహస్యమార్గం గురించి తెలుసుకున్న తర్వాత రాజుకి ఒక వంక సంతోషమూ, మరో వంక భయమూ కూడా కలిగినై. ఎవళ్ళకంటా పడకుండా, ఎలాగే భయపడుతూ భయపడుతూ రాజు యీనాటి



వరకూ, తోటలో నించి భూగృహానికి వస్తూ పోతూ వున్నాడు. ఇప్పుడు ఈ సొరంగ రహస్యం తెలియటం వల్ల, ఆ భయం తీరిపోయింది. ఇష్టం వచ్చినప్పుడల్లా తన గది నించి బ్రహ్మరుద్రులకు తెలియకుండా భూగృహంలోకి వచ్చి, తన పిల్లల్ని చూచుకోవచ్చు. ఈ అదృష్టానికి రాజు ఉప్పొంగిపోయాడు.

కాని, ఇప్పుడు రాజుకి మరొక భయం పట్టుకుంది. తగిన కట్టుబాటు చెయ్యకపోతే, యిప్పటిలాగే ఇక ముందు కూడా సుహాసిని గాని, మిగతా పిల్లలు గాని ఈ సొరంగం లోనించి తన గది చేరుకోవటం, అక్కడి నించి బైటి ప్రపంచంలోకి రావటం జరగవచ్చు. అంతటితో తన జాగ్రత్త ఎందుకూ పనికిరాకుండా పోయి, పిల్లలు దక్కకుండా పోవచ్చు. అలా జరగకుండా వుండటానికి ఉపాయమేమిటా అని రాజు అదే పనిగా ఆలోచించసాగాడు.

రాజుకు చివరికి ఒక ఉపాయం తట్టింది. అది ఏమిటి అంటే — ఇంతకు ముందు తన ముగ్గురు కుమార్తెలకు భూగృహంలో మూడు గదులు విడివిడిగా ఏర్పాటు చేసి, ఒక్కొక్కరిని, ఒక్కొక్క దాది సంరక్షణలో వుంచాడు. కాని ఇక మీదట ఈ మీట వున్న గదిలో ఎవరు సంచరించినా, తను తలచినట్టుగా ప్రమాదాలు కలగవచ్చుననే ఉద్దేశంతో, ఆ గది ఖాళీగా వుంచటానికే రాజు నిశ్చయించాడు. తన ముగ్గురు కుమార్తెలను తక్కిన రెండు గదులలోనే వుంచి కాపాడుతుండమని దాదులను హెచ్చరించాడు. వాళ్ళు అలాగే అన్నారు. అప్పటికి రాజు మనసు కుదుటబడింది.

రాజు కొంతసేపు ముగ్గురు కుమార్తెలతోనూ ముచ్చటలాడి, తర్వాత ఇంతకు ముందు సుహాసిని వుంటున్న అద్దాల గదిలోకి వచ్చాడు. మీట మీద కాలు వేసేసరికి, అద్దం భూమిలోకి దిగిపోయి ద్వారం ఏర్పడింది. ద్వారం గుండా



సొరంగంలోకి వచ్చి, తిరిగి అక్కడ వున్న మీట కాలితో నొక్కేసరికి, మళ్ళీ ద్వారం మూసుకున్నది.

ఈ రహస్య మార్గం వున్నట్టు ఎలాగో తనకు తెలియజేసిన దేవుడికి నమస్కరిస్తూ, రాజు సంతోషంగా తిరిగి తన గది లోకి వచ్చి చేరుకున్నాడు.

• • •

ఆ నాటి నుంచి రాజు భూగృహంలోకి ఎన్నోసార్లు ధైర్యంగా వెళ్ళి వస్తూ వున్నాడు. క్రమంగా రోజులు గడుస్తున్నై. కాని తండ్రి తమని చూడటానికి వచ్చినప్పుడల్లా, రాకుమార్తెలు ముగ్గురూ తండ్రి కాళ్ళని చుట్టేసుకుని, ''మేము కూడా నీతో వస్తాం, నాన్నా!'' అని జాలిగా అడిగే వాళ్ళు.

రాజుకు తన కుమార్తెలను వెంట తీసుకు వెళ్ళగల ధైర్యంలేదు. అందుకని, ''ఇప్పుడు కాదమ్మా, మరొకసారి తీసుకు వెళతాలే,'' అని సమాధాన పరుస్తూండేవాడు.

క్రమంగా నెలలు దొర్లిపోతున్నై. ముగ్గురు కుమార్తెలూ సురక్షితంగా పెరుగుతున్నందుకు రాజు మురిసిపోతున్నాడు. కాని అక్కడ రాణి, ఒక్కొక రోజు గడిచిన కొద్దీ బెంగతో కృంగి కృశించి పోతున్నది. ఏమంటె, పిల్లల్ని వెతుక్కుంటూ వెళ్ళిన నౌకర్లలో చాలా మంది తెల్లమొగం వేసుకుని తిరిగి వచ్చేశారు. మధ్య మధ్య రాణి, జ్యోతిష్కుణ్ణి పిలిపించి, ''స్వామీ, పిల్లలు క్షేమంగా వున్నట్టేనా?'' అని అడుగుతుండేది.

''ఉన్నారమ్మా. పిల్లలే కాదు, వాళ్ళను వెతకబోయిన ఆ వందమంది నౌకర్లూ, పిల్లల వెంట వెళ్ళిన దాసీలూ కూడా క్షేమంగానే వున్నారు. మీరేమీ దిగులు పడకండి. కొద్ది రోజుల్లో అందరూ క్షేమంగా తిరిగి వచ్చే సూచనలు జాతకలలో స్పష్టంగా కనిపిస్తున్నై.'' అని చెబుతూండేవాడు జ్యోతిష్కుడు. అలా చెప్పి

నప్పుడు మనస్సులో తృప్తిపడి, కొద్ది రోజుల వరకూ రాణీ మళ్ళీ నిశ్చింతగా వుండేది.

ఈ విధంగా మరి రెండు సంవత్సరాలు గడిచినై. భూగృహంలోకి రహస్య సొరంగం ద్వారా రాజు రోజూ వెళ్ళి కుమార్తెలను చూచి వస్తున్నాడు. బిడ్డలు ముగ్గురూ సురక్షితంగానే వున్నారు. కాని రాజు భూగృహంలోకి వెళ్ళినప్పుడల్లా పిల్లలు తమని బయటికి తీసుకు వెళ్ళమని గోలచేస్తూనే వున్నారు.

"మమ్మల్ని యిక్కడ ఎందుకు వుంచావు, నాన్నా? అమ్మని చూడాలి. అమ్మ దగ్గిరికి తీసుకెళ్ళూ...." అని ఏడుస్తూ, తండ్రికాళ్ళు చుట్టేసుకునే వాళ్ళు. వాళ్ళు అలా కన్నీరు కారుస్తూ వుండటం చూచినప్పుడల్లా, రాజు గుండె తరుక్కుపోయేది. "పోనీ ఒక్కసారి తీసుకుపోయి పిల్లల్ని రాణీకి చూపించుదామా?" అని పించేది. కాని అలా చేయటానికి ధైర్యం చాలేది కాదు. "ఏమైనా సరే యీ ఒక్క ఏడాది చలించ కూడదు?" అనుకున్నాడు రాజు. అందు చేతనే పిల్లలు ఎంత ఏడ్చినా, ఏదో విధంగా వాళ్ళని సముదాయించు కొంటూ కాలం వెళ్ళతోస్తున్నాడు.

ఇలా మరికొన్నాళ్ళు గడిచింది. మరొక్క నాలుగు రోజులకల్లా పిల్లలకు ఏడేళ్ళూ నిండుతై. ఆ నాటికి గండాలు గడిచి వాళ్ళు భూగృహం నించి విడుదల





కావచ్చు. '' ఇప్పటి వరకూ, ఈ మూడు సంవత్సరాలలో పిల్లలకి ఏ విధమైన ఆపదా రాకుండా భూగృహంలో సురక్షితంగా కాపాడ గలిగానే. ఇకనే ముంది! నాలుగు రోజులు కాస్త జాగర్తగా వుంటే నాలుగేళ్ళూ నిండుతై. జాతకరీత్యా బిడ్డలు ప్రమాదం లేకుండా బ్రతికి బయట పడతారు.'' అను కొన్నాడు, రాజు సంతోషంగా.

యథాప్రకారం రాజు ఒకనాటి ఉదయాన్నే రహస్య మార్గం ద్వారా పిల్లల్ని చూడటానికి వచ్చాడు. బిడ్డలు భూగృహంలో వుండవలసిన గడువు ఆ నాటితో తీరిపోతుంది. పిల్లలు తండ్రిని చూడటం తోనే కాళ్ళకి చుట్టేసుకుని, '' ఈ వేళ మమ్మల్ని బైటికి తీసుకు వెడితే కాని వీల్లేదు.'' అని పట్టుబట్టి మారాం చేస్తూ కూచున్నారు.

బిడ్డల దుఃఖం చూచి రాజు మనస్సు కరిగిపోయింది. '' ఈ మూడు సంవత్సరాలూ ఏ ఆపదా రాలేదు గదా? ఇంకొక్క ఇరవైనాలుగు గంటలలో ఏమి రాబోతుంది? పైగా, ఇంత మంది పరివారం కాపుదల వుండగా అలాంటిది ఎలా జరుగుతుంది? '' అని మనస్సుకు ధైర్యం తెచ్చుకుని, పిల్లలు ముగ్గురనూ వంద మంది నౌకర్లూ, ముగ్గురు దాసిలతో సహా భూగృహంలోంచి తోటలోకి తీసుకు వచ్చాడు. ముగ్గురు పిల్లల్ని దాసిలకి చూస్తూవుండమని వప్పగించి తనూ వాళ్ల దగ్గిరే కూచున్నాడు.

పిల్లలకు, వంద మంది నౌకర్లూ చుట్టూతా కాపలా వున్నారు. ఇన్నాళ్ళకు మళ్ళీ బయటి ప్రపంచం చూడగానే పిల్లలు ఎంతో సంతోషంగా గంతులు వేస్తూ తోటలో ఆడుకుంటున్నారు. వాళ్ళ ఆటలు చూచి రాజు ఎంతో మురిసి పోతున్నాడు.

ఇంతలో వున్నట్టుండి ఒక్కసారిగా బ్రహ్మాండమైన సుడిగాలి వచ్చింది. ఆ ప్రదేశ మంతా దుమ్ముతో నిండింది.



అక్కడ వున్నవాళ్ళంతా ఒక్కక్షణం కన్ను మూశారు. మళ్ళీ కళ్ళు తెరిచే సరికి మూడు గద్దలు వచ్చి ముగ్గురు పిల్లల్నీ ఎత్తుకుపోవటం మాత్రం కనపడింది వాళ్ళకు. రాజు స్మృతితప్పి పడిపోయాడు. దాదులు రాజుకి పరిచర్య చేస్తున్నారు. నౌకర్లు వందమందీ ఆ గద్దలు పోయిన వైపుకి పరుగెత్తారు.

రాజుకి స్పృహవచ్చి, "నౌకర్లు ఏరీ?" అని అడిగేటప్పటికి, సరిగా అప్పుడే వాళ్ళు ఒకరి వెంట ఒకళ్ళు తెల్ల మొగాలు వేసికొని తిరిగిరావటం జరిగింది. సరిగా మూడు సంవత్సరాల క్రిందట రాజు ఏ కల్పిత వాక్కులు పలికి కపటనాటకం ఆడాడో, అది యీనాడు అక్షరాలా తన కళ్ళ ఎదట జరిగే సరికి రాజు తనని తాను తిట్టుకున్నాడు.

"ఈనాడు యిలా యిలా జరగవలసి వున్నది గనుకనే, ఆనాడు ఏదో దుష్టగ్రహం నాలో ప్రవేశించి నా చేత అటువంటి అశుభవాక్కు పలికించింది. అందుకనే, 'నుదుట వ్రాయనిదె నోట పలికించ'దని అంటారు పెద్దలు," అనుకొంటూ రాజు కంటికి మంట్లో [illegible] దుఃఖించసాగాడు.

ఐతే విధివిలాసము· రాజు మనస్సు ఆ ప్రకారమే జరిగింది. నాడు సంవత్సమైన శక్తి ఏదో ప్రేరేపించదా? ఇంకొక్క రాజుకి మనసుయొక్క కట్టుఏమి రాబో బిడ్డలను తోటలోకి తీసుకు [illegible] బుద్ధి పుట్టింది. జరగవలసిన ప్రమాదమేమో జరిగింది. తీరా యిప్పుడు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుందామనుకుంటే ఏమి లాభం?

ఇక యిప్పుడు రాణి దగ్గర ఈ విషయం దాచవలసిన పని ఏముంది? రాజు పరివారంతో సహా మహలు చేరుకుని, చెప్పలేక చెప్పలేక ఈ వైనం రాణితో చెప్పాడు. ఇంకేమున్నది రాజూ, రాణీ కూడా దుఃఖసముద్రంలో మునిగిపోయారు.

—(ఇంకా వుంది)





# 5

[దానశీలమహారాజు తన ముగ్గురు కుమార్తెలనూ, భూగృహంలో మూడేళ్ళపాటు రహస్యంగా వుంచి కాపాడాడు. ఇంకొక్క అరవైనాలుగ్గంటల్లో ప్రమాదం తప్పిపోతుండగా, తొందరపడి కుమార్తెలను, భూగృహం నుంచి బయటికి తీసుకువచ్చాడు. వెంటనే మూడు గద్దలు వచ్చి పిల్లల్ని తన్నుకుపోయినై. రాజూ, రాణీ దుఃఖపడసాగారు. తరవాత—]

కొంతసేపటికి దానశీల మహారాజు దుఃఖాన్నుంచి తేరుకోగలిగాడు. రాణీ మాత్రం ఆ కఠోరవార్త విని, ఆగని దుఃఖావేశంలో కొయ్యబారి పోయింది. పిల్లలతో బాటు రాణీ కూడా తనకు దక్క కుండా పోతుందేమోనని రాజు చాలా భయపడ్డాడు.

“మూడేండ్లూ వెళ్ళింది నేను సత్యంగానే. ఈ ఒక్కరోజు కూడా పిల్లల్ని ఎలాగో సమాధాన పరచగలిగితే, ఈ ముప్పురాక పోయుండును గదా? పాపిష్ఠివాడిని. అప్పటి నిబ్బరం లేక, చూస్తూ చూస్తూ చేతులారా నా బిడ్డ తల్లుల్ని పక్షులకు అప్పగించుకొన్నాను. నా రాణీ కూడా నాకు దక్కదా?” అంటూ రాజు మొత్తుకొన్నాడు. అక్కడ ఒకళ్ళ ముఖానా కత్తి వాటు వేస్తె నెత్తురు చుక్క లేదు. గంటలు గడిచినా రాణికి తిరిగి స్పృహరాక



పోయేసరికి. ఆమె బ్రతికి ఎత్తులేదని అందరూ నిరాశచెందారు.

మరికొద్ది సేపటికల్లా ఆస్థానవైద్యుడు అక్కడికి వచ్చాడు. రకరకాల ఔషధులు ఇచ్చి, ఎలాగైతే నేం చివరకు రాణికి స్పృహ తెప్పించాడు. తిరిగి అందరి ముఖాలలో క్షణమాత్రం ఆనందం తొణికిసలాడింది. కాని ఆ సంతోషం ఆట్టే సేపు నిలవలేదు. రాణికి స్పృహ అయితే వచ్చింది కాని, ఈసారి తగిలిన దెబ్బతో, ఆమె మతి పూర్తిగా చలించిపోయింది- "ఏరీ, నా చిట్టి తల్లులు? ఎక్కడ దాచారో చెప్పండి?" అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడసాగింది.


"ఇంకా. నీ దగ్గిర నేను మర్మం పెడతానా? నా మాట నమ్ము. పిల్లల్ని ఎక్కడా దాచలేదు. గద్దలు తన్నుకుపోయినై. నా మాట నమ్మకం లేకపోతే, అదుగో, సేవకులందరూ వున్నారు. వాళ్ళని అడిగి చూడు." అని దీనంగా అన్నాడు రాజు.

కాని, ఏమి చెప్పినా రాణి అర్థం చేసికోగల స్థితిలో లేదు. "మీరంతా ఒకటే. మీతో నాకేం పని? నా పిల్లల్ని వెతికి నేనే తెచ్చుకుంటాను. నన్ను పోనివ్వండి!" అంటూ ఆమె మంచం మీది నుంచి లేచిపోబోయింది.

గోరుచుట్టు పైన రోకటి పోటన్నట్టు, ఈ క్రొత్త అవాంతరం చూసి రాజుకి ఏమీ పాలు పోయింది కాదు. "ఆమె మనస్సు కుదుట పరచలేరా?" అన్నట్టు ఎంతో జాలిగొలిపేటట్టు చూశాడు ఆస్థాన వైద్యుడి వంక.

ఆస్థాన వైద్యుడు బాగా ఆలోచించి వెంటనే ఒక ఔషధం ఇచ్చాడు. ఆ మోతాదుతో రాణి నోరు మెదపటం మానివేసి, ఒక శిలా ప్రతిమలా వుండి పోయింది.

తరవాత ఆస్థాన వైద్యుడు రాజుని ప్రక్కకు పిలిచి, "రాజా! ఇప్పుడు అమ్మాజీవారికి శరీరబాధ ఏమీ లేదు.



చిక్కు యావత్తూ మానసిక సంబంధ మైనదే. అందుకుగాను మనం చేయ వలసినదల్లా, చిరంజీవులను పట్టి తెచ్చి, ఆమె ఎదుట పెట్టడం. ఎంత త్వరలో మనం ఈ పని చేయగలిగితే, అంత చప్పున రాణీ గారు తేరుకొంటారు. కనుక, ఇతర చింతలు మాని, ముందు ఎలా ఐనా మన ముద్దు బిడ్డలను వెతికి పట్టి, అమ్మాజీవారి ఎదుట పెట్టటానికి ప్రయత్నించాలి. ఈ ఒక్క పనిలో తాము చేయగలిగిన దంతా చేయించండి. రాణీ వారి ఆరోగ్యాన్ని గురించి నేను చూచు కొంటాను,'' అని ధైర్యం చెప్పాడు.

''అలాగే చేదాం. ఇందును గురించి, యిప్పుడే చాటింపు వేయిస్తా. మీరు మాత్రం రాణీని కనిపెట్టి వుండండి.'' అని మళ్ళీ వేడుకొన్నాడు రాజు.


ఆ ప్రకారం రాజు తన యావత్తు సిబ్బందినీ, మరి ఒకసారి దేశం నలు మూలలకూ పంపించాడు. బిడ్డల జాడ తెలుసుకు వచ్చిన వారికి తన రాజ్యం యిస్తాననీ కూడా చాటింపించాడు.

• • •

వారాలూ, నెలలూ గడిచినై. కాని, పిల్లల్ని వెతకబోయిన సిబ్బందిలో ఒక్కరూ తిరిగి రాలేదు. చాటింపు విని ఒక్క సమర్థుడు కూడా ముందుకు రాలేదు. ఇదంతా చూస్తూ రాజుకి మతి చలించేలాగ కనుపించింది. అక్కడ చూడబోతే రాణీ పరిస్థితిలో కూడా మార్పు ఏమీ కానరాలేదు.

ఒకనాటి తెల్లవారగట్ల, రాజు మూడో అంతస్తు పైన పచారు చేస్తున్నాడు. ఆ మసక వెలుగులో దూరాన, మూడు స్వరూపాలు తన మహలు వైపు వస్తూం డటం కనిపించింది. వాళ్ళు ముగ్గురు పిల్లలు. సమానమైన ఎత్తూ, లావూ కలిగి, అల్లంత దూరాన వున్నా ముగ్గురూ ఒకే అచ్చులో పోసినట్లున్నారు.

వాళ్ళు తన కుమార్తెలే అయి వుంటా రనుకుని రాజు ఎంతో ఆశతో గబగబ ది



వచ్చి, వాళ్ళ వైపు నడుగెత్తారు. తీరా దగ్గరకు వెళ్ళేసరికి, ఆ ముగ్గురూ మగ పిల్లలని తేలింది. అయినా వాళ్ళ ముగ్గురిలో వుండే ఒకే విధమైన పోలిక చూచి రాజుకి మనసులో ఒక చిత్రమైన అనుమానం కలిగింది.

"ఒకవేళ నా కుమార్తెలే, ఆ దుష్ట గ్రహాల మాయవల్ల, ఇలా మగపిల్లలుగా మారిపోయి వుంటారు గదా!" అనుకుని ఆయన కదలా మెదలక నిలబడి, వాళ్ళ వంక పరీక్షగా చూడసాగాడు.

ఆశతో, నిరాశతో క్షణ క్షణానికి రక రకాలుగా మారుతున్న రాజు ముఖంలోని భావాలను గమనిస్తూ, ఆ ముగ్గురు పిల్లలలో ఒకడు ఆయన కేసి విస్తుపోయి చూడసాగాడు. చివరికి రాజు వుండబట్టలేక, "మీ రెవరు, నాయనా? మీదే వూరు? ఇలా ఎందుకు వచ్చారు?" అని వేగిరపాటుతో ప్రశ్నల వెంబడి ప్రశ్నలు అడిగాడు.

తమని ప్రశ్నిస్తున్నది రాజై వుంటాడని, ఆ కుర్రవాళ్ళు గ్రహించలేకపోయారు. ఎందువల్ల నంటే, ఒంటికి సరియైన దుస్తులా లేవు. పైగా ఆయన ముఖంలో కళాకాంతి లేదు. కావటానికి రాజే అయినా, ఆ సమయాన రాజు ఒక సామాన్య మానవుని లాగానే వున్నాడు. ఎవరైనప్పటికీ, అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పాలి గదా! అందుకని కుర్రవాళ్ళు, "ఇక్కడికి దక్షిణాన వుండే భద్రపురి మా వూరు. మీ రాజావారి చాటింపు విని యిక్కడికి వచ్చాం." అన్నారు.

"ఓహో! అలాగనా. అయితే పదండి. నాకూ అక్కడ పని వుంది. మిమ్మల్ని రాజుగారి దగ్గరకు తీసుకు వెళ్ళగలను." అంటూ రాజు వాళ్ళని వెంట బెట్టుకుని మహలు చేరుకున్నారు.

తర్వాత ఆయన వాళ్ళ ముగ్గురిని కుర్చీలలో కూర్చోబెట్టి, తాను తన సింహాసనం అలంకరించాడు. "అబ్బాయిలూ! మీకు రాజుతో పని వున్నదన్నారు కదూ?"

అంటూ ప్రక్కనున్న కిరీటాన్ని తలపైన ధరించాడు.

ఇది చూచి ఆ కుర్రవాళ్ళలో ఒకతను, "ఆఁ! తమరేనా రాజా వారు?" అని ఆశ్చర్యపోయి లేచి నమస్కరించాడు. వెంటనే మిగతా యిద్దరు కూడా లేచి నిలబడి నమస్కరించారు.

"ఔను, నాయనా! మీరు చూడ వచ్చిన ఆ దురదృష్టపు రాజును, నేనే! నన్ను గుర్తించలేక పోవటంలో మీ తప్పు లేదు. నా పరిస్థితి అలా వున్నది. దానికేం గాని, మీ చరిత్ర చెప్పండి ముందు," అని ఆత్రంతో అడిగాడు రాజు.

రాజు అడిగిన దానికి, మొదటగా ఆయనను నమస్కరించిన కుర్రవాడు, "మహా రాజా! మేము ఛత్రపురిలో నివసించే ఒక పేదరాలి కుమాళ్ళం. నా పేరు వెలుగు; ఇతని పేరు చీకటి; అతని పేరు సంధ్య!" అని తక్కిన ఇద్దరి వైపు చూపాడు.

రాజుకి ఆశ్చర్యంతోపాటు నవ్వు వచ్చింది. ఆయన, "ఏమిటీ, మీ పేర్లు సంధ్యా, చీకటీ, వెలుగూనా? చిత్రంగా వున్నాయే! ఇటువంటి పేర్లు పెట్టుకోదానికి ఏమైనా కారణముందా?" అని అడిగాడు.

అందుకు వెలుగు యిలా చెప్పాడు: "అయ్యా, మేము ముగ్గురం మా తల్లి కడుపున, ఒకే రోజున కొద్ది గంటల తేడాలో పుట్టాము. ఇతను సంధ్యవేళ





పుట్టాడు. ఆ తరవాత అతను అర్ధరాత్రి వేళ పుట్టాడు. ఆ తరవాత నేను సూర్యోదయమప్పుడు పుట్టాను. ముగ్గురం ఒకే అచ్చులో పోసినట్లు వుండటం చూసి, మా తల్లి మాకు ఏమి పేర్లు పెట్టితే బాగుంటుందా అని ఎంతో ఆలోచించిందట. చివరికి మేము పుట్టిన వేళకు తగినట్లుగా, మా పేర్లు యిలా సంధ్య అని, చీకటి అని, వెలుగు అని పెట్టిందట."

"భేష్, బాగా వుంది! అయితే మీరు ముగ్గురూ కవలలన్నమాట. ఎంత చిత్రం! నా చిట్టి తల్లులూ కవలలే. కవలల్ని పట్టువానికి. కవలలు వెతుకబోవటం చూడగా, దైవ నిర్ణయంగా వున్నదే."

అంటూ రాజు ఆ కుర్రవాళ్ళని తన దగ్గర కూచో బెట్టుకుని, "అయితే, మీరు యిలా బయలుదేరినట్లు, మీ అమ్మగారికి తెలుసునా?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు వెలుగు పేరు గల కుర్రవాడు యిలా జవాబిచ్చాడు: "తెలియకేం? మా తల్లికి చెప్పకుండా మేము ఏపనీ చెయ్యము. ఆమె యిష్టపడిన మీదటే, మేము యిలా బయలుదేరి వచ్చాము. పోతే, ఇంటి వద్ద వృద్ధురాలైన మా తల్లిని వదిలి మేము ముగ్గురమూ వచ్చేస్తే ఎలాగ అని మీరడగవచ్చు. దానికి కారణం వున్నది. మేము పుట్టిన వేళా విశేషమేమో కానీ, సంధ్యవేళ పుట్టినతను ఎక్కువ వెలుగుగాని, చీకటి గాని చూడలేడు. సూర్యాస్తమయం అయిన దగ్గరనుంచి, దాదాపు బాగా చీకటి పడేటంత వరకు మాత్రమే యితను నిర్భయంగా సంచరించగలడు. ఇతని చూపు అంతవరకే. ఆ లోపున గాని, ఆ పైన గాని అతను పూర్తిగా అంధుడి క్రిందనే లెక్క.

"ఇక, చీకటి అన్న పేరుగల అతని విషయం వినండి. ఇతను వెలుతురనేది ఏ మాత్రమూ సహించలేడు. అందువల్ల చీకటి రాత్రులు ఇతనికి అనుకూలం. చివరికి నా సంగతి: నాకు పూర్తి వెలుగు

కావాలి. బాగా తెల్లవారితేగాని బయటికి రాలేము. తిరిగి సూర్యాస్తమయం అయే వేళకి ఇల్లు చేరుకోవాలి. మా యీ వింత స్వభావాలను ఆధారం చేసికొనే యిప్పుడు మేము ముగ్గురం యిక్కడికి రావటానికి సాహసించ గలిగాము. తరవాత— రాకుమార్తెలను వెతికి తీసుకు రావటం అనేది, అంత తేలికైన పని కాదని మాకు తెలుసు. ఈ పని సాధించటం మా ముగ్గురిలో, ఏ ఒక్కరి వల్లా కాదనీ తెలుసు. ఐతే, రోజు ఇరవైనాలుగ్గంటల లోనూ, మహాప్రాజ్ఞులా ముగ్గురమూ ఎటు వంటి పనినైనా చక్కబెట్టటానికి సమర్థుల మయి వుండటం చేత, ఇప్పుడు యీ అన్వేషణ కార్యములో పాల్గొనాలనుకుంటున్నాము. ముగ్గురమూ కష్టపడి రోజూ ఒక్కొక వేళలో, ఒక్కొకళ్ళము మా పనులు మేము చేసికొన్నట్లయితే, మాకు అసాధ్యమనేది వుండనే వుండదు. ఏ కార్యమైనా తప్పక జయించుకు రాగలము. ఈ కారణం చేతనే మా తల్లిని ఒంటిపాటుగా వదలి, ఇప్పుడు ముగ్గురమూ కలిసి బయల్దేర వలసి వచ్చింది.''

అందుకు రాజు, ''నీవు చెప్పినది చాలా బాగుంది. మీ తల్లిని గురించి మీకు ఏ విధమైన చింతా అక్కరలేదు. ఇప్పుడే ఆమెను రప్పించుతాను. మాతో పాటు మహలులో వుంటారు.'' అన్నాడు.

''మా కదే పదివేలు.'' అన్నారు కుర్రవాళ్ళు ముగ్గురూ ఏక కంఠంతో.



ఉన్నపాటుగా రాజు తన సేవకుల్ని భద్రప్పుడికి పంపి, ఆ కుర్రవాళ్ళ తల్లిని రప్పించాడు. రాజు చూపిన ఈ ఔదార్యానికి, ఆమె కూడా ఎంతో మురిసిపోయింది.

రాజు ఆ వృద్ధురాలితో, "అమ్మా! కుర్రవాళ్ళ వల్ల మీ వంశచరిత్ర తెలుసుకున్నాను. ఇలాంటి ధైర్య సాహసాలుగల కవల బిడ్డలను కన్న నీవు ధన్యురాలివి. తల్లీ!" అంటూ ఆమె పట్ల తనకు గల భక్తి విశ్వాసాలను వెల్లడించాడు.

ఆమె అనుమతి పొంది, రాజు కుర్రవాళ్ళ పేర్లు కొత్తగా మార్చి, సంధ్యాకుమారుడు, నిశీధుడు, ఉదయనుడు అని పిలవజొచ్చాడు. కుర్రవాళ్ళూ, తల్లి కూడా యిందుకు ఎంతో సంతోషించారు.

మరునాడే, కుర్రవాళ్ళకి ఒకటొరకమైన కత్తులూ, కటార్లూ యిచ్చి, వాళ్ళకు తలకొక గుర్రాన్ని ఏర్పాటు చేయటానికని, దానశీలమహారాజు వాళ్ళను అశ్వశాలకు తీసుకువెళ్ళాడు.

ఆ కుర్రవాళ్ళ పేర్లకు తగినట్టు రాజు, ఉదయనుడికి సూర్యకాంతిలా ధగధగ మెరిసే తెల్లటి గుర్రాన్ని, నిశీధుడికి నిగనిగలాడే నల్లటి గుర్రాన్ని, సంధ్యాకుమారుడికి ఎర్రని గుర్రాన్ని యిచ్చాడు.

ఒక సుముహూర్తాన తెల్లగుర్రం పైన ఉదయనుడూ, నల్లగుర్రం పైన నిశీధుడూ, ఎర్రగుర్రం పైన సంధ్యాకుమారుడూ—సుహాసిని, సుభాషిణి, సుకేశినిలను వెతుక్కుంటూ బయలుదేరారు.

వాళ్ళు బయలుదేరే ముందు రాజు, మూడు నల్ల జెండాలు తెచ్చి, మూడు గుర్రాలకూ ముందు భాగాన కట్టాడు. "నా చిట్టి తల్లుల్ని తీసుకుని ఏ క్షణాన మీరు తిరిగి వస్తారో, ఆ క్షణాన వీటిని పీకి పారెయ్యండేం, మరచిపోక," అని హెచ్చరిక చేశాడు.

ఆ తరవాత తమ తల్లి, రాజూ మనసారా దీవించగా, కుర్రవాళ్ళు ముగ్గురూ వాయువేగంతో సాగిపోయారు.

—(ఇంకా వుంది)





# విచిత్రకవలలు

## 6

[కవలలు ముగ్గురినీ పక్షులు ఎత్తుకుపోయిన తరవాత, రాజు వాళ్ళను తెచ్చిన వారికి రాజ్యం ఇస్తాననీ చాటింపు వేయించాడు. అది విన్న భద్రపురి వాసులైన ముగ్గురు కవలసోదరులు ఉదయనుడు, నిశిధుడు, సంధ్యాకుమారుడు అనేవాళ్ళు, రాజుగారి దగ్గిరకు వచ్చి, ఆయన ఇచ్చిన గుర్రాల మీద, విచిత్రకవలలను వెతికేందుకు బయలుదేరారు. తరవాత—]

తెల్లగుర్రం పైన ఉదయనుడు ముందు పోతున్నాడు. పట్టపగలు కావటం వల్ల ఉదయనుడికి బాధ లేదు. కాని, సంధ్యా, నిశిధుల సంగతేమిటి? వాళ్ళకు కళ్ళు వుండి కూడా గ్రుడ్డివాళ్ళ కిందనే లెక్క కదా! అందుచేత దారి తెలియకపోయినా, ముందు పోతున్న ఉదయనుడి గుర్రపు డెక్కల చప్పుడు ఆనవాలుగా పెట్టుకుని, అతని వెంటనే పోతూవున్నారు.

క్రమంగా సూర్యుడు పడమటికి క్రుంగబోయాడు. ''నా పని అయిపోయింది. ఇక నువ్వు దారి చూపు, సంధ్యా,'' అన్నాడు ఉదయనుడు. ఆ మాట ప్రకారం ముందు సంధ్య దారి తీయగా, అతని వెనక నిశిధుడు, ఆ వెనక ఉదయనుడు వెళుతున్నారు.

అలా పోయిపోయి బాగా చీకటిపడే వేళకు, వాళ్ళు ఒక పెద్ద అరణ్యం చేరు



కున్నారు. చీకటి పడటం వల్ల యిక ఉదయనుడూ, సంధ్యా యిక విశ్రాంతి తీసుకోవలసిన వాళ్ళు. కాని, అర్ధరాత్రి వేళ ఆ నట్టడివిలో, ఎక్కడ విశ్రాంతి తీసుకోవటం? అప్పుడు నిశీధుడు వాళ్లని ఒక చెట్టు పైన కూర్చోబెట్టి, "మీరు యిక్కడే వుండండి. నేను పోయి యీ రాత్రికి మీరు తల దాచుకునేందుకు వీలైన చోటు ఎక్కడైనా వుందేమో చూచి వస్తాను." అని వాళ్ళ గుర్రాల్ని, ఆ చెట్టుకే కట్టివేసి తన నల్లగుర్రం పైన బయలుదేరాడు.

నిశీధుడు చాలా దూరం పోయి చివరకు, ఆ అరణ్యం మధ్యలో ఒక పాడుబడ్డ ఇంటి వద్దకు చేరుకున్నాడు. వాకిలి దగ్గరికి వెళ్ళి, తలుపుతట్టి చూచాడు. జవాబులేదు. కిటికీ దగ్గరికి వెళ్ళి తొంగి చూచాడు; లోపల అలికిడి ఏమీలేదు. ధైర్యం చేసి తలుపు తెరుచుకుని, ఇంట్లో ప్రవేశించాడు. ఏ మూల చూచినా, నార పీచు కుప్పలే. అంతకు తప్ప ఆ ఇంట్లో విచిత్రమేమీ లేదు. ఇంటి యజమాని ఎవరో చూద్దామని, కొంతసేపు అక్కడే వేచి వున్నాడు.

నిశీధుడు అలా చాలాసేపు చూచినా, ఎవరూ రాకపోయేసరికి, అది ఏదో పాడుబడిన ఇల్లు అయి వుంటుందనుకున్నాడు. తనకూ, తన సోదరులకూ ఇది తల దాచుకోటానికి తగిన స్థలమేనని నిశ్చయించుకొని, తిరిగి నల్లగుర్రం పైన బయలుదేరి, ఉదయనుడూ, సంధ్యా వున్న చెట్టు వైపుకి పోయాడు.

నిశీధుడు అక్కడ సోదరులను కూర్చోబెట్టి వచ్చేసిన మరుక్షణమందే ఉదయనుడూ, సంధ్యా ఎక్కిన చెట్టు కింద, ఏదో అలికిడి అయింది. పురుగూ పుట్రా వుండే అడవి కదా, అటువంటి దేదైనా అయివుంటుందనుకుని వాళ్ళు ఆత్రంతో నిశీధుని కోసం ఎదురుచూస్తూ వున్నారు.

ఉన్నట్టుండి ఉదయనుడు తన నడుము చుట్టూ తడిమి చూసుకొని,

"సంధ్యా! ఏదో నారపీచు లాగా తగులుతోంది. ఏమిటో నడుముకి." అనబోయాడు.


ఉదయుడి నోటినుంచి, ఈ మాటలు పూర్తిగా వచ్చాయో లేదో, సంధ్య కూడా, "అవును. నా నడుముకి అలాగే తగులుతోంది. నీవు చెప్పినట్టు ఏదో నారపీచు లాగానే కనబడుతూ వుంది. ఏమై వుంటుంది చెప్మా?" అని ఆలోచించసాగాడు.

ఇలా వాళ్ళు ఆలోచిస్తూ వుండగానే, వాళ్ళ నడుముచుట్టూ ఏదో తాడు బిగించి లాగబడుతున్నట్టు యిద్దరూ గ్రహించారు. చేతులతో చుట్టూ తడిమి చూచారు. ఎక్కడా మనిషి అలికిడి కనిపించలేదు.

ఇంతలో, "మహామహా వాళ్ళకే, నేను కనిపించలేదు. మీకా కనుపించేది?" అనేమాటలు వినిపించినై.

ఎప్పుడైతే యీ మాటలు వినిపించినయ్యో, అప్పుడు తమని ఏదో దెయ్యమో, భూతమో యిలా తాటితో బిగించివుంటుందని, ఉదయుడూ, సంధ్యా తెలుసుకున్నారు. కాని, ఏమి చెయ్యాలో తోచింది కాదు. "సమయానికి మా నేస్తుడు లేకపొయ్యాడు గాని, ఉంటే నీ అంతు కనుక్కొనివుందుము. ఇప్పటికైనా మించిపోయింది లేదులే. మా అన్నయ్య





యీపాటికి బయల్దేరి వస్తూవుంటాడు. వాడు వచ్చేలోగా మర్యాదగా, మమ్మల్ని వదిలిపోతావా సరేసరి. లేదా యీరోజునే నిన్ను యమలోకానికి పంపించివేస్తాడు.'' అని బెదిరించి చూశారు.

కాని. ఆ వచ్చినవాడు సామాన్యుడా? ''ఓస్! మీ బెదిరింపులు నా దగ్గిరనా? మీ అన్నయ్యలాటి వాళ్ళు ఒకరుకాదు, వందమంది వచ్చినా, నన్నేమీ చెయ్య లేరు. అయినా మీ అన్నయ్య వచ్చేవరకూ నేను యిక్కడ వుండబోయాను గన కనా?'' అంటూ ఆ వచ్చినవాడు, వాళ్లని తన గడ్డం చివర కట్టి చరచరా సాగి పోయాడు. పోతూపోతూ ఆ వచ్చినవాడు, మరొక కొంటె పని కూడా చేసిపోయాడు. చెట్టుకి కట్టి వున్న రెండు గుర్రాల పైనా ఏదో భస్మం చల్లాడు. అలా చల్లటంతోటే, అవి రెండూ మాయమైపోయాయి.

మరి కొంతసేపటికల్లా నిశీధుడు చెట్టు వద్దకు వచ్చి చూసేసరికి ఏమున్నది — చెట్టు పైన తన సోదరులూ లేరు, చెట్టు క్రింద వాళ్ళ గుర్రాలూ లేవు. అతనికి ఏమీ తోచింది కాదు. ఒకవేళ తను రావటం ఆలశ్యం అయిందని చెప్పి, వాళ్ళు తనని వెతుక్కుంటూ మరో దారిన వెళ్ళారేమో ననుకుని. సోదరు లను వెతుక్కుంటూ, తన నల్లగుర్రం పైన తిరుగుముఖం పట్టాడు.

అలా వెతుక్కుంటూ నిశీధుడు, ఆ మహారణ్యమంతటా కలియతిరిగాడు. కాని, ఎక్కడా వాళ్ళ అనవాలు చిక్కింది కాదు. అప్పటికి రాత్రి కూడా చాలా భాగం గడిచిపోయింది. మరో రెండు గంటలలో తెల్లవారబోతుంది. తీరా తెల్ల వారిందీ అంటే తను ఒక్క అడుగైనా ముందుకు వెయ్యలేడు. అందుచేత ఆఖరు ప్రయత్నంగా, మరొక్కసారి అడవి అంతా గాలించాడు. లాభం లేక పోయింది.


నిశీధుడికి చివరకు ఒక ఆలోచన తట్టింది: ''ఒకవేళ వాళ్ళు నేను చూచి

వచ్చిన, ఆ ఇంటికి వెళ్లారేమో!" అనుకున్నాడతను. ఈ ఆలోచన స్ఫురించగానే, గిరుక్కున మళ్ళీ, తిరుగా ఆ పాడుబడిన యింటికి వచ్చి చేరుకున్నాడు. తన సోదరులు గుర్రాలను బైట కట్టివేసి వుంటారు కదా అని తలిచాడు, నిశీధుడు. కాని, అలా ఏమీ కనిపించక పోయేసరికి, నిరాశ చెందవలసి వచ్చింది. అయినా చూద్దామని చెప్పి తలుపు తోసుకుని ఇంట్లోకి వెళ్ళాడు. ఎంత వింత! ఒక లావుపాటి నార త్రాటితో కట్టబడి ఉదయుడూ, సంధ్యా ఆ గది మూల నిద్రిస్తూవున్నారు. పైగా, వాళ్ళకి దగ్గిరలోనె నేల మీద నెత్తురు చుక్కలు కనుపిస్తున్నై. అంతకంటె ఘోరం - ఉదయుని చెయ్యి ఒకటి మాయమైపోయింది. పోని అంటే, నరికి వేసిన గుర్తయినా లేదు.

ఇదంతా చూచి నిశీధుడికి మతి పోయినట్టనిపించింది. కొంతసేపటికి స్థిమితం తెచ్చుకొని, సోదరులను తట్టి లేపాడు. నిశీధుణ్ణి చూడగానే వాళ్ళకి ప్రాణం లేచి వచ్చింది. "తమ్ముడూ! ఆ దుర్మార్గుణ్ణి తప్పించుకుని ఎలా వచ్చావురా? మళ్ళీ మనం కలుసుకుంటామని ఆశపడనే లేదు మేము." అంటూ నిశీధుణ్ణి కౌగలించుకుని కన్నీరు కార్చారు సోదరులిద్దరూ.

"మీకు వచ్చిన భయంలేదు. విచారించకండి. ఇక్కడి కెలా వచ్చారు మీరు? ఈ కష్టమిటి? అన్నయ్యా, నీ చెయ్యి






మయింది? ఈ నెత్తురు చుక్కలేమిటి?'' అని ప్రశ్నలు కురిపించాడు నిశీధుడు.

''ఇదంతా మన దురదృష్టం, తమ్ముడూ!'' అని ఉదయనుడు ఇలా చెప్పసాగాడు: ''నీవు మమ్మల్ని వదిలి వెళ్ళిన కాసేపటికల్లా, మమ్మల్ని ఎవడో తాటితో కట్టి తెచ్చి, ఈ ఇంట్లో పడేశాడు. ఆ దుర్మార్గుడు ఎవడో, మమ్మల్ని ఎక్కడికి తీసుకుపోతున్నాడో మేము చీకటిలో తెలుసుకో లేకపోయాం. ఎప్పుడు తెల్లవారుతుందా అనేదే మా ఆరాటం. ఇప్పుడిప్పుడే తెల్లవారబోతున్నది కనుక, నేను కొంచెం చూడగలిగాను. మమ్మల్ని ఇక్కడికి కట్టి తెచ్చినవాడు ఒక విచిత్రమైన మనిషి. వాడిని చూస్తే మాకు నవ్వూ వచ్చింది, కోపమూ వచ్చింది. భూమికి సరిగా జానెడంటె జానెడెత్తునే వున్నాడు. కాని చిత్రమేమిటంటే వాడికి వంద జానెలు పొడుగు గల గడ్డం వుంది. ఆ గడ్డాన్నే మా నడుముకు చుట్టి, తాడులాగా పేనాడు. ఇప్పటివరకు వాడూ మా ప్రక్కనే పడుకుని వున్నాడు. ఇప్పుడే లేచి ఎక్కడికో పోయినట్టుంది. వాడు లేచేసరికి ఇక్కడ నేల మీద నీ పాదాల గుర్తులు కనిపించినై. అవి కంట పడగానే అగ్గిరగులుస్తూ, 'ఓహో, మీ పెద్దన్న ఇక్కడికి వచ్చి వెళ్ళినట్టున్నాడే? సరే వుండండి. వాడిని కూడా పట్టి తెస్తాను.' అంటూ గభీమని లేవబోయాడు. ఆ తొందరలో వాడు మమ్మల్ని తన గడ్డానికి కట్టుకున్న సంగతే మరిచిపోయినట్టుంది! నాకు వళ్ళుమండి వాడి గడ్డం పట్టుకు పీకేసరికి, నాలుగు పీచులు కుదుళ్ళ కంటా వూడి వచ్చి, బొలబొలా రక్తం కారింది. వాడు కళ్ళవెంట చింతనిప్పులు కక్కుతూ, 'ఔరా, ఎంత పొగరు నీకు? ఇంకా నయంలే, గడ్డమంతా ఊడలాగేశావు కావు.' అంటూ కసిరాడు.

''తరవాత వాడు కోపంతో ఊగిపోతూ, 'ఈ గడ్డమే నాకు పంచప్రాణాలు అయి వుంది. ఇందులో ఒక్క వెంట్రుక రాలిం



దంటే. ఒక ప్రాణం ఎగిరిపోయిందన్న మాటే కదా. ఇప్పటి పొగరుబోతు, నాలుగు పొడుగుపాటి కేశములు పీకి వేశాడే. అవి మళ్ళీ యీ జన్మలో మొలిచే అస్కారమూ లేదు. ఎలా అహిరించేది?' అని గొణుగుకుంటూ, 'అరెయ్, నీ పొగరుకి ఇదే తగిన శిక్ష. అనుభవించు!' అంటూ జేబులోంచి ఏదో అంజనం తీసి, నా భుజానికి పూశాడు. అంతే. ఆ మరుక్షణమే నా చెయ్యి మాయమైపోయింది. ఈ పని చేసిన తర్వాత వాడు తన గడ్డాన్ని మమ్మల్ని కట్టుకున్నంతవరకు కత్తిరించుకుని, సులువుగా లేవగలిగాడు. కాని చిత్ర మేమిటంటే, ఆ పొడుగు గడ్డం మళ్ళీ ఎప్పటిలాగానే తయారై వుంది,'' అని చెప్పి ముగించాడు. ఇదంతా విని నిశీధుడు చాలా ఆశ్చర్యపోయాడు.

ఇంతలోకే బాగా తెల్లవారింది. అప్పుడు ఉదయునుడు, ''సరే ఇంక ఆలశ్యం చెయ్యటం దేనికి? వాడు నీకోసం తిరిగి తిరిగి వేసారి, ఈ పాటికి మళ్ళీ యిటు వస్తూండి వుండాలి. తెల్లవారింది కనుక, నిశీధా, యిక నీవల్ల ఏమీ ప్రయోజనం లేదుకదా? అందుచేత నా బదులు నిన్ను సంధ్యతో కలిపి కట్టివేస్తాను. ఒక చెయ్యి మాత్రమే పైకి కనిపించేట్టు జాగ్రత్తగా కూర్చుని వుండు. తర్వాత సంగతి చూచుకొందాం,'' అన్నాడు.

సరేనంటే సరేననుకున్నారు ముగ్గురూ. వెంటనే నిశీధుడు వాళ్ళ కట్లు విప్పాడు. ఉదయునుడు లేచి నిశీధుణ్ణి సంధ్యతో పాటు కట్టి పడేశాడు. బైటవున్న నిశీధుడి నల్లగుర్రాన్ని అక్కడ దగ్గర్లో ఒకగుహలో కట్టేసి, తను మాత్రం ఇంటికి దగ్గర్లోనే, ఒక పొదమాటున నక్కి వున్నాడు.

సరిగ్గా మధ్యాహ్నం అయేవేళకు, ఆ పొడుగు గడ్డపు జానెడు మనిషి, ''కానివ్వు, ఎక్కడికి పోతాడు? ఇవాళ కాకపోతే రేపు. అంతే కదా? అహహా, అహహా!'' అంటూ విరగబడి నవ్వుతూ.

ఉదయనుడు దాగివున్న పొద పక్కనించే పోయాడు.


వాడిని ఇంట్లోకి పోనిచ్చి, ఉదయనుడు మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఒక కిటికీ దగ్గిరచేరి, ఇంటిలోపలికి తొంగి చూశాడు. అప్పుడు ఒక చిత్రమైన విషయం ఉదయనుడి కంటబడింది. ఆ బారెడు గడ్డపు జానెడుమనిషి జేబు నుంచి ఏదో మందు తీసి, నిశీథుడి పైన, సంధ్య పైన చల్లాడు. వెంటనే వాళ్ళు ఆనవాలైనా లేకుండా మాయమైపోయారు. ఆ తర్వాత వాడు, తన మెడలో వున్న ఒక దండ తీసి, అక్కడ ఒక వంకెకు తగిలించాడు. దండ తీసి వేశాడో లేదో వాడు మామూలు మనిషి అయిపోయాడు. ఆ గడ్డమూ లేదు. ఏమీ లేదు.

ఇదంతా ఉదయనుడు కిటికీలో నించి కనిపెడుతూనే వున్నాడు. మెడలో వున్న దండ తీసి వేసి, వాడు గుర్రుపెట్టి నిద్ర పోయాడు. అదే అదను చూచి ఉదయనుడు మెల్లగా యింట్లో ప్రవేశించి, ఆ దండ కాస్తా లాగేసి తెచ్చి, తన మెడలో వేసుకున్నాడు. ఇంకేముంది, ఉదయనుడు వెంటనే బారెడు గడ్డపు జానెడు మనిషిగా మారిపోయాడు. ఈ వింత మార్పు చూచి ఉదయనుడికి నవ్వు వచ్చింది. "ఓహో, ఇదా నీ కిటుకు!" అనుకున్నాడు మనసులో.

ఉదయనుడు తన చొక్కాకు గల జేబులన్నీ తడిమి చూసుకున్నాడు. ఒక జేబులో ఏదో తెల్లటి భస్మం వుంది. చెట్టు క్రింద గుర్రాల్ని, యింట్లో మనుషుల్ని గెడ్డం వాడు మాయం చేసింది. ఈ భస్మం తోటే. రెండో జేబులో ఒక ఎర్రని అంజనపు డబ్బీ వుంది. ఉదయనుడి చెయ్యి పొగొట్టింది. ఈ అంజనం రాచే. మూడో జేబులో అలాటిదే మరొక పచ్చని అంజనపు డబ్బీ, ఒక పెద్ద తువ్వాలూ, ఇంకా మరి ఏదో నల్లని భస్మమూ వున్నై. ఐతే, వాటిలో ఏది ఎందుకు ఉపయోగిస్తుందో ఉదయనుడికి బోధపడలేదు.

—(ఇంకా వుంది)






7

[రాత్రివేళ అరణ్యంలో ఒక చెట్టు మీద ఉదయనుడూ, సంధ్యా నిద్రపోతూ ఉండగా, వాళ్ళను జానెడు గడ్డపు జానెడు మనిషి ఒకడు, బందీలుగా పట్టుకుని, తన ఇంటికి తీసుకు పోయాడు. నిశీధుడు తన సోదరులను వెతుక్కుంటూ పోయి, గడ్డపువాడి మెడలోని దండ రహస్యాన్ని, అతడు వాడే భస్మాల కిటుకునూ కొంతవరకు తెలుసుకున్నాడు. తరవాత—]

సంధ్యకూ, నిశీధుడికి పగటివేళ ఏమీ కనిపించదు గదా? దానికితోడు ఇప్పుడు గడ్డపువాడు, వాళ్ళిద్దర్నీ ఏదో భస్మం చల్లి మాయం చేశాడాయె! ఆ మాయవల్ల ఉదయనుడు జానెడు మనిషిగా మారి పోవటమూ, మంచంపై పడుకొని వున్న గడ్డం వాడు మామూలు మనిషి కావటమూ, వాళ్ళు తెలుసుకోలేక పోయారు. గడ్డంవాడు ఏ క్షణాన లేస్తాడో, లేచి యింకేమి ప్రమాదం తెచ్చి పెడతాడో అని బేజారెత్తిపోయారు. పైగా, తమ సోదరుడేమయాడో అనే బెంగ!

గడ్డంవాడి కిటుకు తనకు తెలిసి పోవటమేగాక, వాడిని మోసం చేసి, తను కూడా వాడిలా మారిపోయాను కదా అని ఉదయనుడు సంతోషించాడు. ఈ సంతోషంలో ఉదయనుడు తన సోదరుల సంగతే మరిచిపోయాడు. ఇప్పుడు ఉద



యనుడి దృష్టి అంతా తన జేబులలో వున్న భస్మాలపైనే వుంది. ఈ భస్మాలూ, అంజనాలూ ఎందుకు ఉపయోగపడతయ్యా అని ఆలోచిస్తూ వుండగా, యాదాలాపంగా సోదరుల సంగతి గుర్తుకు వచ్చింది. చూశాడు. ఏరీ వాళ్ళు ?

ఉదయనుడికి ఏమీ పాలుపోయింది కాదు. ఏమి చెయ్యటానికీ తోచక అలాగే పచార్లు చేస్తుండగా, మెలకువ వచ్చి గడ్డపువాడు లేచాడు. ఎదుట అచ్చుగా తన స్వరూపంతోనే, ఒక చెయ్యి లేని ఉదయనుడు కనిపించేసరికి, గడ్డపు వాడికి అంతా అర్థం అయిపోయింది. తన బండారం బయటపడిందే అని లోలోపల మండిపోతున్నా, పైకి మాత్రం కొంచెం కూడా కోపం కనబరచలేదు.

వాడు నెమ్మదిగా ఉదయనుడి వైపుకి నడిచి వస్తూ, "మీ రెవరో అసాధ్యుల లాగా వున్నారే! ఇంతకాలానికి నా రహస్యం కనిపెట్టగలిగిన సమర్థులను చూడగలగటం నిజంగా నా అదృష్టమే అని భావిస్తున్నాను. ఐతే, దీనివల్ల మీకు కలగబోయే లాభం ఏమీ లేదు. మీరు యిక్కడికి వచ్చిన పని ఏమిటో చెప్పితే నేను క్షణంలో నెరవేరుస్తాను. నే నుండగా మీరు శ్రమపడట మెందుకు?" అని అంటూ, ఉదయనుడి మెడలో వున్న దండ కోసం అనేక విధాల ప్రాధేయపడి అడిగాడు.

అంత తేలికగా టోపీ పడేవాడా ఉదయనుడు! "ముందు నా సోదరులను ఎక్కడ దాచావో చెప్పు. తరువాత సంగతి ఆలోచిద్దాం." అన్నాడు.

"ఎక్కడా దాచలేదు. అక్కడే వున్నారు. అదుగో, నీ చొక్కా ఎడమ జేబులో వున్న డబ్బీలోని నల్లని భస్మం అక్కడ చల్లు." అంటూ గడ్డంవాడు వాళ్ళని మాయంచేసిన చోటు చూపించాడు. అలాగే ఉదయనుడు నల్ల భస్మం చల్లేసరికి, ఒక్కసారిగా నిశీధుడూ, సంధ్యా ప్రత్యక్షమయారు.

తర్వాత ఉదయనుడు. "సరే, నా సోదరులు కనిపించారు. నా చెయ్యి తిరిగి వచ్చేమార్గం కూడా చెప్పు." అన్నాడు గడ్డంవాడితో.

"దీనికి మందు నీదగ్గిరేవుంది. చూడు. నీ కుడిజేబులో పచ్చని అంజనపు డబ్బీ వుంది. అది తీసి మొండిచేతికి రాయి." అన్నాడు గడ్డపువాడు.

ఉదయనుడు అలాగే చేసేసరికి, తిరిగి మామూలు చెయ్యి వచ్చేసింది.

ఇప్పుడు ఉదయనుడికి తన జేబులో వున్న తెల్ల భస్మమూ, ఎర్ర అంజనమూ ఎందుకు ఉపయోగపడతయ్యో తెలుసుకోవాలని తొందరకలిగింది. గడ్డపువాడికి అవి చూపుతూ, "ఇవి దేనికి?" అని అడిగాడు.

గడ్డపువాడు నవ్వుతూ, "ఈ మాత్రం గ్రహించలేవూ? నీ సోదరులను మాయం చేసింది, ఈ తెల్లని భస్మంతోనే. నీ చెయ్యి మాయం చేసింది, ఆ ఎర్రని అంజనంతో," అంటూ మర్మాలన్నీ దాచకుండా బయట పెట్టాడు.

"మరైతే యీ తువ్వాలు దేనికి?" అని ప్రశ్నించాడు ఉదయనుడు.


"దానివల్ల రెండు ఉపయోగాలు వున్నై. మీరు కోరుకున్న ఆహారం ఏదైనా సరే మనసులో తలుచుకుని తువ్వాలు



పరిచారంటే, వెంటనే అది తయారవుతుంది. ఏ విధమైన వ్యాధి నయినా యిది నయం చేస్తుంది కూడా." అని చెప్పాడు గడ్డపువాడు.

"అయితే, మా కంటి చూపులలో భేదాలు మారిపోయేట్టు చేయుగలదా, యీ తువ్వాలు?" అని మళ్ళీ అడిగాడు ఉదయనుడు.

"చూపు లేమిటి, భేదా లేమిటి?" అని గడ్డపువాడు ఆశ్చర్యంతో అడిగేసరికి, ఉదయనుడు తను చీకటిలో చూడలేక పోవటం, అలాగే తన సోదరులు వాళ్లకు అనుకూలం కానివేళలలో చూడలేక పోవటం వివరంగా చెప్పాడు.



అంతా విన్న తరువాత గర్తపువాడు, "ఓహో, యిదా సంగతి? మీ ముగ్గురికీ మామూలు చూపు వచ్చేమార్గం చెబుతా గాని, ముందు నా దండ నాకు యివ్వు మరి," అన్నాడు.

కాని, ఉదయనుడికి తెలుసు, ఏమాత్రం ఏమరివున్నా గర్తపువాడు తమని ప్రాణాలతో వదలడని. అందు వల్ల యుక్తిగా యిలా చెప్పాడు: "తాతా! మాకు చూపు వచ్చేమార్గం చెప్పు. అది ఒక్కటే మాకు మిగిలివున్న కోరిక. ఇక్కడికి పడమటి దిక్కుగా పదిమైళ్ళ దూరంలో ఒక గుహ వుంది. నీ దండ ఆ గుహలో వుంచి, మా దారిన మేము వెళ్ళిపోతాము. నీవు అక్కడికి వచ్చి దానిని తీసుకుపోవచ్చు."


ఆ దండ తనకు ఆయువుపట్టయి వుంది కనుక, గర్తపువాడు యీ ఏర్పాటుకు ఒప్పుకోనక తప్పిందికాదు.

ఇంతలో నిశీధుడూ, సంధ్యా లేచి వచ్చి, "అన్నయ్యా! ఏది జీవానికి పడి మనం యింతవరకూ కడుపులు కాల్చుకునే వున్నాం. భలే ఆకలివేస్తోంది. ఏదీ ఆ తువ్వాలు మహత్తు ఎంతవరకు నిజమో చూద్దాం!" అన్నారు.

నిజానికి యీ మాట ఉదయనుడికి తోచనేలేదు. ఎప్పుడైతే సోదరులు యీ మాట అన్నారో, ఉదయనుడు రకరకాల ఫలాలపేర్లూ తలుచుకుని, తువ్వాలు పరిచాడు. మరుక్షణాన తువ్వాలు నిండా నవనవలాడుతూ రకరకాల పళ్ళు నిండి కనుపండువు చేసినై. ఉదయనుడు కొన్ని తీసుకున్నాడు. కాని ఎన్ని తీసినా తువ్వాలు మీది పళ్ళు తరగనే లేదు. అందుచేత, దుష్టుడైనప్పటికీ గర్తపువాడికి కూడా కొన్ని పళ్ళు పెట్టాడు.

కడుపు నిండాక ఉదయనుడు తువ్వాలు మడిచి జేబులో వుంచుకుని, "మరి ఇక మా చూపులు సరి అయ్యే మార్గం చెప్పు. చూపులు వస్తే మా దారిన మేము పోతాం," అన్నాడు.

అందుకు గడ్డపువాడు, "నీ దగ్గిర వున్న ఎర్ర అంజనం ఉండ చెయ్యి. ఆ ఉండని యీ నారపీచులో చుట్టి ముట్టించు. దాని లోంచి బ్రహ్మాండమైన పొగ వస్తుంది. మీరు ముగ్గురూ ఈ తువ్వాలు తలపైన కప్పుకొని, ఆ పొగ మీ కళ్ళకి తగిలేట్టు చూడాలి. ఒక్క అయిదు నిమిషాలు అలా ఉన్నట్టైతే, మీకు మామూలు చూపు వచ్చేస్తుంది," అని చెప్పాడు.



అలాగే ఉదయనుడు ఎర్ర అంజనం ఉండచేసి, ఆ ఉండను నారపీచులో కట్టాడు. కాని నిప్పు ఎక్కడి నుంచి తేవటం?


ఉదయనుడు ఏమి చెయ్యటమా అని ఆలోచిస్తుండగా, గడ్డపువాడు రెండు చెకుముకిరాళ్ళు తెచ్చి, నిప్పుచేసి అంటించాడు. నారపీచులో వున్న ఆ ఉండ అంటుకోగానే బ్రహ్మాండమైన పొగ లేచింది. ఉదయనుడు తన సోదరులను కూడా తీసుకుని, ముగ్గురూ ఆ పొగలో కూచుని, తలలపైన తువ్వాలు కప్పుకున్నారు.

అయిదు నిమిషాల తరవాత ముగ్గురూ పొగలో నుంచి బయటికి వచ్చారు. ఒక్కొక్కళ్ళ కళ్ళ వెంబడి నీరు కాలువలా ప్రవహించి, కొంతసేపటికల్లా కంటి తడి ఆరిపోయింది.

కాని, ఆశ్చర్యమేమిటంటే, తమకు మామూలు చూపు వస్తుందని యింతా చేస్తే, గడ్డపువాడు చెప్పినట్టు చెయ్యటం వల్ల చూపు రాకపోవటమే గాక, ఇప్పుడు కనుగ్రుడ్లే మాయమైపోయినై.

ఉదయనుడు ఉగ్రుడైనాడు: "ఏమిరా, దుర్మార్గుడా! ఇదేనా నీవు మాకు చూపులు తెప్పించటం?" అంటూ ఉరమసాగాడు.

అందుకు గడ్డపువాడు, "తొందర పడకు, బాబూ! మిమ్మల్ని మోసమే చెయ్యాలనుకుంటే, ఈ రహస్యాలన్నీ చెప్పేవాడినా? అసలు పని ముగియుండే, అలా కేకలు వేస్తావెందుకు? ఇప్పుడు కనుగ్రుడ్లు కూడా లేవు కదా? నీ దగ్గ



వున్న ఆ పచ్చ అంజనం రెప్పల పైన రాచుకొని చూడు." అన్నాడు.

ఆలాగే ఉదయునుడు ఆ అంజనం కంటి రెప్పల పైన రాచుకునేసరికి మామూలుగా కళ్ళు వచ్చేసినై. వెంటనే సోదరుల కళ్ళకి కూడా రాచాడు. వాళ్లకీ వచ్చేసినై. తాను గర్థంవాడి పైన అనవసరంగా కోపపడ్డందుకు ఉదయునుడు సిగ్గు పడ్డాడు. రాత్రివేళల తప్ప చూపు కనిపించని నిశిధుడూ, సంధ్యవేళ తప్ప చూపు కనిపించని సంధ్యా కూడా, ఇప్పుడు చక్కగా చూడగలుగుతున్నారు. ఇందుకు వాళ్ళు ఎంతో ఉప్పొంగి పోయారు.

ఆ తర్వాత వాళ్ళు తమ గుర్రాల్ని తెచ్చుకుందామని చెప్పి బయలుదేరారు. మొదట ముగ్గురూ అడవిలోకి వచ్చి, అంతకు ముందు గుర్రాల్ని కట్టేసిన చెట్టు దగ్గిరికి చేరుకున్నారు. ఉదయునుడు తన దగ్గిర వున్న నల్ల భస్మం అక్కడ చల్లేసరికి, యథాప్రకారం గుర్రాలు రెండూ ప్రత్యక్షమైనై. వాటిని తీసుకుని వాళ్ళు గుహలో దాచిన నల్ల గుర్రం కోసం వెళ్ళి, దాన్ని కూడా తీసుకుని గర్థంవాడి ఇంటికి తిరిగి వచ్చారు.

అప్పుడు గర్థంవాడు, "మీ కోరికలన్నీ నెరవేరినట్టే కదా? ఇక మీ దారిన మీరు వెళ్ళండి. వాగ్దానం ప్రకారం నా దండ మాత్రం ఆ గుహలో వదిలి వెళ్ళండి. మాట తప్పితే మాత్రం...." అని యింకా ఏమో చెప్పబోతుండగా, నిశిధుడు అడ్డు తగిలి, "సరేకాని, అసలింతకూ నీ వెవరవు? దారినపోయే అమాయకులను, ఎందుకిలా నిర్బంధిస్తున్నావు?" అని అడిగాడు.

అందుకు గర్థపువాడు, "ఆ సంగతి నేను చెప్పకూడదు. అది గొప్ప రహస్యం. అది వెల్లడించినట్టయితే, నేను తల పగిలి చస్తాను. కనుక క్షమించండి." అన్నాడు.

సోదరులు ముగ్గురూ ఒక్క మాటగా, వానిపైన సానుభూతి కనబరిచి,

ఈ రహస్యం గురించి అడగకుండా వది లేశారు. తర్వాత వాళ్ళు తమ తమ గుర్రాల మీద బయలుదేరి పోసాగారు. పోతూ పోతూ ఉదయనుడు, గర్దభ వాడితో, "మరొక్క కోరిక వున్నది. నీ దండ అయితే నీకు యిస్తాము కాని, ఈ అంజనాలూ, భస్మాలూ, తువ్వాలూ మాకు యివ్వాలి సుమా." అన్నాడు.

ఇందుకు కూడా గర్దభవాడు ఒప్పుకోక తప్పింది కాదు. తర్వాత తెల్ల గుర్రం మీద ఉదయనుడూ, నల్ల గుర్రం మీద నిశిధుడూ, ఎర్ర గుర్రం మీద సంధ్యా బయలుదేరారు.

వాళ్ళు అలా పోయి పోయి చివరకు గర్దభవాడికి గుర్తు చెప్పిన గుహ చేరుకున్నారు. మాట యిచ్చిన ప్రకారం ఉదయనుడు తన మెడలో దండ తీసి, ఆ గుహలో పెట్టాడు. ఎప్పుడైతే దండ మెళ్ళోనించి తీసివేశాడో, అప్పుడు ఉదయనుడికి మామూలు రూపం వచ్చేసింది. ఆ తర్వాత వాళ్ళు తిరిగి తమ గుర్రాల మీద సాగిపోయారు.

కొంతదూరం పోగా వాళ్ళు ఒక కీకారణ్యంలో ప్రవేశించారు. అప్పటికే చీకటి పడుతూవుంది. రాత్రి పూట ఆ అరణ్యంలో ఎక్కడ తల దాచుకోవటం? ఏమి చెయ్యాటమా అని వాళ్ళు ఆలోచిస్తూండగా, మూడు సింహాలు తమ వైపు గర్జించుకుంటూ రాసాగినై. నిశిధుడికీ, సంధ్యకూ ఏమీ తోచింది కాదు గాని, యుక్తిపరుడైన



ఉదయనుడు తన దగ్గిర వున్న తెల్ల భస్మం తీసి, విశిధుడి మీదా, సంధ్య మీదా, వాళ్ళ గుర్రాల మీదా చల్లాడు. వెంటనే వాళ్ళు మాయమయారు. తన గుర్రం పైనా, తన పైనా కూడా చల్లుకున్నాడు. తనూ మాయమయాడు!

వాళ్ళు మాయం కావటమూ, ఆ మూడు సింహాలూ ఉరుకులెత్తుతూ అక్కడికి చేరటమూ ఒక్కమాటే జరిగింది. ఎందు భోజనం దొరికింది కదా అని ఎంతో ఆశతో వచ్చిన ఆ సింహాలకి పాపం నిరాశ అయిపోయింది. కొంతసేపు అక్కడే తచ్చాడి, వాటి దారిన అవిపోయినై.

కాని, సింహాలు వెళ్ళిపోయినా మామూలు రూపంతో రాత్రివేళ, ఆ మహారణ్యంలో సంచరించటం ప్రమాదకరమని తలచి, తెల్లవారే వరకూ అదృశ్యరూపంతోనే వుండిపోయారు అన్నాదమ్ములు.

తెల్లవారింది. ఉదయనుడు తన వద్ద వున్న నల్లభస్మం, తన పైనా, తన గుర్రం పైనా, సోదరుల పైనా, వాళ్ళ గుర్రాల పైనా చల్లేసరికి, మళ్ళీ మామూలు రూపాలు వచ్చేసినై.

అప్పుడు వాళ్ళు ముగ్గురూ గుర్రాల పైన వాయువేగాన స్వారి చేయుగల్గుతున్నారు. గర్తంవాడి దయవల్ల అందరికీ సరియైన చూపు వచ్చింది కనక, ఎవరు ముందూ, ఎవరు వెనకా అన్న బాధ లేదు. కొంత దూరాన వారికి ఒక నిర్మానుష్యమైన ప్రదేశంలో, ఒక భవనం కనిపించింది.

"ఆ భవనం ఎవరు ముందు చేరుకోగలమో చూద్దాం!" అంటూ సోదరులు ముగ్గురూ తమ తమ గుర్రాల్ని జోరుగా అదలించారు.

ఉదయనుడి గుర్రం శరవేగంతో పోతున్నది. అతనికి కొంచెం వెనకలో సంధ్య, విశిధుడు సమానవేగంతో వస్తున్నారు. కాని, చిత్రం! ముందు పోతున్న ఉదయనుడు రెప్పపాటులో మాయమయ్యాడు.

—(ఇంకా వుంది)





**8**

[విచిత్రకవచాలను వెతికి తెచ్చేందుకు బయలుదేరిన కవలసోదరులు, అరణ్యంలో ఒక గద్దం వారికి దొరికిపోయి, చివరకు వాణ్ణి ఓడించి, వాడి నుంచి అపూర్వ శక్తులు గల ఖడ్గాలూ, అంజనాలూ తీసుకున్నారు. ముగ్గురూ కొంతదూరం అరణ్యంలో ప్రయాణించిన తరవాత, ముందుపోతున్న ఉదయనుడు హఠాత్తుగా మాయమయ్యాడు. తరవాత—]

ఉదయనుడు కనిపించకుండా పోగానే సంధ్యా, నిశీధులు తమ గుర్రాలను లాగి పట్టి, వేగం తగ్గించి, నెమ్మదిగానే ముందుకు సాగారు. కొంత దూరం పోయేసరికి భవనం ముందువైపున, ఒక పెద్ద కందకం కనుపించింది. తమ సోదరుడు గుర్రంతో కూడా అందులో పడిపోయి వుంటాడని సంధ్యా, నిశీధులు గ్రహించారు: కాని బ్రహ్మాండమైన లోతుగల ఆ కందకంలో ఉదయనుడి జాడగాని, అతడి గుర్రం జాడగానీ కనుపించ లేదు.

సంధ్యా, నిశీధులకు ఏమీ పాలు పోయింది కాదు. భవనంలోకి ప్రవేశిద్దామా అంటే, కందకం వెడల్పు కాస్తా కూస్తా కాదు. పోనీ, కందకానికి అసలు మొదలెక్కడో, చివరఎక్కడో కనిపెడితే భవనంలోకి తేలికగా ప్రవేశించ వచ్చును కున్నారు.



ఇలా ఆలోచించి సంధ్యా, నిశీథులు గుర్రాలను నడిపించుకుంటూ కందకం అంచునే అడుగులు వేయజొచ్చారు. కాని, ఎంత దూరం పోయినా కందకానికి దరీ అంతూ కనబడలేదు. తిరిగి తిరిగి వారు మళ్ళీ బయలుదేరిన చోటుకే వచ్చేశారు. దీనిని బట్టి ఆ కందకానికి మొదలూ చివరా లేదని, భవనంలో ఎవరూ చొరవీలు లేకుండా వుండటానికే, చుట్టూతా ఈ కందకం త్రవ్వబడిందనీ అనుకున్నారు. కాని, ఇంతకూ భవనం లోకి ప్రవేశించే మార్గం స్ఫురించనే లేదు.

కొంతసేపు తీవ్రంగా ఆలోచించిన పిదప సంధ్య, నిశీథుడితో, ''నిశీథా! ఎలాగైనా మనం యీ కందకం దాటి తీరాలి. గుర్రాల మీద దౌడుతీసుకొంటూ వచ్చి, ఒక్కదూకున దాటుదాము. దాటగలిగామా అదృష్టవంతులమే. లేదూ, కందకంలో పడటమే సంభవిస్తే, మన ఉదయ సుధి కోసం కాయశక్తులా వెతుకుదాము,'' అంటూ ఉత్సాహపరిచాడు.

ఇందుకు నిశీథుడు కూడా, "భేష్!" అన్నాడు. వాళ్ళు మళ్ళీ తమ గుర్రాల నెక్కి, కొంత దూరం వెనక్కి వెళ్ళి, శరవేగానవచ్చి, ఒక్కదూకులో కందకం దాటారు.

అదృష్టవశాత్తూ, ఇద్దరూ కూడా ఎట్టి ప్రమాదమూ లేకుండా కందకానికి అవతలి గట్టున పడ్డారు. ''ఇదంతా మన ముందు మంచికే సూచనగా కనబడుతున్నది. ఇక భరవాలేదు, కోటలో పాగా వేశామన్న మాటే,'' అని అనుకొని సంతోషించారు సోదరులు. ఆ సంతోషంతో వారు భవనం ప్రవేశించారే కాని, తీరా చూడగా ఆ భవనంలో మనుష్య సంచారమే లేదు. లెక్కలేనన్ని ద్వారాలు వున్నై కాని, ఒక్కదానికీ తలుపులు లేవు. వారు ఒక్కొక్కద్వారమే దాటుకుంటూ పోతుండగా, ప్రతి ద్వారాని ఇరువైపులా మానవుల శిలాప్రతిమలు కనబడినై.

చివరికి వాళ్ళు ఒక పెద్దద్వారం చేరుకున్నారు. నిజానికి అది ద్వారం కానే కాదు. ఒక బ్రహ్మాండమైన రాక్షసుడు. ఈ రూపంలో ఆకాశం ఎత్తున నిలబడి నిద్రపోతూ వున్నాడు. వాడి కాళ్ళ మధ్యనున్న ఖాళీస్థలమే ద్వారంవలె కనిపిస్తున్నది. ఈ రాక్షసుడికి రెండువైపులా రెండు సింహాల ప్రతిమలు వున్నై. అవి జీవకళతో వుట్టిపడుతూ, మీదికి ఉరుకుతామన్నటు భయంకరంగా చూపట్టే సరికి, సోదరులిద్దరూ ఒక్కమాటుగా కెవ్వుమన్నారు.

ఈ కేక చెవిని బడి రాక్షసుడికి మెలకువ వచ్చేసింది. వాడు అమాంతం సంధ్యా, నిశీధులను తన గుప్పిటిలోకి తీసుకుని, "భేష్! భేష్! మరో రెండు విగ్రహాలు!" అన్నాడు ఎంతో ఉత్సాహంతో. వాడు యీమాట అనగానే, వారు భవనంలో చూస్తూ వచ్చిన మానవవిగ్రహాలు ఏదో మాయవల్ల తయారైనవే అని ఊహించగలిగారు.

తలవని తలంపుగా యిలా చిక్కుబడిపోయినందుకు సంధ్యానిశీధులు విచారించారు. కాని, విచారించి వారు చేయగలదేమున్నది?

ఇటువంటి చిక్కులు జీవితంలో ఎన్నో తగులుతూ వుంటై. నిజానికి చిక్కులలో పడి, బుద్ధిబలం వల్ల వాటి నుండి తప్పించుకు బయట పడటంలోనే ఉన్నది మానవుని తెలివి. ఈ ఉద్దేశంతో వారు ధైర్యం తెచ్చుకున్నారు. "చావుకి నిస్పృ





చావులున్నవా? ఏమైతే కానీ, ఒక పథకం వేసి చూస్తాను, ఈ రాకసుడికి!'' అను కున్నాడు, నిశితమైన బుద్ధి నైపుణిగల నిశీధుడు.

అలా అనుకుంటూ నిశీధుడు, రాక సుని ఎదుట నిలచుని, ''ఏమయ్యోయ్, మేము ఎవరమనుకుంటున్నావే: మేము యిక్కడికి దొంగతనంగా రాలేదు. ఫలానా గర్దభవాడు మీకు ఒక వార్త అందించ మని మమ్మల్ని పంపాడు. అందుకే....'' అని యింకా ఏమో చెప్పబోతూండగా, రాకసుడు ఆత్రంతో, ''ఏమిటీ, వాడు బతికేవున్నాడా? ఇన్నాళ్ళూ తిరిగి రాక పోయేసరికి, వాడు ఏదో ప్రమాదం వచ్చి చనిపోయారనుకున్నామే! అయితే యింతకూ వాడు మీకు చెప్పి పంపిన వార్త ఏమిటో త్వరగా చెప్పండి,'' అని తొందర పెట్టాడు.

అప్పుడు నిశీధుడు, రాకసుడితో, ''అతని ప్రాణానికేమీ మోసం లేదు. కాని, అతడి జీవిత రహస్యం ఎవరో కనిపెట్టి వేశారట. కనిపెట్టటమే కాదు, అతడి దగ్గిర వున్న భస్మాలూ, అంజనాలూ, తుప్పాలూ కూడా కాజేసి పోయారట. అవి లేనిదే తను ఒక్క అడుగైనా ముందుకి వెయ్యలేడట. అందువల్ల యీ వార్త మీకు అందజేసి, మళ్ళీ కొన్ని అంజనపు డబ్బాలూ, భస్మాలూ పంపమని చెప్ప మన్నాడు.'' అని ఎంతో నమ్మేటట్టు చెప్పాడు.

అంతా విని, రాకసుడు, ''అలాగా, పాపం! అందుకనే వాడు తిరిగి రాలేక పోయాడు. ఇంకా నయం, ఆ దుర్మార్గు లెవరో, వాడి దండ కాజేశారు కారు. అదే జరిగితే వాడిని రక్షించటం ఎవరి వల్లా కాదు. సరే, యిక నేను పోయి వస్తాను. మీరు మాత్రం ఒక్క పురుగుని కూడా లోపలికి రానివ్వకుండా చూస్తా వుండండి.'' అనిచెప్పి బయలుదేరాడు.

ఎప్పుడైతే రాకసుడు వదిలిపోయాడో, సంధ్యా, నిశీధులు సంతోషంతో ఎగిరి

గంతేశారు. అంతటి రాకాసుణ్ణి టోపీ వేశాం గదా అని వారు ఉప్పొంగిపోయారు. ఇంతలో నిశీధుడు, "ఇక ఒక్క క్షణం కూడా మనం ఆలస్యం చెయ్యకూడదు. వాడు తిరిగి వచ్చేలోగా మనం యీ భవనం యొక్క రహస్యం ఏమిటో కనుక్కోవాలి," అన్నాడు.



సోదరులిద్దరూ ముందుకు సాగారు. మరికొన్ని ద్వారాలు దాటి, చివరి ద్వారం కూడా దాటి వెళ్ళేసరికి, ఒక పెద్ద కొలను కనుపించింది. అందులో అందాల హంసలు ఈదులాడుతున్నాయి.

ప్రొద్దుటనగా బయలుదేరి హైరానపడుతూవున్న ఆ కవలసోదరులకు చాలా దాహం వేసింది. దప్పిక తీర్చుకుందామని సంధ్య కొలనులో దిగి, పుడిసెడు నీళ్ళు తీసుకుని తాగాడు. కాని, ఆ నీరు గొంతు దిగిందో లేదో, పాపం సంధ్య శిలా ప్రతిమగా మారిపోయాడు.

తన కళ్ళ ఎదటనే సోదరుడు యిలా రాయి అయిపోవటం చూసి, నిశీధుడు ప్రతిమలా నిలుచుండిపోయాడు. "ఇంకా నయం, నేను కూడా తొందరపడి తాగినట్టయితే, నాగతీ యింతే అయేది. ఉదయుడి గతి ఏమయిందా అని పాలుపోకుండా వున్న ఈ సమయంలో, సంధ్య కూడా యిలా అయిపోయాడే! నాకూ ఏదైనా ఆపద వచ్చిందా, మా అతిగతి కూడా లోకానికి తెలియకుండాపోతుందే!" అని అనేకవిధాల చింతించాడు.

నిశీధుడు మరికొంతదూరం ముందుకు పోయేసరికి, ఒక పెద్ద తోట కనుపించింది. ఆ తోటలో రకరకాల ఫలవృక్షాలున్నై. అన్నిటికంటే చిత్రమైనది ఒక మామిడిచెట్టు. ఆ చెట్టున వున్న కాయలు యిన్నీ అన్నీ కావు. ఎక్కడో గాని ఆకే కనుపించటం లేదు. అంత విరగ కాచిందన్నమాట ఆ మామిడిచెట్టు.

నిశీధుడికి యిప్పుడు బాగా ఆకలి వేసింది. గబగబ యిన్ని పళ్ళుకోసి, ముందు పడవేసుకుని, ఒక పండు తిని



తినబోయాడు. కాని చిత్రమేమిటో, పండు కొరకటంతోటే, నిశీధుడు కోతిగా మారి పోయాడు. కోతిగా మారిపోవటంతో, "అయ్యో బాబో, ఇంకా ఏమి విడ్డూరాలు జరగబోతాయో. యీ రాక్షసమాయలు ఎవరు తెలుసుకోగలరు?" అనుకొని, నిశీధుడు తక్కిన పళ్ళు తినకుండా, ఎక్కడివి అక్కడే వదిలేశాడు. ఆ కోతి రూపంలో వున్న నిశీధుడు, తన సోదరుడైన సంధ్య శిలారూపం దాల్చిన కొలను వద్దకు వచ్చి, దాని చుట్టూ తిరగసాగాడు.

ఇంతలో కొలనులో నించి ఏదో బుడబుడమని శబ్దం వచ్చింది. మరి కొద్ది సేపటికల్లా, నీటిలో నించి ఒక హంస తన వైపు రావటం కనుపించింది. ఇదంతా కోతి రూపంలో వున్న నిశీధుడు స్పష్టంగా చూడగలుగుతూనే వున్నాడు.

మరి కొద్ది సేపటికల్లా, ఆ హంస పూర్తిగా బైటికి వచ్చి, ఒక మనిషిగా మారిపోయింది. నిశీధుడు ఎగిరి గంతేశాడు. ఎందుకని? ఆ వచ్చింది కందకంలో పడి కనపడకుండా పోయిన తన ప్రియసోదరుడు ఉదయనుడే!

ఉదయనుడు ఒడ్డుకి రాగానే సంధ్య శిలాప్రతిమ కంటబడి, కొయ్యబారి పోయాడు.

ఇంతలో కోతి రూపంలో వున్న నిశీధుడు, ఉదయనుడి కాళ్ళను చుట్టేసుకున్నాడు. అది మామూలు కోతే అనుకుని మొదట ఉదయనుడు దాన్ని విదిలించి కొట్టాడు. కాని, అది విడవకుండా కాళ్ళను చుట్టేసుకోవటం చూసి, తన సోదరుడైన నిశీధుడే యిలా మారిపోయి వుంటాడని అనుమానించక తప్పలేదు.

ఐతే, ఏమి చెయ్యాలో ఉదయనుడికి తోచలేదు. సంధ్య యిలా రాయిగా ఎందుకు మారాడో. కోతి రూపంలో వున్నది తన సోదరుడు అవునో కాదో తనకు ఎలా తెలుస్తుంది?

కొంత సేపు అలా ఆలోచించి, ఛటుక్కున ఏదో ఉపాయం స్ఫురించిన



వానిలా తన జేబులో వున్న భస్మాలూ, అంజనాలూ బైటికి తీశాడు. సంధ్య శిలా విగ్రహం పైన నల్ల భస్మం చల్లాడు. ఏమీ కాలేదు. పచ్చ అంజనం రాసి చూశాడు. మార్పు కనిపించలేదు. ఎర్ర అంజనం రాశాడు. అప్పటికి ఆ శిలా ప్రతిమ అలాగే వుండిపోయింది. అన్ని విధాల ప్రయత్నించినా ఫలితం దక్కక పోయేసరికి, ఉదయనుడు ఆ అంజనాలూ భస్మాలూ కోతి రూపంలో వున్న నిశీధుడి పైన చల్లాడు. కాని, యీసారి వాటివల్ల మార్పు ఏమీ రాలేదు. కోతి కోతిగానే వుండిపోయింది.

ఉదయనుడికి ఏమి చెయ్యాలో పాలు పోక, కొలను ఒడ్డునే కూర్చుని ఆలోచనలో పడ్డాడు. అప్పుడు కొలనులోని హంసలలో ఒకటి, ఉదయనుడి పాదాల ముందుగా పోయింది. ఉదయనుడు చటుక్కున దాన్ని పట్టుకుని, బైటికి తీశాడు. బైటికి రాగానే ఆ హంస ఒక అందాలకన్యగా మారిపోయింది.

ఆ కన్య సిగ్గుతో తల వంచుకొని, మాట్లాడకుండా నిలబడింది. ఆమెతో ఉదయనుడు, "నీ వెవరు? ఇలా హంస రూపంతో, ఎందుకున్నావు? చెప్పితే...." అని యింకా ఏమో అనబోయాడు.


అంతలో, "ఎక్కడరా, మీరు?" అనే పెద్ద కేక ఒకటి వినిపించింది.

ఎప్పుడైతే యీ కేక వినిపించిందో వెంటనే ఆ కన్య, ఆ వస్తున్నది భవనాన్ని కాపలాకాసే రాక్షసుడే అని తెలుసుకొని, ఉదయనుడితో, "అదంతా తర్వాత చెబుతా. ముందిప్పుడు ప్రాణాలు రక్షించుకోవాలి," అంటూ, సంధ్య శిలా ప్రతిమనూ, ప్రతిమ దగ్గిర వున్న కోతిని కొలనులోకి తోసివేసింది.

వెంటనే అవి రెండూ హంసలుగా మారిపోయాయి. తర్వాత ఉదయనుడి చెయ్యి పట్టుకుని, తను కూడా కొలనులోకి దూకింది. దూకి దూకటంతోనే, వాళ్ళిద్దరూ కూడా హంసలైపోయారు.

—(ఇంకా వుంది)





**9**

[సంధ్యా, నిశీధులు చెప్పిన మాట నమ్మి, రాక్షసుడు గద్దపువాణ్ణి చూడబోయాడు. ఈలోపల కవలలిద్దరూ, రాక్షసుడి భవనంలో వున్న కొలను పక్కనుపోయి, శిల్పాప్రతిమగానూ, కోతిగానూ మారిపోయారు. విజయుడు వెంట వచ్చిన ఒక కన్య, రాక్షసుడి కేక విని, కవలల్ని కొలనులోకి తోసింది. అందరూ హంసలుగా మారిపోయారు. తరవాత—]

రాక్షసుడు మరొకసారి, "ఎక్కడరా మీరూ?" అంటూ భయంకరంగా కేక పెట్టాడు. వాడిప్పుడు చాలా కోపం మీద వున్నాడు. సంధ్యా, నిశీధులు తనను మోసపుచ్చారని వాడు, గద్దపువాడితో మాట్లాడిన తరవాత తెలుసుకున్నాడు.

గద్దపువాడు, రాక్షసుడు తన ఇంటికి రావటం చూస్తూనే ఆశ్చర్యపోయాడు. తరవాత వాడికి రాక్షసుడు సంగతి సందర్భాలు చెప్పగానే తల బాదుకుంటూ, "అయ్యో, ఆ దొంగ వెధవల్ని కోటలోనే వదిలి వచ్చావా? వాళ్ళు నా దగ్గిరున్న భస్మాలు అవి కాజేసి పోవటమేగాక, పైగా నీకు కూడా భలే టోపీ వేశారే! వీళ్ళెక్కడో గడుగ్గాయిల్లా వున్నారు చూడబోతే. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నువ్వు వెంటనే తిరిగి కోటకు పోయి వాళ్ళను పట్టుకో. అలా కాకపోతే, మన



రహస్యాలన్నీ వాళ్ళకు తెలిసిపోతాయి. ముఖ్యంగా మన భవనం యొక్క రహస్యం వాళ్ళకు తెలిసిందా. సరే. నాకూ కూడా ఆయువు మూడిందన్న మాటే. కనుక వెళ్ళు, త్వరగా వెళ్ళు," అని గడ్డపువాడు. రాక్షసుణ్ణి తొందర పెట్టాడు.

గడ్డపువాడి సలహా ప్రకారం రాక్షసుడు తన కోటలోని భవనానికి తిరిగి వచ్చే సరికి, తను ద్వారం వద్ద కాపలా వుంచి వెళ్ళిన సంధ్యా, నిశిధులు కనిపించలేదు. దానితో వాడు, "ఎక్కడరా మీరూ!" అని పెడబొబ్బలు పెట్టుకుంటూ కొలను వైపుకి వచ్చాడు.

ఎంత వెతికినా రాక్షసుడికి కొలను దగ్గిర వాళ్ళ జాడ కనిపించలేదు.

రాక్షసుడు మరింత కోపంగా ఆ ప్రాంతాలను చీమతలకాయంత మేర కూడా విడవకుండా గాలించసాగాడు. సాయంత్రం వరకూ అలా వెతికినా ప్రయోజనం లేక పోయే సరికి, వాడికి ప్రాణం విసిగి పోయింది. చివరకు నిరాశతో తన భవనం చేరుకున్నాడు.


రాక్షసుడు యిలా వెతుకుతున్నంత సేపూ, ఉదయనుడు తన సోదరులతో సహా హంస రూపంలో కొలనులోనే వున్నాడు. ఎప్పుడైతే రాక్షసుడు తిరిగి భవనానికి వెళ్ళి పోయాడో, అప్పుడు ఉదయనుడు నీటిలోంచి బైటికి వచ్చి మామూలు రూపం పొందాడు. అతని వెంటనే సరోవరకన్య కూడా బైటికి వచ్చి చేరుకున్నది. అప్పుడు ఆ కన్య ఉదయనుడితో యిలా చెప్పింది:

"మీరెవరో పాపం దురదృష్టవంతులు. దారి తప్పి యీ భవనంలో ప్రవేశించినట్టున్నారు. ఈ భవనానికి చుట్టుపక్కల నాలుగు కోసుల మేర ఎక్కడ ఏ పురుగు కదిలినా, యిట్టే పసికట్టి, పట్టివేయగల గడ్డపువాడు ఒకడున్నాడు. వాడిని తప్పించుకు రావటం బ్రహ్మతరం కూడా కాదు. మరి మీరెలా వచ్చారో నాకు ఆశ్చర్యం

గానే వున్నది. ఇప్పటికైనా మీరు ఈ చోటు వదిలి వెళ్ళిపోవటం మంచిది. అలా చేయకపోతే మీ ప్రాణాలకే మోసం కలగటం నిజం. ఈ భవనం ఒక దుష్ట రాక్షసుడిది. ఇప్పుడు వాడిక్కడ లేడు. వాడు ఎప్పుడు వచ్చేదీ, ఎప్పుడు పోయేదీ ఎవరికీ తెలియదు. ఈ లోపల మీ సోదరులకు మామూలు రూపాలు వచ్చే మార్గం నేను చెబుతాను. అలా చేసి, త్వరగా తప్పించుకు వెళ్ళిపొండి."

అంతా విని ఉదయుడు, "మేము పొరబాటున యిక్కడికి రాలేదు. ఈ భవనం యొక్క రహస్యమేమిటో తెలుసుకోవాలనే కుతూహలంతోనే, ప్రాణాలను కూడా లెక్క పెట్టక వచ్చాము. కనుక మమ్మల్ని గురించి నువ్వు విచారించకు. ఈ రాక్షసుణ్ణి గురించి నీకు కూడా తెలిసిన వివరాలు చెబితే చాలు. అంతకూ నీవు ఎవరివో చెప్పావే కాదు. చెప్పటానికి అభ్యంతరం లేకుంటే, ఆ విషయం విని సంతోషిస్తాను." అన్నాడు.

అందుకు సరోవరకన్య, "చెప్పటానికి అభ్యంతరం ఏమీ లేదు. కాని, తెలుసుకుని నీవు చేయగలిగింది ఏమీ వుండదనుకుంటాను. అయినా అడిగావు గనక చెబుతాను." అంటూ కొలనులోకి



వెళ్ళి, మరి కొద్దిసేపటిలో, మరి రెండు హంసలతో బైటికి వచ్చింది. సరోవరకన్యతోపాటు ఆ రెండు హంసలు కూడా ఒడ్డుకి రాగానే, రెండు కన్యలుగా మారాయి.

వాళ్ళు ముగ్గురూ ఒక్క అచ్చులో పోసినట్టు వుండటం చూచి ఉదయుడు, "మీరు కవలల్లా కనిపిస్తున్నారే?" అన్నాడు.

"అవును." అని ముగ్గురు కన్యలూ ఒకేసారి జవాబిచ్చారు. దానితో ఉదయుడు ఉత్సాహభరితుడై, "అయితే యిన్నాళ్ళ బట్టి మేము వెతుకుతున్నది మీ కోసమే. మీరు దానశీల మహారాజు గారి కుమార్తెలు కదూ?" అని అడిగాడు.



ఈ ప్రశ్నకు ఆ కన్యలు పొందిన ఆశ్చర్యం యింతా అంతా కాదు. "నిజమే. మా సంగతి నీ కెలా తెలిసింది ?" అని ఏస్తుపోతూ అడిగారు.

"ఎలా తెలిసేదేమిటి ? మీ పుట్టు పూర్వోత్తరాలన్నీ మాకు తెలుసు. మిమ్మల్ని వెతికి పట్టడానికే, మేము మీ తండ్రిగారి ఆశీర్వాదం పొంది బయలు దేరాం. మీ పేర్లు..." అని అడిగాడు ఉదయనుడు.

"సుహాసిని....మా పుట్టు పూర్వోత్తరా లన్నీ తెలుసునన్నారుగా ? అటువంట వ్వారు తక్కిన రెండు పేర్లూ, మీరే చెప్పుకో గలరనుకుంటాను." అన్నది ఆ కన్య.

"చెప్పుకోలేకేం ? ఇంత సులభంగా, ఇంత త్వరలో మిమ్మల్ని కలుసుకో గలుగుతామని మేము కలలో కూడా అనుకోలేదు. ఈ శుభవార్త నా సోదరు లకు కూడా తెలిస్తే ఎంత బాగుండునో." అని తన సోదరులు మానవ స్వరూపంతో లేనందుకు విచారం కనబరిచాడు. ఉదయనుడు.

ఇది చూసి సుహాసిని, "విచా రించకు !" అంటూ కొలనులోకి దిగి మరి కొద్దిసేపటికల్లా కోతి రూపంతో వున్న నిశిధుడితోనూ, శిలా ప్రతిమ రూపంతో వున్న సంధ్యతోనూ ఎంతో ఉత్సాహంగా బయిటికి వచ్చింది.

తర్వాత ఆమె ఉదయనుడిని వెంట బెట్టుకుని, ఆ తోటలోని మామిడిచెట్టు దగ్గరకు తీసుకు వెళ్ళింది.

ఆ మామిడిచెట్టు పక్కనే కొన్ని కుక్క గొడుగులు మొలిచి వున్నై. వాటిలో కొన్నిటిని తీసుకోమన్నది. ఉదయనుడు అలాగే చేశాడు. తర్వాత మరి కొంత దూరం తీసుకుపోయింది. అక్కడ ఒక రాకేస విగ్రహం వున్నది. ఆ విగ్రహం నోటిలోంచి నీరు ప్రవహిస్తోంది. ఆ నీరు కొంత తీసుకోమన్నది. అలాగే ఒక ఆకుతో దొన్నె చేసి యివ్వగా. ఉదయనుడు దొంట్లో ఆ నీరు నింపుకొన్నాడు. నీటితో

సహా వాళ్ళు తిరిగి కొలను వద్దకు చేరుకున్నారు.

సుహాసిని, ఉదయునుడితో ఆ కుక్క గొడుగులను కోతికి పెట్టమన్నది. అలాగే చేసేసరికి కోతి రూపం పోయి, నిశిధుడికి తిరిగి మామూలు రూపం వచ్చింది. తర్వాత దొన్నెతో తెచ్చిన నీరు శిలా ప్రతిమకు రాచేసరికి, సంధ్యకు మామూలు రూపం వచ్చేసింది.

అప్పుడు ఉదయునుడు ఆ కన్యలను తన సోదరులకు చూపుతూ, "చూడారా, చిత్రం! మనం ఎవరి కోసం వెదుకుతున్నామో, ఆ రాజకుమార్తెలే వీరు. కనుక మనం వచ్చిన పని అయినట్లే. ఇక వీరిని తీసుకుని మనం యీ భవనం నుంచి బైటపడే మార్గం చూడాలి." అన్నాడు.

అందుకు సుహాసిని, "అది అంత తేలికైన పనిగాదు. మమ్మల్ని రక్షించటం మాట అలావుంచి, ముందు మీ ప్రాణాలు కాపాడుకోవటానికి యిక్కడి నుంచి బైట పడగలిగితే........" అని యింకా ఏమో చెప్పబోతూండగా, ఒక పెద్ద సుడిగాలి ప్రారంభమైంది.

అప్పుడు సుహాసిని, "అదుగో, వాడు వస్తున్నాడు. ఈ సుడిగాలి దానికే గుర్తు. ఇక మేము తిరిగి కొలనులోకి పోతాం. మరి మీగతి ఏమిటి? క్రిందటి సారిలాగా హంసలుగా మార్చినా, వాడు మిమ్మల్ని పట్టివేయగలడు. మరి ఎలా తప్పించు





కుంటారో జాగ్రత్త." అని చెబుతూ తన చెల్లెళ్ళతో సహా కొలనులోకి పోయింది.

వెంటనే ఉదయనుడు తన వద్ద వున్న తెల్ల భస్మం తన పైనా, సోదరుల పైనా చల్లాడు. వెంటనే వాళ్ళు మాయమై పోయారు. మరి కొద్ది సేపటికల్లా సుడి గాలి తగ్గిపోయింది. ఆ వెంటనే ఒక బ్రహ్మాండమైన గద్ద కొలను ఒడ్డున వచ్చి వాలింది. కాని, చిత్రం! ఒడ్డున వాలుతూనే దానికి గద్దరూపం పోయి, ఒక భయంకరమైన రాకసాకారంతో నిలబడింది.

ఆ రాకసుడు అలా నిలబడగానే కొలనులోవున్న హంసలన్నీ, రెక్కలు రెప కొట్టుకుంటూ వచ్చి, బారులు తీర్చి ఒడ్డు దగ్గరగా నీటిలో నిలిచినై. రాకసుడు ఒక్కొక్కటిని సేపు వాటివంక పరీక్షగా చూచి, ఆ వెంటనే తిరిగి గద్ద రూపంలో రివ్వున ఆకాశమార్గాన వెళ్ళిపోయాడు.

ఇదంతా జరిగేటప్పటికి బాగా చీకటి పడింది. ఉదయనుడు తన భస్మం సహాయం వల్ల తనకూ, సోదరులకూ మామూలు స్వరూపాలు తెప్పించుకున్నాడు. అప్పటికి మూడు రోజులైంది, వాళ్ళు తిండితిని. అందువల్ల ముందుగా తమ దగ్గిరవున్న తువ్వాలు సహాయంతో పళ్ళూఫలాలూ సృష్టించుకుని పొట్టలు నింపుకొన్నారు. తర్వాత కవలకన్యలు తిరిగి బైటికి వస్తారేమోనని కొంతసేపు ఎదురు చూశారు. కాని ఎంతసేపటికీ వాళ్ళు రాకపోయేసరికి, యిక ఆ రాత్రికి ఎలాగో అక్కడే గడపవలసి వుంటుందని నిశ్చయించుకున్నారు. మామూలు రూపంతో వుండటం క్షేమంకాదని వాళ్ళు భస్మం మహిమవల్ల, తిరిగి అదృశ్య రూపం పొంది అక్కడే వుండిపోయారు.


తెల్లవారింది. కొలనులోంచి కవల కన్యలు బైటికి రావటమూ, కవలసోదరులు తిరిగి మామూలు స్వరూపం పొందటమూ ఒక్కసారిగా జరిగింది.

అప్పుడు ఉదయనుడు, సుహాసినిని అడిగాడు: "అయితే, ఆ రాక్షసుడు తిరిగి ఎక్కడికి వెళ్ళాడు? మళ్ళీ ఎప్పుడు వస్తాడు?"

"ఎక్కడికేమున్నది, వేటకు వెళ్ళి వుంటాడు. వేట అంటే జంతువుల వేట కాదు. కవలలవేట." అని బదులు చెప్పింది సుహాసిని.

"కవలల వేట ఏమిటి?" అని మళ్ళీ ప్రశ్నించాడు ఉదయనుడు.

"అదొక విచిత్రమైన రహస్యం. ఈ రాక్షసుడు ఒక దేవిని ఆరాధిస్తున్నాడు. ఆ దేవి యొక్క మహిమవల్లనే ఈ మాయా భవనం నిర్మించగలిగాడు. ఇందుకుగాను వాడు దేవికి యాభైమంది కవలల్ని బలి ఇవ్వాలి. ఈ బలి పూర్తి అయిందంటే, దేవి వాడికి అన్ని మహిమలూ ప్రసాదించటమే గాక, మరణం అనేది లేకుండా కూడా వరం ఇస్తుంది. ఇప్పటికి నలభై ఏడుగురు కవలలు మాత్రమే వాడికి చిక్కారు. తక్కినవారు ఎప్పుడు చిక్కుతారా, ఎప్పుడు బలి అర్పించి దేవియొక్క వరం పొందుతానా, అని వాడు ఒక్క క్షణం కూడా స్తిమితం లేక, ఇలా నిత్యమూ గద్దరూపంలో ప్రపంచం అంతా చుట్టి వస్తుంటాడు." అని రాక్షసుడిని గురించిన గుట్టు కాస్తా వెల్లడించింది, సుహాసిని.



ఇదంతా కవల సోదరులు ఎంతో శ్రద్ధగా చెవులు రిక్కించి విన్నారు. అంతా విని, "ఆహా! ఎంత అదృష్టవంతులం. మేము ముగ్గురం వాడికి చిక్కివున్నట్టయితే, ఈ రోజుతో వేట పూర్తి అయేది, బలి సంపూర్ణమయేది సుమా!" అన్నాడు ఉదయనుడు.

"అదెలాగ? బలి ఎలా పూర్తవుతుంది? మీరూ కవలలేనా?" అని ఆశ్చర్యంతో అడిగారు కవలకన్యలు.

"అవును. వాడికి కావలసిన మనుష్యులమూ, మిమ్మల్ని రక్షించవలసిన వాళ్ళమూ మేమే అయామే అని విచారిస్తున్నాను." అన్నాడు ఉదయనుడు.

"అలాగైతే మీరు మరీ జాగ్రత్తగా మసలుకోవలసి వుంటుంది." అని హెచ్చరించింది, సుహాసిని.

"అవును. అసలు రహస్యం యిప్పుడు తెలిసింది కనుక, యిక ముందు వుండవలసిన జాగ్రత్తలోనే వుంటాం. కాని ఎలాగైనా యిక్కడినుంచి బైటపడేమార్గం ఆలోచించాలి కదా? ఈ చోటు అంతా మాయాజాలంతో నిండి వున్నట్టు తెలుస్తోనే వుంది. అందువల్ల యిక్కడినుంచి బైటపడటంలో మనం ఎదుర్కోవలసిన కష్టాలు ఏముంటుయ్యో తెలియజేస్తే, వాటికి తగిన ఉపాయం ఆలోచిస్తాము," అన్నాడు ఉదయనుడు.

అందుకు సుహాసిని, "అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఒక్కటే వున్నది. అది ఏమిటి అంటే, మీరు ఆ రాకినుండి కంటి బడకుండా వాడి భూగృహంలో ప్రవేశించ గలిగితే సరి," అన్నది.

ఇది విన్న ఉదయనుడు, "ఓస్, ఇదేక ఘనకార్యమా. మా దగ్గర వున్న భస్మాలవల్ల, మేము ఎలా అదృశ్య రూపం పొందగలుగుతున్నది, మీరే చూస్తారు గదా?" అన్నాడు.

అందుకు సుహాసిని, "మహా గప్ప ఉపాయం కనిపెట్టావే! ఇంకా నయం, ముందుగా చెప్పావు గనుక తెలుసుకో గలిగాను. ఏ భస్మాలూ, అంజనాలూ, వాడి భూగృహంలో పని చెయ్యవు. వాటి మహిమ అల్లా యిక్కడ వున్నంత వరకే. కనుక వాటి ఆశ పెట్టుకోబోకు." అన్నది.

ఎప్పుడైతే యీ విషయం విన్నారో అప్పుడు కవలలకు అది వరకున్న ధైర్యం కాస్తా జారిపోయి తెల్లమొగం వేశారు. వాళ్ళ విచారం కనిపెట్టిన సుహాసిని, "అలా అధైర్యపడతారేం! ఏదైనా ఉపాయం ఆలోచించాలి." అన్నది.

"ఆలోచించేందుకైనా వ్యవధి ఉండాలి కదా!" అన్నాడు ఉదయనుడు.

అందుకు సుహాసిని, "నిజమే. నిదానంగానే ఆలోచించాలి." అన్నది.

—(ఇంకా వుంది)





# రాకాసిలోయ

## 10

[గడ్డపువాడి దగ్గరకు పోయిన రాక్షసుడు, వాడి ద్వారా కవలసోదరులు తమను మోసగించారని తెలుసుకున్నాడు. సుహాసిని సహాయంతో సంధ్యా, నౌకులకు మామూలు రూపాలు వచ్చాయి. రాకాసుడి భూగృహం గురించి సుహాసిని వాళ్ళకు చెప్పింది. అందులో ప్రవేశించేందుకు కవలసోదరులు పథకం వేయసాగారు. తరవాత—]

తమ వద్ద వున్న భస్మాలూ, అంజనాలూ రాకాసుడి భూగృహంలో పని చెయ్యవని తెలుసుకున్న తరవాత, కవల సోదరులు వేరే మార్గం ఏమిటా అని చర్చించుకో సాగారు. ఆ సమయంలో వాళ్ళకో సందేహం కలిగింది: "ఈ రాకాసుడు ప్రపంచంలో ఎక్కడెక్కడి కవలలనూ ఇట్టే పసిపట్టి ఎత్తుకు వస్తాడుగదా! ఇంతకాలం అయినా వాడు మన జోలికి రాకుండా వూరుకోవటానికి కారణం ఏమై వుంటుంది?"

మర్నాడు వాళ్ళు రాజకుమార్తెలను కలుసుకున్నప్పుడు, ఉదయుడు తమకు కలిగిన ఈ సందేహాన్ని వెల్లడించే సరికి, వాళ్ళు ఆశ్చర్యపోయారు. "నిజమే సుమా! మాకు ఇంతవరకు ఈ సందేహమే కలగలేదు. బహుశా ఒక కారణంవల్ల వాడు మీ జోలికి



రాకుండా వుండి వుంటాడని యిప్పుడు నాకు తోస్తున్నది. ఐతే..." అని ఊరు కున్నది సుభాషిణి.

"ఫరవాలేదు, చెప్పు. నివు ఊహిం చిన కారణమే నిజమైతే, తగు జాగ్రత్తలో వుండవచ్చు కదా," అన్నాడు నిశధుడు.

అప్పుడు సుభాషిణి, "ఏమీ లేదు. ఏ విధమైన అవయవ లోపమున్నా, ఆ కవలలు రాక్షసుడి బలికి పనికిరారు. బలి ఇవ్వబోయే సమయమందు ఈవిషయాన్ని వాడు బాగా పరిశీలిస్తాడు. చూడగా మీకు అలాంటి లోపాలేవీ. మా పుట్టుకు కని పించ లేదు. కనుకనే యిలా మిమ్మల్ని అడగటానికి జంకుకలిగింది." అన్నది.

ఇది వింటూనే కవల సోదరులు ముగ్గురూ ఒక్కసారిగా, "మాకు సరియైన సందేహమే కలిగింది," అన్నారు.

తర్వాత ఉదయనుడు, పుట్టుకతో తమ దూష్యల విషయంలో ఎలాంటి లోపా లుండేవి, ఆ తర్వాత అరణ్యంలో వున్న గడ్డపువాడి పుణ్యమా అంటూ ఆ లోపాలు ఎలా తొలగిపోయింది రాజకుమార్తెలకు వివరంగా చెప్పారు.

వాళ్ళు యిలా మాట్లాడుకొంటుండగా, రాక్షసుడిరాక తెలిపే సుడిగాలి ప్రారంభ మైంది. వెంటనే రాజకుమార్తెలు కొలను లోనికి వెళ్ళిపోయారు. కాని, పాపం యీసారి కవలసోదరులు తప్పించుకోలేక పోయారు. ఉదయనుడు తన వద్ద వున్న భస్మం తీసి సరిగ్గా మీద చల్లుకోబోయే సరికల్లా, రాక్షసుడు అమాంతం ప్రత్యక్షమై, వాళ్ళ ముగ్గుర్నీ తన గుప్పిటిలో చిక్కించుకొన్నాడు.

కవల సోదరులు లోలోపల భయంతో గజగజ వణికిపోతున్నా, పైకి మాత్రం ధైర్యంగానే వున్నారు.

రాక్షసుడు వాళ్ళను, "ఎవరు మీరు? ఈ నా రహస్య ప్రదేశానికి ఎలా వచ్చారు? నిజం చెప్పండి. లేదా యింతకు ముందు వచ్చినవాళ్ళ గతి ఏమయిందో అదే మీకూ అవుతుంది." అని గర్జించాడు.

అందుకు ఉదయనుడు, "నిజమే నయ్యా. ఇక్కడికి రావటం కష్టమని, ఎంతో ప్రమాదకరమని, తీరా యిక్కడికి వచ్చాక కాని మాకు తెలియనే లేదు. ఐనా మేము ప్రాణాలకు తెగించి వచ్చాం కనుక, మేము చెప్పేది విని, నీ యిష్ట మొచ్చినట్టు చేసుకో." అన్నాడు.


"ఓహో! పిట్ట కొంచెం, కూత ఘనం—అన్నట్టుందే మీ వాలకం చూడగా! మా తమ్ముణ్ణి టోపి వేసింది మీరే కదూ? సరే, అసలిక్కడికి యిలా దొంగతనంగా ఎందుకొచ్చారో చెప్పండి ముందు." అని గద్దించాడు రాక్షసుడు.

"అదే పొరపాటు. మేము దొంగతనంగా రాలేదు. అలా రావలసిన అవసరం మాకు లేదు. మేము వచ్చిన పని ఏమిటి అంటే...." అని ఉదయనుడు ఏమో చెప్పబోతుండగా, "ఏమిటి ఏముంది? నాకు టోపి వేయటానికే," అనే మాటలు వినిపించినై.

కవల సోదరులు ఆ మాటలు వచ్చిన దిక్కుకు తిరిగి చూసేసరికి, మొట్ట మొదటగా తాము ఎవరినైతే మోసపుచ్చి గర్తపువాడి దగ్గరకు పంపారో, ఆ రాక్షసుడే తమవైపు చరచర నడిచి వస్తూండటం కనుపించింది.

రాక్షసుడు వస్తూనే, "అన్నా, వీళ్ళ సంగతి యిక నేను చూసుకుంటాను. కాలం వృధా పుచ్చకు. నీ వేటకి నువ్వు పో." అన్నాడు.





తమ్ముడు ఎప్పుడైతే యిలా అన్నాడో, అప్పుడు రాకాసుడు, "ఇదేదో పెద్ద గాథ లాగా వున్నది. వీళ్ళు మా తమ్ముడికి తెలిసినవాళ్ళుగానే" కనిపిస్తున్నారు. కనుక వీళ్ళ సంగతి వాడే చూచుకోవటం మంచిది." అనుకుంటూ తిరిగి గద్ద రూపంలో రివ్వున ఆకాశ మార్గాన వెళ్ళి పోయాడు.

ఆ వెంటనే రాకాసుడు, కవల సోదరులను వెంటబెట్టుకుని, తను కాపలా కాసే భవనంలోకి తీసుకుపోయాడు. వాళ్ళని సావకాశంగా కూచోబెట్టుకుని, "అబ్బాయిలూ! గద్దవువాణ్ణి టోపీ వేశారు. నన్ను టోపీ వేశారు. ఇప్పుడు మా అన్నను టోపీ వెయ్య జూచారు. కాని, పాపం మీ ఆటలు సాగక, నా చేతిలో చిక్కి పోయారు. గద్దవువాడి దగ్గిర మీరు కాజేసిన అంజనాలూ, భస్మాలూ, తువ్వాలూ అన్నీ అక్కడ పెట్టండి. తర్వాత తక్కిన సంగతులు మాట్లాడుకుందాం." అన్నాడు.

పాపం, ఏమి చేస్తారు కవల సోదరులు? తప్పనిసరిగా ఆ వస్తువులన్నీ అక్కడ పెట్టివేశారు. అప్పుడు రాకాసుడు, "అబ్బాయిలూ! ఇంతకాలంగా యిక్కడ కాపలా కాస్తున్నాగాని, నన్ను తప్పించుకు లోపలికి పోయినవాళ్ళు ఒక్కరూ లేరు. ఎవరు వచ్చినా నా చేతిలో చిక్కిపోయి, శిలాప్రతిమలుగా మారిపోవలసిందే. అదిగో చూడండి. వాళ్ళంతా యింకా ఎలాగ ఆహోరిస్తున్నారో. అలాంటిది ఆ రోజున మీరు నాకు టోపీ వేసినప్పటి నుంచి, నేను కడుపునిండా తిండి కూడా తినటం లేదు. భలే ఆకలిగా వున్నది. ఈ నెల రోజులవారా మీ పేరు చెప్పుకుని, యివాళ లక్షణంగా కడుపు నింపు కొంటా." అంటూ, మాయ తువ్వాలు పరిచి ఆహారం కోరుకున్నాడు.

తన కడుపు బాగా నింపుకొని రాకాసుడు, కవల సోదరులకు కూడా వాటిల్లో కొన్ని ఫలాలు యిచ్చాడు తినమని. వాళ్ళు

కూడా కడుపులు నింపుకొన్న తర్వాత, రాక్షసుడు వాళ్ళని ముగ్గురిని ఒక త్రాటితో కట్టివేసి, ''కాసిని నీళ్ళు తాగివస్తాను. వుండండి.'' అంటూ కొలను వైపుకి వెళ్ళాడు.

మరి కొద్దిసేపటికి రాక్షసుడు ఒక మూడు ఆకు దొన్నెలతో నీళ్ళు తీసుకొని తిరిగి వచ్చి, వాటిని కవల సోదరులకు యిచ్చాడు.

ఇదంతా తమ పైన అభిమానంతోనే చేస్తున్నాడనుకున్నారు, సోదరులు. అందు చేత వాడు యిచ్చిన నీళ్ళు గడగడ త్రాగి వేశారు. నీరు గొంతు దిగేసరికల్లా, ఇంకే ముంది పాపం, ముగ్గురూ మూడు శిలా ప్రతిమలైపోయారు.

ఇలా కాగానే రాక్షసుడు, ''హా! హా!! హా!!'' అంటూ ఆ భవనం ప్రతిధ్వనించేట్టు విరగబడి నవ్వుతూ, ఈ కొత్త శిలా ప్రతిమలను తను కావలా కాస్తున్న వాకిలి ప్రక్కన వుంచాడు.

ఇక్కడ యీ విధంగా కవల సోదరులు ముగ్గురూ చిక్కుపడిపోయారా? ఇక అక్కడ దానశీల మహారాజు, రాణి పద్మముఖి ఎక్కడా లేని దిగులుతో కుమిలిపోతున్నారు.

తన ముద్దుల కూతుళ్ళు ముగ్గుర్నీ వెతుక్కు రావటానికని కవల సోదరులకు గుర్రాలిచ్చి పంపిన రోజునే, రాజు ఒక పని చేశాడు. కోట పై అంతస్తు మీద ఒక చిత్రమైన చిన్న గది కట్టించు





కున్నాడు. ఆ గదిలో కూర్చుని చూచి నట్టయితే చుట్టూ ప్రక్కల కనుచూపు మేరలో ఎక్కడ ఎటువంటి జనసంచారం వున్నా స్పష్టంగా కనిపిస్తుంది రాజుకి. ఆ గదిలో కూచుని రాజు యిరవై నాలుగు గంటలూ, కన్నులు కాయలు కాచేట్లు చూస్తూ వుండటమే ఆయన పని.

కవల సోదరులు బయల్దేరి అప్పటి కప్పుడే, అయిదేళ్ళు దాటింది. ఇంత వరకు వాళ్ళ అతీ గతీ లేదు. అందుకని రోజు రోజుకి రాజుకి వ్యాకులత హెచ్చు కాజొచ్చింది. అయినా ఆశ పీడించటం చేత మధ్య మధ్య ఆస్థానజ్యోతిష్కుని సంప్రతిస్తూనే వున్నాడు. 'అమ్మాయిలు ఎక్కడనో జీవించే వున్నారని. సుఖంగా తిరిగి రాగలరని. నిస్పృహ చెందవలసిన పని లేనేలేదని' జ్యోతిష్కుడు కచ్చితంగా చెబుతూ వుండటం చేత, రాజు ప్రాణాలు ఉగ్గబట్టుకు వుంటున్నాడు.

ఒకనాడు తెల్లవారు జామున మసక చీకటిగా వుండగా రాజు యథాప్రకారం గదిలో కూచుని చూస్తూ వున్నాడు. ఆ మసక వెలుగులో దూరాన రెండు గుర్రాలు శరవేగంతో తన భవనం వైపు రావటం కనుపించింది. ఆ గుర్రాల రంగూ, వాటిపైన మనుష్యుల ఆకారాలూ, వీటి మాటకేం. వాటికి కట్టివున్న ఆ నల్ల జెండాలూ చూచేసరికి రాజు కెవ్వున కేక పెట్టి బాకుతో పొడుచుకోబోయాడు. దైవ వశాత్తు, కేక విన్న సేవకులు రెప్పపాటులో అక్కడకు చేరుకోవటం వల్ల, ఆ ప్రమాదం కాస్తా తప్పింది. ఐతే, రాజు స్పృహ తప్పి పడిపోయాడు.

కొంతసేపటికి రాజు తెప్పరిల్లుకోవటమూ, ఆ గుర్రాలు రెండూ అక్కడకు వచ్చి చేరుకోవటమూ ఒక్కసారిగా జరిగింది.

ఆ వచ్చిన గుర్రాలు కవల సోదరులకు స్వయంగా తను యిచ్చి పంపినవే. అయినా వాటి పైన వచ్చినది కవల సోదరులు కాదు! వాళ్ళు తన సేవకులు!



వాళ్ళ వైపు రాజు ఆత్రంగా పరుగెత్తు కెళ్ళి, "అమ్మాయిలు ఏరి? ఆ కవల పిల్లలేరి? ఈ గుర్రాలు ఎక్కడివి మీకు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.


అందుకు సేవకులు, "మహారాజా! క్షమించండి. అమ్మాయిల సంగతిగానీ, కుర్రవాళ్ళ సంగతిగానీ మా కేమీ తెలియదు. ఊరూరా మేము వెతుక్కుంటూ పోగా పోగా, ఒకానొక మైదానంలో ఈ అశ్వాలు మాకు కనుపించినై. వీటిని వెంటనే పోల్చుకుని, మన అమ్మాయిలూ, ఆ కవలలూ కనబడతారేమో అని, ఆ ప్రదేశమంతా కలియ వెతికాము. ఎంతకూ వారి జాడ తెలియకపోయేసరికి, ఒకవేళ వారు యింటికి చేరుకున్నారేమో చూదాం, లేదా ఇంతవరకు వర్తమానమైనా అందించుదాం అని మేము వచ్చేశాము, ప్రభూ!" అన్నారు.

అంతా విని, "అంతటి అదృష్టమా!" అంటూ రాజు తిరిగి దుఃఖంతో పడిపోయాడు.

అంతా చేరి రాజుకు ధైర్యం చెప్పి ఊరడించగా తిరిగి మనస్థిమితం చిక్కిన తర్వాత, గుర్రాలపైన ఎక్కి వచ్చిన సేవకులిద్దరినీ ఎదటికి పిలిచి, "ఓరి వాజమ్మల్లారా! అమ్మాయిలను వెదికి వెంటబెట్టుకురాక, ఎందుకని వచ్చినట్టు మీరు? వాళ్ళను వెతకబోయిన కవల సోదరుల గతి ఏమైందో పాపం! ఆ కసుగందులు ఏమి ఆపదలలో చిక్కుకున్నారో! లేకుంటే వాళ్ళ జాడ తెలియకపోవడమేమిటి యింతవరకూ? నాకు పూర్తిగా ప్రాణం విసిగిపోయింది. క్షణం కూడా నిలవలేకపోతున్నాను. మళ్ళీ మీరు వెంటనే వచ్చే ఆశ వున్నదా? ఏమో, మీరు తిరిగి వచ్చేలోపల, నా పని ఎలా వుంటుందో. సరే పోయిరండి," అంటూ వాళ్ళను సాగనంపాడు.

ఈ సేవకులు వచ్చిన వర్తమానం ఆ నోటా, ఆ నోటా అంతఃపురంలోకి పాకిపోయి, అదమరిచి వున్న రాణికి మళ్ళీ పిచ్చి పట్టింది. —(ఇంకా వుంది)






## 11

[రాక్షసుడి భూగృహంలో తమ వద్ద వున్న భస్మాలూ, అంజనాలూ పనిచెయ్యవని కవల సోదరులు తెలుసుకున్నారు. రాక్షసుడు, వాళ్ళ మాయతువ్వాలూ అవి తీసుకుని భోజనం పెట్టి, తరవాత వాళ్ళను శిలాప్రతిమలుగా మార్చాడు. రాసోల మహారాజూ, ఆయన రాణీ తమ కవలకుమార్తెలు దొరకనందుకు విచారంలో మునిగిపోయారు. తరవాత—]

రాక్షసుడి చేతిలో కవలసోదరులు చిక్కిపోవటమూ, ఆ తర్వాత వాడి తమ్ముడు వాళ్ళను తన వెంట తీసుకుపోవటమూ, యిదంతా కొలనులో హంసల రూపంలో వున్న రాకుమార్తెలు చూస్తూనే వున్నారు. రాక్షసులిద్దరూ గమనించని విషయం కూడా వాళ్ళు చూశారు. అది ఏమిటి అంటే, ఉదయనుడు డబ్బీ తీసి తెల్ల భస్మం మీద చల్లుకోబోయేసరికల్లా, రాక్షసుడు అక్కడికి రావటం జరిగింది. ఆ తొందరపాటులో భస్మం చల్లుకోలేక పోగా, డబ్బీ కాస్తా క్రిందపడిపోయింది. దాన్ని తిరిగి తీసుకుందామంటే వీలుకాక కవలసోదరులు దాన్ని వదిలేశారు.

రాక్షసులు ఎవరి దారిన వారు వెళ్ళిపోగానే, రాకుమార్తెలు కొలనులో నుంచి బైటికి వచ్చి, ఆ డబ్బీ కోసం వెతికారు. కాని, అది కనుపించలేదు.



రాజకుమార్తెలు ఆశ్చర్యపోయారు. "ఇదేమిటి, చిత్రంగా వున్నదే! ఆ డబ్బిని మనం ముగ్గురం చూస్తూనే వుంటిమికదా? ఎలా మాయమయి వుంటుంది? ఇక్కడే ఎక్కడో వుండాలి. వెతుకుదాం రండి." అన్నది సుహాసిని.

అలాగే వాళ్లు ముగ్గురూ చుట్టుప్రక్కల వెతుకుతూపోగా, కొలనుకు చాలా దూరాన ఒక చోట డబ్బి కనుపించింది. ఇక వాళ్లు డబ్బిని ఎక్కడ దాచటమా అని ఆలోచించి, ఆలోచించి, చివరకు దానిని అందుబాటులో దాచటం మంచి దనుకుని, కొలను ఒడ్డునే ఒక చోట చిన్న గుంటతవ్వి దానిలో కప్పెట్టారు.

ఆ క్షణం మొదలుకొని కవల సోదరులను రక్షించే మార్గం ఏమిటా అని ఆలోచించసాగారు. చివరకు ఒకనాడు సుకేశిని, "నాకు ఒక ఉపాయం తోచింది, చెప్పనా?" అన్నది.

ఇది విని సుభాషిణి, సుహాసిని, "ఏమిటా ఉపాయం?" అని ఉత్సాహంతో అడిగారు.

అప్పుడు సుకేశిని, "ఎలాగైనా రాక్షసుణ్ణి అక్కడ నుంచి కదిపి యివతలకు తీసుకురావాలి. అది ఒకలా చెయ్యవచ్చు. మనమందరమూ కలిసి వాడి దగ్గిరికి పోయి, నృత్యం చేసి చూపుతాం అని నమ్మించుదాం. అలా మనలో వెళ్ళదలిచిన ఎవరో ఒకరు కొంత మంత్రజలాన్ని తీసుకువెళ్ళి, ఆ కుర్రవాళ్ల శిలాప్రతిమల మీద చల్లి, వాళ్ళకి మామూలు స్వరూపాలు తెప్పించాలి. రాక్షసుడి కంట పడకుండా ఒకళ్ళం అక్కడే వుండిపోయి, ఈ పని చెయ్యవచ్చు. తర్వాత ఏమి చెయ్యటమా అనేది కుర్రవాళ్ళనే సంప్రతించవచ్చు." అన్నది.

ఇది విని సుహాసిని, "వాడేం సామాన్యుడా మన టోపీలో పడటానికి. ఒకవేళ మనం వాణ్ణి టోపీ వేసి, అక్కణ్ణుంచి యివతలకు తీసుకురాగలిగినా వాడి భవనంలో వుంది. వాడి



కన్ను కప్పి యింత చెయ్యటం మాటలా? మనం కూడా చిక్కిపోయామా అంటే మన సంగతీ ఆ కుర్రవాళ్ల సంగతీ, మన వాళ్ళకు తెలిసే అవకాశం కూడా పోతుందే. ఈ ఉపాయమేమో బాగానే వుంది. కాని ఆచరణమటుకు అసాధ్య మనిపిస్తుంది." అన్నది.

అందుకు సుకేశిని, "సరేలే, ధైర్యం లేకపోతే ఎవరూ ఏ పని చెయ్యలేరు. అపాయంలో చిక్కుకుంటామని చెప్పి, ఆ కుర్రవాళ్ళను రక్షించకుండా వుండ గలమా?" అన్నది. సుహాసిని, సుభాషిణి కానీనన్నారు.

మర్నాడు కొలనులో వున్న హంస లన్నీ ఒడ్డుకు వచ్చినై. రావటంతోటే వాటికి మనుష్యాకారాలు వచ్చినై. కవల రాజకుమార్తెల మాదిరిగానే వాళ్ళంతా, రాక్షసుడి చేతిలో చిక్కిపోయినవాళ్ళే. వాళ్ళల్లో ఆడపిల్లలు, మగపిల్లలూ వున్నారు.

మగపిల్లలందరినీ కొలనులోకి తిరిగి వెళ్ళిపొమ్మన్నది సుహాసిని. అలాగే వాళ్ళు వెళ్ళిపోయారు. తక్కిన వాళ్లంతా ఆడపిల్లలే. వాళ్ళంతా చేరి ఆ తోటలో పువ్వులు కోసుకుని పాడుకుంటూ, ఉత్సాహంగా గెంతుతూ రాక్షసుడి భవనం వైపుకు రాసాగారు.

ఈ సందడి చెవిని పడేసరికి రాక్షసుడే వాళ్ళకు ఎదురు వచ్చి, "ఇదేమిటి? ఇలా బయలుదేరారెక్కడికి? నా మీద దాడి చేద్దామనా?" అన్నాడు నవ్వుతూ.

అందరిలోకి ముందున వున్న సుకేశిని, "నీ అంత వాడిపైన దాడి చెయ్యటం ఎవరి తరం? కొత్తగా చిక్కిన ముగ్గురు కుర్రవాళ్ళూ ఏమైపోయారో చూతామని వచ్చాం." అన్నది.

అందుకు రాక్షసుడు పగలబడి నవ్వుతూ, "ఏమవుతారు? అంతకు ముందు వచ్చిన వాళ్ళు ఏమయ్యారో, వీళ్ళూ అంతే. ఏం, చూస్తారా?" అంటూ భవనంలోకి వెంటబెట్టుకు వెళ్ళి కవల



సోదరుల శిలాప్రతిమలు వరసన ఒక్కొక్కటిగా చూపాడు. వాటిని చూస్తూ సుకేశిని, "బాగానే వున్నది, నీ ఉద్యోగం! కాని, నా సందేహం ఒకటి తీర్చు. ఇంత మందిమి కలిసి మెలిసి వుంటున్నాం. ఈ నిర్బంధంతో ప్రాణం విసిగిపోయింది. మీ అన్న చేయదలుచుకున్న బలి త్వరగా అయిపోతే బాగుండుననే అనిపిస్తున్నది. మాకు. అటువంటిది నువ్వు ఒక్కడివే, ఈ శిలాప్రతిమల మధ్య విసుగూ, విరామం లేకుండా ఏళ్ళ తరబడి ఎలా కాపలా కాస్తున్నావయ్యా? ఎప్పుడైనా అలా స్వేచ్ఛగా ఎక్కడికన్నా పోవాలని వుండదా?" అని నిబ్బరంగా అడిగింది.

అందుకు రాక్షసుడు. "నాకు మాత్రం విసుగెత్తటం లేదనుకున్నారా? కాని, ఏం చేయటం? ఈ చోటు విడిచి వెళ్లానే, మిమ్మల్ని బలియివ్వటానికి ముందు, నన్నే హతమారుస్తాడు మా అన్న. ఏమీ తోచక నేనూ సతమతమవుతూనే వున్నాను." అని మనసులో బాధ వెలిబుచ్చాడు.

వెంటనే సుకేశిని అందుకుని, "ఎంత సేపనియిలా? పోనీ కాస్సేపు మాతోపాటు వచ్చి కులాసాగా వుండకూడదా? నీకు ఆనందం కలిగేటట్టు ఆటలాడతాం, పాటలు పాడతాం. మాకూ కొంత ఊసు పోతుంది. రా, చూడుగాని తమాషా." అని రాక్షసుణ్ణి ఉత్సాహపరిచింది.

"అమ్మయ్యో, ఈ భవనం విడిచి వచ్చేయటమే! ఏనుగంత వాణ్ణి నేను కాపలా కాస్తుండగానే, నా కళ్ళల్లో దుమ్ము కొట్టి, ఈ కుర్రవాళ్లు ఎలాగో ప్రవేశించారే. భవనం వదిలితే మరేమైనా వుందా." అన్నాడు రాక్షసుడు.

"ఆఁ, నీ భ్రమగాని యిక్కడికి ఎవరు రాగలుగుతారు? వచ్చారే అనుకో, నీ చేతిలో చిక్కక ఎక్కడికి పోగలరు? పోనీ, మాలో ఒకరు నీ బదులు కాపలా కాస్తూ వుంటారు. కాస్సేపు కులాసాగా కాలక్షేపం చేసి, తిరిగి నీ ఉద్యోగానికి

నువ్వుపోదువు గాని," అన్నది సుకేశిని. ఈ మాట రాక్షసుడికి నచ్చింది.

"మరైతే నా బిడదులు కావలా కాసేది ఎవరు ?" అని అడిగాడు వాడు.

సుకేశిని, సుహాసిని వైపు అట్టె చూసి, "మరెవరేనా ? మా అక్క వున్నది." అన్నది. ఆ ప్రకారమే సుహాసినిని భవనంలో వదిలి, వాళ్ళు కొలను వైపుకు బయలుదేరారు.

కొలను ఒడ్డున వాళ్ళు, రాక్షసుణ్ణి మధ్య కూర్చోపెట్టి, చుట్టూ చేరి నృత్యం చెయ్యసాగారు. వాళ్ళ ఆట పాటలకు రాక్షసుడు తన్మయుడై, "రోజూ ఇలా ఆట పాటలతో కాలక్షేపం చేస్తే బాగుంటుందే!" అన్నాడు.

రోజూ ఎవరో ఒకరు రాక్షసుడి బిడదులు కావలా కాస్తుండటమూ, వాడు ఆట పాటలకు ఆనందించటమూ అలవాటైంది.

నాలుగు రోజులు గడిచేసరికి, అంతకు మునుపు భవనం విడిచి రావటానికి భయపడే రాక్షసుడు, ఇప్పుడు తనంతట తనే వచ్చి, రాకుమార్తెలను రమ్మనటం మొదలుపెట్టాడు. ఇది చూసి సుకేశిని తన పాచిక పారింది కదా అని సంతోషించింది.

అంతవరకూ బాగానే వుంది. పోతే, కవలల శిలా ప్రతిమలను మంత్ర జలంతో మామూలు మనుష్యులుగా మార్చివేయాలి. జలం తీసుకు రావాలంటే, ఏదైనా ఉపకరణం వుండాలి.





పోనీ పాత్ర ఎక్కడైనా సంపాదించి తెచ్చి, దానితో జలం తీసుకు వద్దామా అంటే, ఉన్న పాటున రాక్షసుడికి పట్టుబడిపోతారేమో! మరేమిటి గత్యంతరం? మళ్ళీ ఆలోచన పడింది. ఐతే—సుకేశిని వంటి తెలివిమంతురాలికి ఇదొక ఘనకార్యమా?

మర్నాడు రాక్షసుణ్ణి పిలుచుకు రావటానికి వెళ్ళేముందు, సుకేశిని తోటలోకి పోయి మంత్రజలంతో తన చీర చెంగు ఒకటి బాగా తడుపుకొన్నది. రెండో చివర కొలను నీటితో తడుపుకొన్నది.

ఇలా తయారైన సుకేశిని రాక్షసుడి దగ్గరకు వెళ్ళి, "ఇవాళ కాపలా కాయటం నా వంతు. నేను లేకుండా మా వాళ్ళు ఆట పాటలు నీకు ఎలా వచ్చినయ్యో వచ్చి నాకు చెప్పాలి సుమా!" అన్నది.

"అలాగే చెపుతాను!" అంటూ రాక్షసుడు క్షణమైనా అక్కడ నిలవకుండా కొలనుకి బయలుదేరాడు. వాడు వస్తుండటం చూసి కొలనులోని రాతిమూర్తులు వెంటనే ఆట పాటలలో మునిగిపోయారు.

రాక్షసుడు భవనం విడిచి వెళ్ళిన మరుక్షణమే సుకేశిని, కవలసోదరుల శిలాప్రతిమల పైన చీరచెంగుతో తెచ్చిన నీటిని పిండింది. వెంటనే వాళ్ళకు మామూలు స్వరూపాలు వచ్చేసినై. వాళ్లు అమితాశ్చర్యంతో, "ఇదేమిటి? ఇక్కడికి ఎలా వచ్చావు? ఆ రాక్షసుడేమయ్యాడు?" అని అడిగారు.

అప్పుడు సుకేశిని తాను పన్నిన పన్నాగం విప్పి చెప్పి, "వాడు ఆట పాటలలో పరవశుడైవున్న సమయం కనిపెట్టి, పొంచి వుండి హతమార్చేయాలి. ఆలోచించండి ఉపాయం." అని కవల సోదరులను వేగిరపెట్టింది.

"ఎలా సాధ్యం? భస్మం కూడా పోగొట్టుకున్నామే," అన్నాడు ఉదయనుడు.

భస్మం సంగతి సుకేశిని మరిచే పోయింది. ఉదయనుడు ఆ సంగతి

గుర్తు తేగానే.'' అన్నట్టు అవును. ఒకలా చేద్దాం. ఇవ్వాళ్టికి మిమ్మల్ని శిలాప్రతిమలుగా చేసిపోతాను. రేపు వచ్చేటప్పుడు భస్మం కూడా తెస్తాను.'' అన్నది.

అందుకు కపిలసోదరులు చాలా సంతోషించారు. వెంటనే సుకేశిని కొలను నీటితో తడిపిన చీర చెంగు పిండి. వాళ్ల నోళ్ళల్లో పోసింది. యథాప్రకారం శిలా ప్రతిమలుగా మారిపోయారు.



ఇంతలో రాక్షసుడు అక్కడికి వచ్చేసి, '' ఎలాగైనా నువ్వు వుంటేనే నయం! ఇవాళ అంతా చప్ప చప్పగా వుంది.'' అన్నాడు సుకేశినితో.

'' నిజంగానా? ఎగతాళి చేస్తున్నావ్! ఐతే రేపు నేను సభలో వుంటాలే. మా అక్కనే యిక్కడికి కావలా పంపుదాం.'' అంటూ తిరిగి కొలను వద్దకు వచ్చి చేరుకున్నది.

తర్వాత రాకుమార్తెలు ముగ్గురూ కలిసి, భస్మాన్ని తీసుకురావటానికి వెళ్లి, గుంట తవ్వి చూడగా దబ్బీ కనబడక పోయె! ఏమి చెయ్యటానికి వాళ్ళకి పాలుపోయింది కాదు. అప్పుడు సుకేశిని, '' విచారిస్తూ కూర్చుంటే ప్రయోజనం ఏమున్నది? ఇవాళ భవనం కావలాకు నువ్వు వెళ్ళు. ఇలా యిలా జరిగిందని కుర్రవాళ్ళకు తెలియజెప్పు. ఆ పైన వాళ్ళు చెప్పినట్టు చేద్దాం.'' అని సుభాషిణిని పంపింది.

సుభాషిణి కూడా మంత్రజలంతోనూ, కొలను జలంతోనూ చీర చెంగు తడుపు కొని భవనానికి వెళ్లి, రాక్షసుణ్ణి విడుదల చేసి పంపింది. వాడు వెళ్ళిపోగానే సుభాషిణి చీర చెంగు నుండి నీటి బొట్లు శిలాప్రతిమలపైన వేసింది. కాని పాపం, ఆ తొందరలో సుభాషిణి మంత్రజలంతో తడిపిన చెంగు పిండడానికి బదులు, కొలను నీటితో తడిసిన చెంగు పిండింది. అందుచేత శిలాప్రతిమలకు మామూలు స్వరూపాలు రాలేదు. '' అరెరె! ఎంత పొరపాటు జరిగింది!'' అనుకుంటూ

సుభాషిణి. ఈసారి మంత్రజలాన్ని పంచింది. వెంటనే సోదరులు అసలు రూపాలతో లేచారు.

అప్పుడు సుభాషిణి, భస్మం మాయం కావటం చెప్పి, జలంపాడటంలో తను చేసిన ప్రమాదం కూడా వెల్లడించింది.

అందుకు ఉదయుడు, "ఇదంతా చూడగా, మనం తలపెట్టిన పని ఏదీ జయప్రదం కాదని తోస్తున్నది. లేకపోతే అడుగడుగునా ఈ అవాంతరాలేమిటి?" అన్నాడు నిస్పృహతో.

మధ్యలో నిశిధుడు అడ్డుపడి. "జయప్రదం కాకపోవటమేమిటి? దేవుడు మనల్ని పరీక్షిస్తున్నాడు. అంతే. ఇంత మాత్రానికే జడిసిపోవటమా?" అన్నాడు.

"సరే. రాక్షసుడు తిరిగి భవనం చేరుకొనేసరికల్లా మనం తప్పించుకుని పోవాలి. లేదా ...." అని ఏమో చెప్పబోయాడు ఉదయుడు.

సుభాషిణి అతడి మాటలకు అడ్డు తగిలి, "నాకు ఒక ఉపాయం తోస్తున్నది. ఇక్కడవుండే ఆ ప్రతిమలలో మూడింటిని తెచ్చి, మీ స్థానాల్లో వుంచుదాం. వాడు ఏనుగంత మనిషే గాని, బుర్ర మాత్రం పక్షి మట్టి బుర్ర. కాబట్టి ప్రతిమలు మార్చిన సంగతి వాడు చచ్చినా కని పెట్టలేడు. మీరు బైట, ఆ పొదచాటున దాక్కొండి. వాడు భవనం లోపలికి పోగానే మీరు, నా దగ్గరికి వచ్చేయండి. చూదాం తర్వాత సంగతి." అన్నది.

సుభాషిణి చెప్పిన యీ ఉపాయం బాగుందంటె బాగుందన్నారు. కవల సోదరులు. ఇంకా ఆలస్యం ఎందుకని, ఆ వెంటనే నలుగురూ చేరి మూడు శిలా ప్రతిమల్ని తెచ్చి, తమ స్థానంలో వుంచి, బయటకు వచ్చి ఒక పొదచాటున నక్కి కూర్చున్నారు.

కొంచెం సేపటికల్లా రాక్షసుడు తిరిగి వచ్చి, సుభాషిణిని విడుదల చేశాడు. వెంటనే సుభాషిణి, కవల సోదరులున్న చోటుకు వెళ్ళి, వాళ్ళతో సహా కొలను చేరుకున్నది. —(ఇంకా వుంది)





# రాకాసి లోయ


## 12

[కావలా రాక్షసుడు సుకేశిని మాటలునమ్మి, కొలను ఒడ్డున జరిగే ఆటపాటలను చూసి వినోదించేందుకు, రోజూ అక్కడికి పోసాగాడు. ఆ సమయంలో సుభాషిణి, శిలాప్రతిమలుగా మారిన కవలసోదరుల పైన మంత్రజలం చల్లి, వాళ్ళకు తిరిగి మామూలు రూపాలు వచ్చేలా చేసింది. అందరూ కలిసి కొలను చేరుకున్నారు. తరవాత—]

రాక్షసుడిని మోసం చేసి కవలసోదరులు ఎలాగో బైటపడ్డారే గాని, వాళ్ళకు మన స్థిమితం లేకుండా పోయింది. ఎందుచేత నంటే, ఆదివరకు మోస్తరుగా రాక్షసుడి కంట పడకుండా తమను అదృశ్యం చేసుకోగల భస్మం కాస్తా పోయిందాయె! పోనీ రాకుమార్తెలతో పాటు హంసల రూపంలో ఉందామా అంటే, హంసల లెక్క రాక్షసుడికి తెలియనే తెలుసు. కనుక అది ప్రయోజనం లేదు. వాళ్ళకు ఏమిచెయ్యటానికీ పాలుపోలేదు.

ఇలాంటి చిక్కులోపడి కవలసోదరులు క్షణమొక యుగంగా గడపవలసి వచ్చింది.

ఒకరోజున సుభాషిణి, కవలసోదరులతో, ''ఇక మీదట మీరు ఇక్కడ వుండటం క్షేమం కాదు. మనం చేసిన మోసానికి రాక్షసుడు కసి పూని వుంటాడు.



ఈ సారి వాడి చేతిలో చిక్కితే మటుకు ప్రాణాలతో వదలడు. కనుక రేపు వాడు ఆటపాటలకు వచ్చిన సమయం చూచి, మీరు యీ స్థలం వదిలి వెళ్ళిపొండి. మమ్మల్ని రక్షించే సమస్య ఇంక వదులుకొండి." అన్నది.

అది విని ఉదయనుడు, "అలా ఎన్నటూ జరగదు. మా ప్రాణాలు వున్నంత వరకూ మిమ్మల్ని రక్షించేందుకే ప్రయత్నిస్తాం." అన్నాడు.

"అలా అయితే, ఒక్కటే మార్గం. రేపు వాడు యిక్కడికి వచ్చినప్పుడు, మాతో పాటు కొలనులో వుండే తక్కిన రాకుమారులు కూడా కలిసి ఆటపాటలలో పాల్గొనేటట్టు ఏర్పాటు చేస్తాను. ఆ రాకుమారులలో మీరూ చేరిపొండి. సమయం కనిపెట్టి రాక్షసుడి తల తెగవేయండి." అన్నది సుభాషిణి.

సోదరులు యిందుకు ఒప్పుకున్నారు. మర్నాడు రాక్షసుడు, రాజకుమార్తెల దగ్గిరికి వచ్చినప్పుడు సుభాషిణి, "మగవాడవైన నీవు ఒక్కడివే యింత మంది ఆడవాళ్ళ మధ్య వుండటం బాగుండదు. కొలనులో యింకా రాకుమార్లు వున్నారు కదా? వాళ్ళని కూడా మనతో చేర్చుకొందాం. సందడిగా వుంటుంది. లోకానికి విరుద్ధమనిపించదు." అని సలహా యిచ్చింది.

"ఈ పాటి దానికి నన్ను అడగాలా? అలాగే కానివ్వండి." అన్నాడు రాక్షసుడు.

వెంటనే కొలనులో వున్న హంసలన్నీ ఒడ్డుకి వచ్చి, మానవాకారాలు దాల్చినై. వాటిలో కపిలసోదరులు కూడా వున్నారు. అయితే ఆట పాటల దృష్టిలో వున్న రాక్షసుడు వాళ్ళని గమనించనే లేదు.

రాకుమార్తెలు కనువిందుగా నృత్యం చేస్తున్నారు. రాక్షసుడు ఆనందంలో మునిగి తేలుతున్న సమయం చూశాడు, ఉదయనుడు. సర్రున కత్తి దూసి ఒక్క వేటున వాని తల తెగ నరికాడు. వెంటనే రాక్షసుని మొండెం నేలకు

విరిగిపోయింది. తెగిపోయిన తల వెళ్ళి కొలను నీటిలో పడింది.

అదే సమయాన మరొక చిత్రం జరిగింది. రాక్షసుడు ఎప్పుడైతే చచ్చిపోయాడో, ఆ క్షణమే వాడు కాపలా కాస్తున్న భవనం మాయమై పోయింది. కమలసోదరుల లాగానే వచ్చి రాక్షసుడి చేతిలో చిక్కిపోయిన రాకుమారుల శిలా ప్రతిమలు మాత్రం యింకా అక్కడ మిగిలివున్నై.

అప్పుడు సుహాసిని, "ఇంకా చూస్తారేం! మంత్రజలం తెచ్చి ఆ శిలా ప్రతిమలకు మామూలు స్వరూపాలు తెప్పించండి," అన్నది. అలా చేయగా, ప్రతిమలన్నీ రాకుమారులుగా మారినై.

వారంతా కమలసోదరులనూ, రాకుమార్తెలనూ ఎంతగానో మెచ్చుకున్నారు. తలవని తలంపుగా తమకు యిలా తిరిగి మామూలు స్వరూపాలు వచ్చినందుకు, వారు ఎంతో ఉప్పొంగిపోయారు. అయితే, యింత ఆనందంలోనూ అందరికీ కూడా ఒకే విధమైన చింత పట్టుకున్నది—తిరిగి తమ తమ ఇళ్ళకు చేరుకోవటం మాట అలా వుంచి, ఆ ప్రదేశంలో రెండవ రాక్షసుడి కంట పడకుండా మెలగటం ఎలాగ? అని.

దీనిని గురించే వాళ్ళంతా సమావేశమై తీవ్రంగా ఆలోచించారు. కాని ఎవరికీ ఉపాయమేదీ తోచలేదు. చివరకు ఉదయనుడు, "మీరందరూ యిక్కడే వుండి





పోవటం క్షేమం కాదు. రాక్షసుడి చేతిలో చిక్కిన ఈ రాజకుమార్తెల నందరినీ క్షేమంగా వారి వారి ఇళ్ళకు చేర్చే బాధ్యత మాది. కనుక మీరు నిశ్చింతగా వెళ్ళి పోవచ్చు.'' అన్నాడు.

కాని ఇందుకు ఎవరూ ఒప్పుకో లేదు. వారిలో ఒక వృద్ధుడు, ''అబ్బాయీ, మేము తిరిగి ఇళ్ళకు చేరుకోవటం మాత్రం మాటలా? గడ్డపు వాడిని తప్పించుకు పోవటం అసాధ్యం. కనుక మనం చెయ్య గలిగిన దల్లా ఒక్కటే. మమ్మల్ని తిరిగి శిలా ప్రతిమలుగా మార్చివేసెయ్,'' అన్నాడు. ఇందుకు కపిల సోదరులు ఒప్పుకొనక తప్పిందికాదు. వాళ్ళ కోరిక ప్రకారం అందరినీ మళ్ళీ శిలాప్రతి మలుగా చేసివేశారు.

ఇక తమ సంగతి ఏమిటా అని ఆలోచిస్తున్నంతలో రెండవ రాక్షసుడు వచ్చేశాడు. ఈ సారి వాడు వట్టి చేతులతో రాలేదు. ఒక రాకుమార్తెను వెంట తీసుకు వచ్చాడు. వాడు దగ్గరకు వస్తున్న అలికిడి అయింది. ఇంక ఆ తొందరలో కపిలసోదరులు, గభీమంటూ కొలనులో దూకి, హంసలుగా మారిపోయారు.

మరుక్షణమే రాక్షసుడు కొలను చేరు కున్నాడు. తను తెచ్చిన ఆ రాకుమార్తెను కూడా కొలనులోకి విసిరివేశాడు. ఆమె కూడా హంసగా మారిపోయింది.

ఇలా రాకుమార్తెను కొలనులో విసిరి వేసిన వెంటనే రాక్షసుడు మళ్ళీ ఒకసారి ఆ హంసలను లెక్కపెట్టసాగాడు. ఇంత కాలమూ కొలనులో వున్నది నలభై ఏడుగురేననీ. తన వ్రతం పూర్తి కావ టానికి మరి ముగ్గురు తక్కువైనారనీ అనుకుంటూ వున్నాడు. ఆ రోజు తను తెచ్చిన రాకుమార్తెతో నలభై ఎనిమిది మంది కదా కావాలి? కాని లెక్కపెట్టగా యాభై ఒక్కమంది వుండటం చూసి, వాడు సంతోషంతో ఎగిరి గంతువేశాడు. మరుక్షణమే వాడికొక సందేహం కలిగింది. హంసలన్నిటినీ ఒడ్డుకు రప్పిం



చాడు. అవి సెథిలోంచి బైటికి రాగానే రాక్షసుడు. ''మీలో కొత్తగా వచ్చిన ముగ్గురూ ఎవరు?'' అని గద్దించి అడిగాడు.

కవలసోదరులు ముగ్గురూ ముందుకు వచ్చి, ''మేమేను. అమాయకులైన ఈ రాకుమార్తెలను ఎందుకిలా బంధించి వుంచుతావు? ఇప్పటికైనా మించిపోలేదు. వీళ్ళని వదిలిపెట్టు. లేదా నీ తమ్ముడి గతి ఏమైందో నీకూ అదే కాబోతుంది.'' అని బెదిరించారు.

''ఆ, ఏమిటీ? నా తమ్ముడి గతా! ఏమైనాడువాడు?'' అని రాక్షసుడు పెద్దగా బొబ్బలు పెట్టాడు.

''ఏమిటవుతాడు, మట్టిలో కలిసి పోయాడు. వాడితోపాటు నీ మాయాభవన మున్నూ...'' అని కవలసోదరులు అంటూ వుండగానే రాక్షసుడు అక్కడ నిలవక ఒక్క పరుగున తన తమ్ముడు కావలా కాస్తున్న భవనం వైపుకి పరుగెత్తాడు. చూస్తే ఏముంది? శిలాప్రతిమలు తప్ప మరేమీ కానరాలేదు.

కళ్ళవెంట చింత నిప్పులు రాలుస్తూ రాక్షసుడు తిరిగి వచ్చాడు. ఈలోగానే కవలసోదరులు తోటలోకి వెళ్ళి మామిడి కాయలు కోసి తిని కోతులుగా మారి పోయారు. రాక్షసుడికి అందకుండా ఆ కోతులు ఒక చెట్టు మీది నుంచి, మరొక చెట్టు మీదికి దూకసాగినై.

చివరకు ప్రాణం విసిగి రాక్షసుడు, ''కానివ్వండి. ఇలా ఎంతకాలం తప్పించుకు తిరుగుతారో నేనూ చూస్తాను.'' అంటూ మళ్ళీ గద్దరూపంలో రివ్వున ఆకాశమార్గాన ఎగిరిపోయాడు.

మరికొద్ది సేపటికల్లా కోతులరూపంతో కవలసోదరులు తిరుగుతున్న చోటుకు గడ్డపువాడు వచ్చి ప్రత్యక్షమయాడు.

కోతులను చూస్తూనే వాడు, ''మంచి శాస్తి జరిగింది. లేకపోతే అంత కొవ్వా? ఇంకానయం, మిమ్మల్ని ప్రాణాలతో వదిలాడు,'' అన్నాడు.



ఇలా అంటూ వున్నంతలో ఒక కోతి వచ్చి, అమాంతం వాడి నెత్తి మీద దూకింది. గడ్డపువాడు తల పైకి ఎత్తి చూచేటంతలో, మరొక కోతి, వాడి గడ్డం లంకించుకుని బర బర యీడ్చుకు పోసాగింది. మూడో కోతి, వాడి కాళ్ళు పట్టుకు వేళ్ళాడసాగింది. గడ్డపువాడు లబో దిబోమని మొత్తుకున్నాడు. కోతులు వాడిని వదలలేదు. గడ్డం లంకించుకున్న కోతి, వాడిని ఒక చెట్టు పైకి లాక్కుపోయి, గడ్డాన్ని ఆ చెట్టుకొమ్మకు వేలాడగట్టి, గట్టిగా ముడివేసింది. ఆ వెంటనే, చెట్టు కింద మొలిచివున్న కుక్కగొడుగులు తినేసరికి కవలసోదరులకు కోతి రూపాలుపోయి మామూలు స్వరూపాలు వచ్చినై.

వాళ్ళను చూసి గడ్డపువాడు, "ఇక్కడి చెట్లూ చేమలూ, వాటి మర్మాలూ మీకు బాగా తెలిసినట్టున్నదే? ఎరక్కపోయి మీ దగ్గరికి వచ్చాను. ఇంతటితోనైనా నన్ను విడిచిపెట్టండి, బాబూ!" అంటూ మొరపెట్టుకున్నాడు.

"ఈసారి నిన్ను అంతంత మాత్రానికి వదిలేదిలేదయ్యా! ఇకమీదినుంచి నువ్వు, రాక్షసుడి సేవకుడివి కావు, మా సేవకుడివి. కనక మేము చెప్పినట్టల్లా చెయ్యాలి. నీ మాయదండ ముందు మా కిప్పుడు ఇచ్చివెయ్యి. రాక్షసుడిని గురించిన రహస్యాలు పూర్తిగా వెల్లడించు. ఇందుకు ఒప్పుకుంటే నిన్ను విడుదల చేస్తాం; లేదా యిలాగా వేళ్ళాడుతూ వుండవలసిందే!" అన్నాడు ఉదయనుడు.

అందుకు గడ్డపువాడు, "చాలా పెద్ద షరతులే పెట్టారే. మీ సేవకుడిగా వుండటానికి నాకేమీ అభ్యంతరం లేదు. మాయదండ కూడా మీ వశంచేస్తా. కాని, రాక్షసుడిని గురించిన రహస్యాలు మాత్రం అడగకండి. అవి వెల్లడించినట్టయితే, నేను తల పగిలి చస్తానని యిదివరకే నేను చెప్పానుగా. ఆ రహస్యం మీకు చెప్పి నేను చనిపోవటమా, లేక మీ సేవ

కుడుగానే వుంది. కాయకష్టులా మీకు సహాయం చేస్తూ వుండటమా? అని ప్రశ్న. ఐనా పట్టుదలతో ప్రయత్నిస్తే రాక్షసుడి రహస్యం తెలుసుకోలేక పోరు మీరు." అని మెడలోవున్న దండ తీసి ఇచ్చాడు.

దండను అందుకుని ఉదయనుడు తన మెడలో వేసుకున్నాడు. గర్దవువాడికి మానవ స్వరూపం వచ్చింది; ఉదయనుడికి గర్దవువాడి స్వరూపం వచ్చింది. దానితో పాటు ఉదయనుడికి అంజనాలూ, భస్మాలూ, తువ్వాలూ కూడా లభించినై.

వెంటనే ఉదయనుడు కొలను వద్దకు వెళ్ళి, అందులో హంసలుగా వున్న రాకుమార్తెలనూ వాళ్ళనూ బైటికి రమ్మన్నాడు. వాళ్ళు బైటికి వచ్చాక, అంతా బారులు తీర్చి కూచున్నారు. మాయ తువ్వాలు మహిమ వల్ల, అందరకూ బ్రహ్మాండమైన విందు చేశాడు. తరవాత శిలాప్రతిమలుగా మారి వున్న వాళ్ళకు మామూలు స్వరూపాలు తెప్పించి, వాళ్ళకు కూడా విందు చేశాడు.

విందు అయాక ఉదయనుడు, గర్దవు వాడితో, "పిళ్ళనందర్నీ తీసుకు వెళ్ళి, వాళ్ళ వాళ్ళ ఇళ్ళ దగ్గిర వదిలిరా." అన్నాడు.

అందుకు గర్దవువాడు, "ఇది చాలా కష్టమైన పని. రాక్షసుడి కంట బడ్డామంటే ప్రాణాలు దక్కవు. కనుక మం



కొంత కాలం శిలాప్రతిమలనూ, హంసలనూ ఇక్కడనే వుండనివ్వండి. సమయం చూసి వాళ్ళను ఇళ్ళకు చేరుస్తా," అన్నాడు.

ఇందుకు కవలసోదరులు ఒప్పుకోగా, వాళ్ళను మళ్ళీ శిలాప్రతిమలుగానూ, హంసలుగానూ మార్చి, ఎవళ్ళ చోటుల్లో వాళ్ళను వుంచాడు.

ఇంతలో రాక్షసుడు వచ్చేశాడు. వాడు వస్తున్న సంగతి గ్రహించి గడ్డపువాడి ఆకారంలో వున్న ఉదయనుడు తన దగ్గిర వున్న భస్మం తీసి, తన సోదరుల పైనా, గడ్డపు వాడి పైనా చల్లాడు. రాక్షసుడు సరిగా అక్కడికి వచ్చి చేరుకునే సరికి, గడ్డపువాడి వేషంలో ఉదయనుడు మాత్రం నిలిచి వున్నాడు. వాడు తన సేవకుడైన గడ్డపువాడే ననుకుని రాక్షసుడు, "ఆ కోతి మూక ఏమైంది?" అని కోపంగా అడిగాడు.

"ఏమవుతారు? ముగ్గుర్నీ పీక నులిమి చంపేశాను," అన్నాడు ఉదయనుడు.

"ఏరీ, ఎక్కడ వాళ్ళు?" అని ఆత్రంతో ప్రశ్నించాడు రాక్షసుడు.

"చూపుతాను, రా!" అంటూ రాక్షసుడిని ఒక పాడు బావి దగ్గిరికి వెంట బెట్టుకు వెళ్ళి, తొంగి చూడమన్నాడు ఉదయనుడు.

ఆత్రం కొద్దీ రాక్షసుడు బావిలోకి తొంగి చూడబోయాడు. అంతకు ముందుగానే ఉదయనుడు, ఆ బావి ఒడ్డున తన కత్తి దాచి వుంచాడు. ఎప్పుడైతే రాక్షసుడు తొంగి చూడబోయాడో, సర్రున కత్తి దూసి ఒక్క వేటు వేశాడు ఉదయనుడు. రాక్షసుడి తల తెగి బావిలో పడింది గాని, చిత్రమేమిటో, రాక్షసుడికి మరొక తల మొలుచుకు వచ్చింది.

రాక్షసుడు గిరుక్కున తిరిగి, గడ్డపు వాడి వేషంలో వున్న ఉదయనుడిని గుప్పిటిలో పట్టి, "ఎంత ద్రోహం! నా ఉప్పు తింటూ, నాకే ముప్పు తల పెట్టావా?" అంటూ అతణ్ణి బావిలోకి విసిరివేశాడు. —(ఇంకా వుంది.)






## 13

[ఉదయనుడూ, ఆతని యిద్దరు కవలసోదరులూ కాపలా రాక్షసుణ్ణి చంపివేసిన తరవాత, వాడి అన్న వచ్చి, కవలసోదరులను పట్టుకోబోయాడు. వాళ్ళు కోతులుగా మారి తప్పించుకున్నారు. ఆసమయంలో అక్కడికొచ్చిన గద్దపువాడు వాళ్ళకు లొంగిపోయాడు. అన్న రాక్షసుణ్ణి చంపబోయిన ఉదయనుడు వాడికి చిక్కి, వాడిచేత బావిలోకి తోయబడ్డాడు. తరవాత—]

రాక్షసుడు, ఉదయనుణ్ణి బావిలో పడవేసి తన దారిన తాను వెళ్ళిపోయాడు. గద్దపువాడి రూపంలో వున్న ఉదయనుడు, బావిలో వారం రోజులపాటు వుండిపోయాడు. అతడికి బైటపడేమార్గం కనిపించలేదు. ఇక అక్కడ భస్మంవల్ల అదృశ్యం చేయబడిన సంధ్యా నిశీథులు గద్దపువాడితో సహా, అలా అదృశ్య రూపంలోనే వుండిపోవలసి వచ్చింది. ఎందుచేతనంటే వాళ్ళకు తిరిగి మామూలు స్వరూపాలు తెప్పించగల భస్మం ఉదయనుడి దగ్గరే వున్నది.

వీళ్ళస్థితి యిలా వుండగా, ఈ వారం రోజులూ రాకుమార్తెలూ పూరుకోలేదు. కొంచమైనా విడవకుండా కనిపెడ్తూవుంటే, కవలసోదరులు కనిపించకుండా పోయేసరికి, వాళ్ళు మళ్ళీ ఏదో ఆపదలో చిక్కుకుని వుంటారని, వాళ్ళు వెంటనే గ్రహిం



దారు. వాళ్ళు, కవలసోదరుల కోసం చుట్టుపక్కల అంతా గాలించసాగారు.

ఇలా వెతుకుతున్న రాకుమార్తెలు, ఉదయనుడు పడివున్న బావి దగ్గిరకు కూడా రావటం తటస్థించింది. అయితే, ఉదయనుడు గద్దపువాడి ఆకారంలో వుండటం చేత ఆ పొట్టిమనిషి వాళ్ళ కంటబడలేదు. వాళ్ళు బావి దగ్గిరకు వచ్చిన అలికిడి వినిపించి, ఉదయనుడు కేకవేశాడు. కాని, ఆకారానికి తగ్గట్టు కేకకూడా చిన్నది కావటం చేత, ఆ కేక రాకుమార్తెలకు వినిపించలేదు.

తను కేకపెట్టి కూడా రాకుమార్తెలకు తన స్థితి తెలియచేయలేక పోయినందుకు ఉదయనుడు మరింత దిగులుచెందాడు. ఐతే, ఆ క్షణమందే ఉదయనుడికి ఒక సంగతి జ్ఞాపకం వచ్చింది.

రాక్షసుడు తనను బావిలో తోసివేశాక, ఒడ్డున పడివున్న కత్తికూడా బావిలో పడవేసి మరీ పోయాడు. ఇప్పుడు ఉదయనుడు ఆ కత్తిని బావిలోనుంచి తీసి, పైకి విసిరాడు. అది అమాంతం వచ్చి బావి యివతల భూమిలో దిగబడిపోయింది. ఈ కత్తి చూసి అయినా రాకుమార్తెలు, తాను బావిలోవున్న సంగతి తెలుసుకుంటారేమో అని ఉదయనుడి ఆశ.

మరొక వారానికి రాకుమార్తెలు మళ్ళీ ఆ బావి దగ్గిరకు రావటం జరిగింది. బావి ఒడ్డున భూమిలో దిగబడివున్న కత్తిని చూస్తూనే, వాళ్ళు ఆశ్చర్యపోయారు. "ఇదేమిటి? క్రిందటిసారి మనం యిటు వచ్చినప్పుడు లేని కత్తి, యిప్పుడు ఎక్కడి నుంచి వచ్చింది? ఒక వేళ రాక్షసుడు, ఉదయనుణ్ణి చంపి, యీ బావిలో పడవెయ్యలేదు గదా?" అనుకుంటూ వాళ్ళు బావిలోకి తొంగి చూశారు.

చిత్రమేమిటోగాని బావిలో సగంవరకు రకరకాల పళ్ళు నిండివున్నై. వాటిపై గద్దపువాడి వేషంలో ఉదయనుడు నిలుచుని వున్నాడు. అతని చేతిలో మాయ తువ్వాలు వున్నది. తువ్వాలులోనించి



పళ్ళు యింకా గుట్టలు గుట్టలుగా వస్తూనే వున్నై. పళ్ళతో బావి నిండిపోతున్నది.

ఆశ్చర్యంతో రాకుమార్తెలు అలాగే నిలబడిపోయారు. మరికొద్ది సేపటికల్లా పై అంచువరకు పళ్ళువచ్చేసి, బావి నిండిపోయింది. ఆ పళ్ళగుట్ట పైన నిలుచునివున్న ఉదయనుణ్ణి, రాకుమార్తెలు చెయ్యి పట్టుకు బైటికి లాగివేశారు.

అప్పుడు ఉదయనుడు, రాకుమార్తెలతో తను రాక్షసుడి తల తెగనరకటమూ, వాడు తనను బావిలోకి విసిరివెయ్యటమూ, అప్పుడు తను వేసిన వ్యూహాలూ—వాళ్ళకు వివరంగా చెప్పాడు. అంతా విన్న రాజకుమార్తెలు, "ఏమైతే నేం, ఇంతకూ మాయతువ్వాలు నిన్ను రక్షించింది. దానిని ఉపయోగించి యిలా బయట పడవచ్చుననే ఉపాయం, నీకు తోచి నందుకే మెచ్చుకోవాలి." అన్నారు.

ఆ తరవాత అందరూ బయలుదేరి, గద్దపువాడూ, సంధ్యానిశీథులూ అదృశ్య రూపంలోవున్న చోటుకు చేరుకున్నారు. ఉదయనుడు తనవద్దవున్న భస్మం ఆ చోట చల్లేసరికి, వాళ్ళు ముగ్గురూ తిరిగి మామూలు రూపం పొందారు.

అప్పటివరకూ జరిగినకథ తెలుసు కోవటంతోనే గద్దపువాడు, "అయితే, రాక్షసుడు తను బావిలో తోసివేసింది, నన్నే అనుకున్నాడా? ఇదీ ఒకందుకు మంచిదేలే. ఇకముందు కథ ఆలోచిం చాలి." అన్నాడు.

అందుకు ఉదయనుడు, "నిజమే. అయితే యీమారు రాక్షసుడు వచ్చి నప్పుడు నా కోసం బావిలో చూస్తాడుగదా? నేను అక్కడ లేకపోవటం, పైగా బావి పళ్ళతో నిండివుండటం చూసి, వాడు అనుమానపడడా?" అన్నాడు.

"వాడు వచ్చేసరికి, ఆ బావి అక్కడ వుండి వాడికంట బడితే గదా?" అన్నాడు గద్దపువాడు.

వెంటనే వాళ్ళు బావి దగ్గరకు వెళ్ళి, భస్మం చల్లేసరికి, బావి మాయమై



పోయింది. దానికి బయలు మామూలు మైదానంల కానవచ్చింది.

అప్పుడు ఉదయనుడు, గర్తపు వాడితో, "సరే, నువ్వు యిప్పుడు చెయ్య వలసిన పని ఒకటి వుంది. మేము రాకుమార్తెలను వెతకటానికి బయలుదేరి, యిప్పటికి ఏడు సంవత్సరాలు అయింది. అక్కడ రాజూ, రాణీ మేము ఏమై పోయామో అని కంగారుపడుతూ వుంటారు. కనక, నీవు యీ క్షణంలోనే శ్రావస్తీనగరానికి బయలుదేరి వెళ్ళి, రాకుమార్తెలూ, మేమూ క్షేమంగానే వున్నామని, త్వరలోనే యిల్లు చేరుకుంటా మని చెప్పి రావలసింది," అన్నాడు.

గర్తపువాడు సరేనని చెప్పి, ఆ క్షణానే శ్రావస్తీనగరానికి ప్రయాణమయ్యాడు. అప్పుడు ఉదయనుడు తను మొట్ట మొదట, ఈ మాయాభవనం ప్రవేశించ బోయే ముందు కందకంలో పడిపోవటం, తన గుర్రాన్ని ఆ కందకంలోనే వుంచి, తను మాత్రం ఎలాగో బైటపడటం అంతా చెబుతూ, "కాలినడకన వెళ్ళితే, నీవు ఎప్పటికి చేరుకోగలవు? గుర్రం మీద పోయిరా. మొదట వారు నిన్ను నమ్మక పోవచ్చు. కాని, గుర్రాన్ని ఆనవాలు పట్టినతరవాత నమ్మితీరతారు," అన్నాడు.

ఉదయనుడి తెల్లగుర్రం మీద గర్తపు వాడు బయలుదేరాడు. వాడు అలా పోతూవుండగా, ఒక మైదానంలో ధానశీల మహారాజుగారి భటులు, సంధ్యానికిధుల గుర్రాల పైన వస్తూ, గర్తపు వాడికి ఎదురయ్యారు. తమ రాజుగారి తెల్ల గుర్రాన్ని చూస్తూనే వాళ్ళు గుర్తుపట్టి వేశారు. దానిపైన ఎవరో కొత్త మనిషి వుండటం చూసి, ఆటకాయించారు.

"ఎవరయ్యా నువ్వు? ఈ గుర్రం నీ కెక్కడిది? అలా ఎక్కడికి పోతున్నావు? చెప్పి మరీ కదులు." అన్నారు.

అందుకు గర్తపువాడు, "నేను ధానశీల మహారాజుగారికి ఒక శుభవార్త అందించ బోతున్నాను. అన్నట్టు, మీరు ఎక్క

వచ్చిన ఈ గుర్రాల్ని నేను యిదివరకే చూసినట్టుందే! మీరు మహారాజాగారి సేవకులా ?'' అని అడిగాడు.

''అవునులే. నువ్వు తెచ్చిన ఆ శుభ వార్త ఏమిటో ముందు చెప్పు.'' అంటూ వెగిరపెట్టారు రాజభటులు.

''రాకుమార్తెలూ, వారిని వెతకవచ్చిన కుర్రవాళ్ళూ, అంతా సుఖంగావున్నారు. ఈ మాట రాజుగారికి చెప్పాలి.'' అన్నాడు గడ్డపువాడు.


''అలాగా! మేమూ, నీతో వస్తాంపద.'' అన్నారు భటులు సంతోషంతో.

''అలాకాదు. ఒక పని చేద్దాం. ఇప్పుడు మనంకలిసి రాకుమార్తెలు వున్నచోటుకు పోదాం. మీరూ అక్కడే వుండిపోయి, వాళ్ళను కాపాడుతూ వుండండి. నేను తిరిగి వెళ్ళి రాజుగారికి యీ వార్త అందించి వస్తాను.'' అన్నాడు గడ్డపువాడు.

సరేనని వాళ్ళు కవలసోదరులున్న చోటుకు చేరుకున్నారు. భటులను అక్కడ వదిలి, గడ్డపువాడు మళ్ళీ బయులుదేరాడు.

కొంత దూరం వచ్చేసరికి సుడిగాలి ప్రారంభమైంది. రాక్షసుడి రాకకు యిది గుర్తుకదా అని, గడ్డపువాడు వెంటనే గ్రహించి, గుర్రాన్ని శరవేగంగా పోనియ్య సాగాడు. ఐనా, రాక్షసుడు రివ్వునవచ్చి,





గుర్రంమీద పోతున్న గడ్డంవాడిని ఆకాశ మార్గాన ఎత్తుకుపోయాడు.

గుర్రం మాత్రం అలా తిరుగుతూ, తిరుగుతూ మరొక వారానికల్లా శ్రావస్తీ నగరానికి పోయి, రాజమహలు చేరు కున్నది. రాజు చూస్తూనే పరుగున ఎదురువచ్చి, దానిని మహలులోకి తీసుకు పోబోయాడు. కాని, అది రాజు వెంట మహలులో ప్రవేశించక, మొండికేసి వచ్చిన దారినే పోబోయింది.

సేవకులంతా పోగయారు. వాళ్ళతో రాజు, "ఉదయనుడు ఏమయ్యాడో, ఈ గుర్రం యిక్కడికెలా వచ్చి చేరు కున్నదో—ఏమీ బోధపడటం లేదు. దీని చేష్టలు చూస్తే వాళ్ళు ఏదో ఆపదలో చిక్కుకున్నట్టు తోస్తున్నది. భవనంలోకి రాకుండా యిది వచ్చిన దారినే పోవ టానికి పెనుగులాడటంలో, ఏదో రహస్యం వుంది వుండాలి! కనక, ఇది ఎక్కడికి పోతే మీరు అక్కడికిపోయి, ఏమిజరుగు తుందో చూడిరండి," అన్నాడు.

రాజు యిలా చెబుతూ వుండగానే, గుర్రం పట్టువదిలించుకుని పోసాగింది. రాజభటులు దానిని వెంబడించారు. కాని, యింతలోనే ముందుకు పోతున్న గుర్రం, రాజభటుల వైపుకు తిరిగి వాళ్లను, "ఆగండి!" అన్నట్టు తల ఆడించింది.

ఇది చూడగా రాజుకు ఒక ఆలోచన కలిగింది. మంత్రిని పిలిచి, "వీళ్ళంతా వెంటబడటం అశ్వానికి యిష్టం లేనట్టుంది. వాళ్ళను వెనక్కు పంపిం చెయ్యి. నీవు మాత్రం వెంటవెళ్ళు." అని చెప్పి మంత్రిని పంపాడు.

భటులను తిరిగి మహలుకి పంపి వేశాక, గుర్రం మళ్ళీ ముందుకు సాగింది. అప్పుడు మంత్రి ఒక్కడూ దాని వెంట పోసాగాడు.

• • •

అక్కడ కపిలసోదరులూ, రాకుమా ర్తెలూ చాలా ఆందోళన చెందసాగారు. వార్త అందించి, తిరిగి వస్తానని చెప్పి

పోయిన గడ్డపువాడు, శ్రావస్తినగరానికి బయలుదేరిపోయి పది రోజులైంది. ఇంత వరకూ వాడు తిరిగిరాలేదు. కవలసోదరులకు పరిపరివిధాల ఆలోచనలు పోయినై.

చివరకు ఒకనాడు ఉదయనుడు తన సోదరులతో, ''పాపం, వాడు ఏమి ఆపదలో చిక్కుకున్నాడో. శ్రావస్తికిపోయి నేను కనుక్కువస్తా. అంతవరకూ మీరు జాగ్రత్తగా వుండండి. అవసరం అయితే యీ భస్మాలు వాడుకోండి.'' అని వాళ్లకు కొంత తెల్ల భస్మం, కొంత నల్ల భస్మం యిచ్చి, నిశిధుడి నల్లగుర్రం పైన, శ్రావస్తి నగరానికి బయలుదేరాడు.



ఉదయనుడు తన ప్రయాణంలో ఒక రాజ్యం మధ్యనుంచి వెళుతూవున్నాడు. దారిలో ఒకచోట ఒక అంధుడు, కర్రతో తడుముకుంటూ నడిచివస్తూ, పక్కనేవున్న ఒక గోతిలో పడిపోయాడు. ఈ దృశ్యం కంటబడగానే ఉదయనుడు అమాంతం గుర్రం మీంచి కిందికి దూకి, ఆ అంధుణ్ణి గోతిలోంచి లేవదీశాడు. అతడిపై తన దగ్గిరున్న అంజనాలు ప్రయోగించాడు. తక్షణమే అంధుడికి చూపు వచ్చేసింది. అతడు ఉదయనుడికి కృతజ్ఞత తెల్పుకొంటూ, తన ఇంటికి రమ్మని ప్రాధేయపడ్డాడు. సరేనన్నాడు ఉదయనుడు.

వాళ్లు ఇల్లు చేరుకునేసరికి, ఆ వృద్ధుడు ఆ ఊరి రాజుగారి సేవకుడి తండ్రే అని తెలిసింది. తన తండ్రికి యిలా చూపు వచ్చేసరికి, ఆ సేవకుడు ఉప్పొంగి పోయాడు. ఇంకేముంది, ఈ సమాచారం ఊరంతా అల్లుకుని, రాజుగారి చెవిని పడింది.

రాజుగారు భటులను పంపి, ఉదయనుడిని తన వద్దకు తీసుకురమ్మన్నాడు. ఉదయనుడు, రాజుఎదట హాజరయ్యాడు. ఉదయనుడిని, రాజు బహువిధాల సత్కరించి, ''నీ వంటి ప్రజ్ఞావంతుణ్ణి, ఇంత వరకూ చూసి ఎరగను. నీవు మా ఆస్థానంలో వుండిపోవాలి,'' అని కోరాడు.

అందుకు ఉదయనుడు, "మహారాజా, మీరు చూపిన ఆదరమూ, అభిమానమూ మరవలేను. అయితే, ఇప్పుడు నేనొక ముఖ్యమైన పని మీద వెళుతున్నాను. తిరుగుదలలో మళ్ళీ ఏలినవారి దర్శనం చేసుకొంటాను." అన్నాడు.

రాజు సంతోషించి ఉదయనుణ్ణి అతి వైభవంగా సాగనంపాడు. ఆటు తరవాత ఏవిధమైన ఆటంకాలూ లేకుండా, మరునటి వారానికల్లా ఉదయనుడు శ్రావస్తీనగరం చేరుకున్నాడు.

అతనిని చూస్తూనే రాజు ఎదురువచ్చి కౌగలించుకున్నాడు. రాజకుమార్తెలు క్షేమంగావున్నారని చెప్పాడు, ఉదయనుడు. రాజు కొంచెం స్థిమితపడ్డాడు. ఉదయనుడు, రాజుకు అప్పటి వరకు జరిగిన వింతలన్నీ పూసగుచ్చినట్టు చెప్పి, "మీరు నిశ్చింతగా వుండండి, మహారాజా! త్వరలోనే మేము, మీ అమ్మాయిలతోసహా క్షేమంగా తిరిగి వచ్చేస్తాము." అన్నాడు.

ఈ వార్త వినగానే రాజు హృదయం ఉప్పొంగింది. రాణీముఖం కలకల్లాడింది. రాజ్యంలో ప్రజలంతా ఆనందసాగరంలో మునిగిపోయారు.

మరునాడే ఉదయనుడు జాగుచేయక రాజు దగ్గిర సెలవు తీసుకుని, తల్లి ఆశీర్వాదం పొంది, బయలుదేరాడు.

మరొక్క వారానికల్లా ఉదయనుడు మాయాభవనం చేరుకున్నాడు. చేరుకున్నాడే కాని, ఆకిలిముందు కంటబడ్డ విడ్డూరం ఉదయనుణ్ణి ఒడలు కంపింప చేసింది. అంతటి భయంకరమైన దృశ్యం ఏమైవుంటుంది!

తోటలో ఒక చెట్టుకు అయిదు ఉరి త్రాళ్ళు వేళ్ళాడుతున్నై. సంధ్యా, నిశీధులూ, గద్దపువాడూ, శ్రావస్తి నుండి వచ్చిన రాజభటులూ—అంతా ఒక వరసలో కూర్చునివున్నారు. వాళ్ళందరకూ కాళ్ళూ, చేతులూ కట్టి బిగించబడి వున్నై. ఎదురుగా పులిలాగా రాక్షసుడు నిలబడి వున్నాడు.

—(ఇంకా వుంది)






# రాకాసిలోయ

## 14

[రాక్షసుడి చేత బావిలో పడవేయబడిన ఉదయనుడు, తన దగ్గిరవున్న మంత్రపు సంచి సాయంతో, అందులోంచి బయటపడ్డాడు. తరవాత అతడు శ్రావస్తీనగరానికి పోయి రాజుకు, రాజకుమార్తెల క్షేమం సంగతిచెప్పి, తిరిగి మాయాభవనానికి వచ్చాడు. అక్కడ అతడికొక చెట్టుకొమ్మకు వేళ్ళాడుతూ అయిదు ఉరితాళ్ళూ, రాక్షసుడూ కనిపించారు. తరవాత—]

ఉదయనుడు ఆ భయంకర దృశ్యం చూసి గజగజలాడిపోయాడు. ఏమి చెయ్యటానికీ అతడికి పాలుపోలేదు. పోనీ, అదృశ్యరూపం పొంది బంధింపబడిన వాళ్ళను విడిపిద్దామన్నా వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఎందువల్లనంటే, శ్రావస్తి నుంచి తిరిగి వచ్చేటప్పుడు, అతను దురదృష్టవశాత్తూ తెల్లభస్మం కాస్తా పోగొట్టుకున్నాడు. అందుచేత, తన సోదరులూ వాళ్ళూ మరొక్క క్షణంలో ఉరి తీయబడతారని తెలిసి కూడా, ఉదయనుడు చాటున పొంచి చూస్తూ వుండిపోవలసి వచ్చిందే కాని, మరో మార్గం కనిపించలేదు. అతడికి ముచ్చెమటలు పోసినై. క్షణమొక యుగంలా గడుస్తోంది.

ఇంతలో రాక్షసుడు, తాను బంధించిన వాళ్ళనందరినీ చెట్టు దగ్గిరకు తీసుకుపోయాడు. వాళ్ళ మెడలకు ఉరితాళ్ళు



తగిలించివేశాడు. చాటున వున్న ఉదయనుడు ముందుకు ఉరకబోయేంతలో, "ఆగు!" అన్న కేక వినిపించింది.

ఉదయనుడు విస్తుపోయి చూడసాగాడు. ఆ కేక పెట్టినది ఎవరు? గర్దభువాడే! వాడు, రాకసుడితో యిలా చెబుతున్నాడు: "వీళ్ళను రక్షిద్దామనే ఉద్దేశ్యంతో యిన్నాళ్ళూ ఒక రహస్యం నీతో చెప్పకుండా దాచాను. కాని, అది దాచికూడా వీళ్ళను రక్షించలేకపోయాను. పైగా యిప్పుడు నా ప్రాణాలకే ముప్పు వచ్చింది. కనుక, ఇక దాచను. ఇంత కాలమూ నిన్నూ, నన్నూ మోసపుచ్చుతూ వచ్చిన, ఈ ముగ్గురు కుర్రవాళ్ళూ కవలలు," అని యింకా ఏమో చెప్పబోయాడు.

రాకసుడు, గర్దభువాడి మాటలకు అడ్డంవచ్చి, "ఏమిటీ, వీళ్లు కవలలా? మళ్ళీ నన్ను మోసపుచ్చటానికి చూస్తున్నావల్లే వుందే! వీళ్ళు కవలలే అయినట్టయితే, నాకా చిక్కకుండా పోవటం!" అన్నాడు.

అప్పుడు గర్దభువాడు, "నిజమే. నీవు కావాలనే వీళ్ళను వదిలేశావు." అంటూ కవలసోదరుల దృష్టి లోపాలను గురించీ, దానిని తను సరిచేయటాన్ని గురించీ అంతా తెలియజేశాడు గత్యంతరంలేక.

అంతా విని రాకసుడు, "బలికి కావలసిన యాభై మంది కవలలూ సమకూరినట్టే కదా? నువ్వు చెప్పినదంతా నిజమేనని నమ్మవలసిందేనా? వీళ్ళు కవలలు అవునో కాదో ఎలా ధృఢి అవుతుంది? వాళ్ళనే అడుగుతా." అని చెప్పి, సంధ్యా నిశీధుల వైపు తిరిగి, "మా వాడు చెప్పిందంతా నిజమేనా? నిజం కప్పిపుచ్చినా, మీ ప్రాణాలు దక్కవు. కనుక, అబద్ధమాడకండి. నిజంగా మీరు కవలలే అయినట్టయితే, ఒక మహత్తరమైన కార్యం కోసం ప్రాణాలర్పించామనే తృప్తిఅయినా వుంటుంది మీకు." అన్నాడు.

ఇందుకు సంధ్యానిశీథులు, "నిజమే!" అన్నారు కన్నీరు కార్చుతూ.

దాపులనే పొంచివున్న ఉదయనుడు నిశ్చేష్టుడైపోయాడు. నమ్మి గద్దపువాణ్ణి ప్రాణాలతో వదిలినందుకు, యిదా ఫలితం అనిపించిందతడికి. వాడిని, అప్పటికప్పుడే నరికి పారేద్దామా అనుకున్నాడు. కాని, అంతలోనే రాక్షసుడి గొంతు వినిపించింది.


"అయితే, ఆ మూడో వాడెక్కడ?" అని రాక్షసుడు, గద్దపువాణ్ణి ప్రశ్నించాడు.

అందుకు గద్దపువాడు, "వాడు ఇంటికి పోయి వస్తానని చెప్పి వెళ్ళి, ఇప్పటికి వారం రోజులైంది. ఈపాటికి తిరిగి రావలసిందే. దారిలో ఏదైనా ప్రమాదము సంభవించిందో యేమో! ఇంతలో వస్తాడన్న నమ్మకం లేదు," అన్నాడు.

"సరే, ఆలస్యం ఎందుకు? రేపే బలి పూర్తిచేసి, దేవిని ప్రసన్నం చేసేసుకుంటాను. ఏర్పాట్లన్నీ చేయాలి. నిన్ను నమ్మి వదులుతానని మాత్రం అనుకోకు," అంటూ రాక్షసుడు, గద్దపువాడిని, సంధ్యానిశీథులనూ, రాజభటులనూ ఒక్కొక్కళ్ళను, ఒక్కొక్క చెట్టుకు అంటగట్టి, పెద్ద పెట్టున నవ్వుతూ గద్ద రూపంలో ఆకాశ మార్గాన ఎగిరిపోయాడు.

రాక్షసుడు వెళ్ళి వెళ్ళటంతోనే, ఉదయనుడు కత్తి దూసి, ఒక్క పరుగున గద్దపువాడున్న చెట్టు వద్దకుపోయి వాడిని నరకబోయాడు.





"ఆగు, తొందరపడకు! నేను చెప్పేది సాంతం విని, ఆపైన నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి," అన్నాడు గడ్డపువాడు.

"వినేదేమిటి? విన్నది చాలు. ప్రాణాలతో వదిలినందుకు బాగా చేశావు. నిన్నేం చేసినా పాపం లేదు. ఇంకా ఆగమంటావేమిటి?" అంటూ హుంకరించాడు ఉదయనుడు.

"అబ్బాయీ! నువ్వు యిలా అపోహపడటంలో ఆశ్చర్యం లేదులే. ఐనా చెప్పేది విను. ఈ క్షణానికి తప్పించుకొని బైటపడితే చాలుననే ఉద్దేశంతోనే, నేను వాడికి మీ జన్మ రహస్యం చెప్పవలసి వచ్చింది. తప్పించుకోటానికి మరో మార్గం లేదు. నా స్థానంలో నువ్వున్నా, మరేమీ చెయ్యలేవు. నా ఉపాయం పారింది. రేపటి వరకూ వాడు ఆగటం నిజంగా మన అదృష్టమే." అన్నాడు గడ్డపువాడు.

ఉదయనుడు ఆలోచనలో పడ్డాడు. అతడు కొంచెం వస్తాయించి, "సరే, నిన్ను నమ్మామే అనుకో. తెల్లవారేలోగా వాడికి చిక్కకుండా మనమందరం తప్పించుకోవటం ఎలా?" అన్నాడు.

అప్పుడు గడ్డపువాడు, "అదీ ఆలోచించా. చెప్పుతా. ముందు వీళ్ల కట్లు కూడా విడిపించుదాం పద," అంటూ సంధ్యా విశిరులనూ, రాజభటులనూ విడిపించాడు. తర్వాత వాళ్ళను వెంట బెట్టుకుని కొలను దగ్గరకు వెళ్ళాడు. వాళ్ళను చూస్తూనే రాకుమార్తెలు ఒడ్డుకి వచ్చేశారు.

గడ్డపువాడు, ఉదయనుణ్ణి, "ఆ ఎర్ర అంజనం యిలా తే," అన్నాడు.

ఉదయనుడు అంజనం యివ్వగానే, వాడు రాకుమార్తెలను దగ్గరకు రమ్మని పిలిచాడు. వాళ్ళు వచ్చాక ఆ ఎర్ర అంజనం తీసి సుహాసిని భుజానికి రాశాడు. వెంటనే ఆమె చెయ్యి మాయమైంది. తరవాత సుభాషిణిని కూర్చోబెట్టి, మోకాలి దగ్గిర అంజనం రాచేసరికి


ఆమె కాలు మాయమైంది. మరి కాస్త అంజనం తీసి సుకేశిని కళ్ళకు రాచాడు. దానితో ఆమె కళ్ళు రెండూ పోయాయి. ఈ విధంగా రాకుమార్తెలు ముగ్గురికీ అంగ వైకల్యం కల్పించటం చూచి ఉదయనుడు, "ఏమిటీ దారుణం? ఏదో ఉపాయం చెబుతానని చెప్పి, ఇదా నువు చేసేపని?" అని ఉగ్రుడయాడు.

"ఎంతకూ నీ తొందరపాటు మాత్రం మానవుకదా! అన్నింటికీ అలా అనుమాన పడతావేమిటి?" అంటూ గడ్డపువాడు, ఉదయనుడి చెవిలో ఏదో చెప్పాడు.

ఉదయనుడు కొంత తృప్తిపడి, "మరి ఇంతకాలం ఏ విధమైన అవయవలోపం లేకుండావుంది, రేపు వాడు వచ్చి చూసే సరికల్లా యిలా జరిగితే వాడు, నీ పైన అనుమానపడడా? దీనివల్ల మనకు కలిసివచ్చేదేముంది?" అని అడిగాడు.

"అదంతా తర్వాత చూద్దాం. ప్రస్తుతం యింతకంటె మార్గంలేదు. రేపు రాక్షసుడు వచ్చేవేళకు, మేము ఎప్పటిలాగా చెట్లకు కట్టివెయ్యబడి వుంటాం. నీవు మాత్రం భస్మం చల్లుకుని అదృశ్యరూపంలో వుండి, ఏమి జరుగుతుందో కనిపెడుతూ వుండు." అన్నాడు గడ్డపువాడు.

ఉదయనుడు తెల్లబోయాడు. "ఆ భస్మమేవుంటే యిన్ని పాట్లెందుకు



పడాలి? శ్రావస్తీనగరం నుంచి తిరిగి వచ్చేప్పుడు, అది కాస్తా పోగొట్టుకొన్నాను." అన్నాడతడు.

"ఏమిటీ పోగొట్టుకున్నావా? ఫరవా లేదులే. నీవు మాకు యిచ్చివెళ్ళిన భస్మం మేము వాడలేదు. ఇదుగో!" అంటూ గడ్డపువాడు పొట్లం తీసి యిచ్చాడు.

ఆ తర్వాత ఉదయనుడు వాళ్ళను, మళ్ళీ ఎప్పటిలాగా చెట్లకు కట్టివేసి, తను అదృశ్య రూపంలో వుండిపోయాడు.

*  *  *

మరనటి రోజున తెల్లవారే సమయంలో సుడిగాలి ప్రారంభమైంది. రాక్షసుడు వస్తున్నాడు కదా అనుకున్నారు అందరూ.



సంధ్యా నిశిధులూ, గడ్డపువాడూ, రాజ భటులూ ఎంతో అలసిపోయిన వాళ్ళలా చెట్లకు చేరగిలబడి వున్నారు. మరి కొద్ది సేపటికల్లా రాకసుడు రానే వచ్చాడు. అతని వెంట గండ్రగొడ్డళ్ళు భుజాన వేసుకున్న ఇద్దరు భటులు వస్తున్నారు. ఆ వెనక ఎంతో మంది పరివారం పూల దండలతో నడిచివస్తున్నారు.

రాకసుడు, సంధ్యా నిశీధులున్న చోటుకు చేరుకుంటూనే, తనకు ఏర్పర చిన సింహాసనంపై అధిష్ఠించాడు. తరవాత తన పరివారాన్ని, "కొలనులో కవల లందరకూ స్నానాలు చేయించి, దివ్యంగా అలంకరించి, ఒక్కొక్కళ్ళనే తెచ్చి, నా ఎదట నిలబెట్టండి.'' అని ఆజ్ఞాపించాడు.

వెంటనే ఎవరి పనులలో వారు నిమగ్ను లైపోయారు. ఒకరు స్నానాలు చేయిస్తు న్నారు, మరొకరు వస్త్రాలు అలంకరిస్తు న్నారు. అలంకరణ పూర్తి అయినవారి నల్లా రాకసుడి ఎదట నిలబెడుతున్నారు. రాకసుడు బ్రహ్మానంద భరితుడవు తున్నాడు. తన ఎదట తెచ్చి నిలబెడుతున్న రాజకుమార్తెలనూ, రాకుమారులనూ చూస్తూ, ''నీవు కనకపురి రాజకుమార్తెవు కదూ? నీవు అవంతీశుని అందాల భరిణవు కదూ? నీవు మణిపుర రాకుమా రుడివి కదా?'' అంటూ పేరుపేరున పరామర్శిస్తున్నాడు. పాపం, వాళ్ళు తలలు వంచుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఇంతలో, ఒక పరిచారిక మరొక రాకుమార్తెను తీసుకువచ్చి, నిలబెట్టి, ''ఇదేమిటి, ప్రభూ? ఈ గుడ్డిదాన్ని తెచ్చారే, దేవి యీ పిల్లను స్వీకరిస్తుందా?'' అన్నది.

రాకసుడు నివ్వెరపోయి, ''ఏమిటి, గుడ్డిదా?'' అంటూ సింహాసనం దిగి, ఆ రాకుమార్తెను పరిశీలించబోయేంతలో, మరో పరిచారిక, ''ఈ కుంటిదాన్ని తెచ్చారేమిటి, ప్రభూ?'' అంటూ తను

తెచ్చిన రాకుమార్తెను, రాక్షసుడి ఎదట వుంచింది.

రాక్షసుడు కోపం పట్టలేక పోయాడు. కళ్ళవెంట నిప్పులు గక్కుతూ, "మోసం! ద్రోహం!!" అని భూమ్యాకాశాలు దద్దరిల్లేట్టు అరిచాడు.

ఇంతలో మరో పరిచారిక, "ఈ రాకుమార్తెకు కళ్ళే లేవు, మా రాజా!" అంటూ తన వెంట తెచ్చిన రాకుమార్తెను, రాక్షసుడికి చూపించింది.

రాక్షసుడి కోపం మిన్నుముట్టింది. ఒక్క ఉరుకున గడ్డపువాడి దగ్గిరకు వెళ్ళి, వాణ్ణి చెట్టుతోసహా పెళ్ళగించి, "ఏమిటీ ద్రోహం? లక్షణమైన కవలలను తెచ్చి కొలనులో వేశానే. ఇప్పుడీ కురూపులెక్కడనుంచి వచ్చారు? ఇది నీ పనే. ఉన్నది వున్నట్టు చెప్పతావా, లేక ముందే నిన్నిక్కడ బలి యిచ్చేయమంటావా?" అని గద్దించాడు.

గడ్డపువాడు తొణకకుండా, "కేకల వల్ల ప్రయోజనం లేదు. ఈ పని నేను చేశానని కదూ, నీ అనుమానం? ఒక్క క్షణం ఆగి, చెప్పేదంతా విను. ఆపైన నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి." అన్నాడు కరుకుగా.

"చాల్లే. ఏర్పాట్లన్నీ సిద్ధం చేసుకువస్తే, అవన్నీ మంట గలిపావు. కాలయాపన చెయ్యకుండా అదేదో త్వరగా ఆఘోరించు." అన్నాడు రాక్షసుడు చెట్టును అమాంతం కిందపడవేస్తూ.



"వాళ్ళకు యీ అంగవైకల్యం ఎలా ఏర్పడిందో నాకూ తెలియదు. ఐతే, ఒకలా జరిగి వుండొచ్చుని నాకు తోస్తున్నది. ఇలా చేయగల ప్రజ్ఞ తప్పించుకు పోయిన, ఆ ఉదయనుడికే వున్నది. కవలలకు నేను దృష్టిలోపం పోగొట్టినప్పుడు, ఈ రహస్యం కాస్తా చెప్పి వేశాను. అందుకు కావలసిన అంజనాలూ అవీ కూడా, వాడి వద్దనేవుండి పోయినై. వాడు బ్రతికేవుంటే, ఎప్పుడో ఒకప్పుడు నీకు చిక్కకపోడు. అప్పుడు వాడిచేతనే, వీళ్ళకు మళ్ళీ యీ అంగవైకల్యం పోగొట్టించవచ్చు. అప్పటి వరకూ యీ కుర్రవాళ్ళను బంధించి వుంచు. ఇదే నేను చెప్పగల సలహా. తరవాత నీ యిష్టం," అన్నాడు గద్దపువాడు.

"సరే, కానివ్వు. ఈసారి వాడు చిక్కాడా, చచ్చాడన్నమాటే! ముందు పై సంగతి చూడాలి, పదండి!" అంటూ రాక్షసుడు, సంధ్యా నిశీదులనూ, రాజ భటులనూ, గద్దపువాడిని ఒక తాడుతో బంధించి, కోపంతో రుసరుసలాడుతూ తన వెంట లాక్కుపోయాడు.

ఇదంతా చూస్తూ ఉదయనుడు, రాక్షసుణ్ణి వెంబడిస్తూనే వున్నాడు. కొద్ది దూరం పోయి రాక్షసుడు ఒక ఆకుల గుట్ట దగ్గిర ఆగాడు. గద్దరూపం పొంది, విశాలమైన తన రెక్కలను విసురుగా ఆడించేసరికి, ఆ ఆకులన్నీ చెల్లా చెదరై పోయి, ఆ చోట భూమిలోకి ఒక ద్వారం ఏర్పడింది. రాక్షసుడు, సంధ్యా నిశీదులనూ, గద్దపువాడినీ, భటులనూ ఆ ద్వారంగుండా లోపలికి తోశాడు. వెంటనే మళ్ళీ ఆకులు కూడదీసి ద్వారం మూసివేసి, కొలను వద్దకు వచ్చాడు.

అలంకరణ పూర్తి అయిన కవలలను, జాగ్రత్తగా చూస్తూ వుండమని, అక్కడి పరిచారకులనూ, భటులనూ హెచ్చరించాడు. అంగవైకల్యం ఏర్పడిన సుహాసినీ, సుభాషిణీ, సుకేశినీలను ఎత్తుకొని గద్ద రూపంలో ఎగిరిపోయాడు.

—(ఇంకా వుంది)






# పాతాళదుర్గం

## 15

[రాక్షసుడు తనకు అవసరం అయిన కపాలం దొరికాలని, వాళ్ళను బలియిచ్చి దేవిని ప్రత్యక్షం చేసుకోవచ్చని సంతోషించాడు. కాని, తీరా బలి సమయానికి రాకుమార్తెలు ముగ్గురూ వాడిని అంగవైకల్యంతో శపించారు. వాడు తన భటులను హెచ్చరించాడు. గద్దగా మారి, ఆ ముగ్గురినీ ఎత్తుకుని ఆకాశంలోకి ఎగిరిపోయారు. తరవాత—]

ఉదయనుడు అలా అదృశ్యరూపంలోనే వుండి, ముందుగతి ఏమిటా అని తీవ్రంగా ఆలోచించసాగాడు. పాతాళభవనం లోకి పోదామంటే, అక్కడ తన శస్త్రాలూ, అంజనాలూ పనిచెయ్యవని రాకుమార్తెలు లోగడ చెప్పారు. అయినా, అది ప్రయత్నం చేసి చూద్దాం అనే కుతూహలంతో ఉదయనుడు వెళ్ళి, అక్కడ వున్న ఆకులగుట్ట తొలిగించాడు.

ఉదయనుడికి ఒక సొరంగమూ, దాని లోపలికి పోయేందుకు మెట్లూ కనిపించాయి. అతడు ఒక్కొక్క మెట్టే దిగుతూ పోయాడు. పదిమెట్లు దిగేసరికల్లా, అతడికి అదృశ్యరూపం పోయి మామూలు రూపం వచ్చేసింది. అయితే అతడు జంకిపోయి అంతటితో ఆగలేదు. మరో పది మెట్లు దిగాడు. అంతే, అడుగు ముందుకు పడలేదు! మెట్ల దిగువున భయంకరమైన



రెండు సింహాలు వున్నవి. అంతకంటె భయంకరమైన రెండు సర్పాలు వాటి మెడలకు చుట్టుకుని, బుసలుకొడుతున్నవి. అవి కంటబడగానే ఉదయనుడు క్షణమైనా అక్కడనిలవక, ఒక్క ఉరుకున సొరంగం బయటికి వచ్చి, తిరిగి అదృశ్యరూపం పొందాడు.

ఉదయనుడు అక్కడినుంచి సరాసరి కొలను వద్దకు వచ్చాడు. కొలనుచుట్టూ అగ్నిగుండాలు భుగభుగ మండుతున్నై. రాక్షసుడి పరివారం జాగ్రత్తగా కాపలా కాస్తున్నారు. వికారరూపులైన రాకుమార్తెలను రాక్షసుడు ఎత్తుకుపోయిన సంగతి ఉదయనుడికి తెలియనే తెలియదు. ఐతే యాదాలాపంగా లెక్కపెట్టేసరికి, కొలనులో నలభై ఎనిమిది హంసలకు బదులు, ఇప్పుడు నలభైఅయిదుమాత్రమే వుండటం చూసి సంశయంలో పడ్డాడు. లోపించినవి ఆ ముగ్గురు రాకుమార్తెలే అని, వారికి ఏదో ప్రమాదం సంభవించి వుంటుందని అనుకున్నాడు. అయితే చేసేదేముంది? ఎవరినడిగితే నిజానిజాలు తెలుస్తవి? అదృశ్యరూపం మార్చి మామూలుగా కనిపించాడా, రాక్షస పరివారం తనను పట్టేస్తారు. ఏదోవిధంగా కొలనులోకి చేరుకుని హంసరూపం పొందుదామన్నా, కొలను చుట్టూ అగ్నిజ్వాలలు భగభగ మండుతున్నై.

ఈలోపల రాక్షసుడు తాను ఎత్తుకుపోయిన సుహాసినీ, సుభాషిణీ, సుకేశినిలను ఒక మహారణ్యంలో వదిలేశాడు. వెళ్ళేముందు, వాళ్ళు తన మాయాభవనం రహస్యాలు బయట పెట్టకుండా వుండేందుకు గాను, వాళ్ళను మూగవాళ్ళుగా చేశాడు. అసలే అంగవైకల్యం ఏర్పడివున్న రాకుమార్తెలకు, యిలా మూగతనం కూడా ప్రాప్తించటంతో, వాళ్ళు దిగులుతో తల్లడిల్లిపోయారు. ఏదోవిధంగా అరణ్యం నుంచి బైటపడదామంటే, కాలుపోయిన సుభాషిణీ, కళ్ళుపోయిన సుకేశినిలతో నడవటం సుహాసిని వల్ల కాలేదు.

అదృష్టవశాత్తూ వాళ్ళున్న ప్రాంతానికి ఒక రాజు వేటకై వచ్చాడు. రాకుమార్తెలు ఆతడికంట బడ్డారు. అపురూప సుందరులైన ఆ పిల్లలకు యిలా అంగవైకల్యం ఏర్పడి వుండటం గమనించి ఆయన ఆశ్చర్యపోయాడు.

"ఎవరు మీరు? ఎందుకని యీ మహారణ్యం మధ్య సంచరిస్తున్నారు?" అని రాజు వాళ్ళను ప్రశ్నించాడు. కాని, మూగవారైన రాకుమార్తెలు ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేక, చేతిసంజ్ఞల ద్వారా తమ స్థితి తెలియచెప్పేందుకు ప్రయత్నించారు.

రాకుమార్తెల అవస్థచూసి రాజు, "పాపం, వీళ్ళు అంగవైకల్యంతో పాటు మూగవాళ్ళుకూడానా!" అంటూ ఎంతో జాలిపడ్డాడు.

తరవాత ఆయన వాళ్ళతో, "అమ్మా యిలా, చూడగా మీరు ముగ్గురూ పెద్ద కుటుంబానికి చెందినవాళ్ళుగా కనబడుతున్నారు. ఏదో గట్టి కారణంవల్లనే మీరు ఈ దుస్థితిలో వుండి వుండాలి. మీకు వచ్చిన భయం ఏమీలేదు. నా వెంట తీసుకుపోతాను. మీ ఇంట్లో ఎంత స్వేచ్ఛగా వుండేవారో, అంత స్వేచ్ఛగానూ మీరు నా కోటలో వుండవచ్చు. నేను మాళవదేశపు రాజును. నా పేరు ప్రతాపసింహుడు." అని ధైర్యం చెప్పాడు.

ఈ మాటలు వింటూనే కష్టాలపాలైన రాకుమార్తెల ముఖాలు వికసించినై. రాజు





వాళ్ళను తన గుర్రంమీద ఎక్కించి, తను దాని వెంట బయలుదేరాడు.

మరికొద్దిసేపటికి సుహాసినీ, సుభాషిణీ, సుకేశినిలతో సహా రాజు తన భవనం చేరుకున్నాడు. వెంటనే ఆస్థాన విద్వాంసుణ్ణి రప్పించి, రాకుమార్తెల వృత్తాంతం తెలుసుకునే మార్గం ఏదైనా వుంటేమో ఆలోచించమన్నాడు.

ఆస్థాన విద్వాంసుడు బుద్ధిబలం అంతా ఉపయోగించి ఎంతో ఆలోచించిన మీదట ఒక ఉపాయం తోచింది. అతడు కొంత ఇసుక తెప్పించి, రాకుమార్తెల ముందు పోయించి, దాన్ని బాగా చేత్తో చదునుచేసి, రాయమన్నట్టు సుహాసినికి సంజ్ఞచేశాడు.

సుహాసిని కన్నీరు కార్చుతూ, చదువు నేర్చిన వాళ్ళం కాము, అనే అర్థమిచ్చేలా తిరిగి సంజ్ఞ చేసింది. తనేదో గొప్ప ఆలోచన చేశాననుకున్న ఆస్థాన విద్వాంసుడు, సుహాసిని యిలా సంజ్ఞ చేయగానే తల వేలాడవేశాడు.

"మహారాజా! నా బుద్ధికి తోచిన ఒక్క ఉపాయమూ ప్రయోగించాను కాని, మాట దక్కలేదు. ఇంతకుమించి వేరే మార్గం కనిపించటంలేదు కూడా." అని ఆస్థాన విద్వాంసుడు రాజుకు విన్నవించుకున్నాడు.

రాజు యిందుకు కొంచెం విచారించి, విద్వాంసుణ్ణి పంపేసి, దాసీలను పిలిచి, "ఈ ముగ్గురికీ ఏ లోపమూ జరక్కుండా, అతి జాగ్రత్తగా చూస్తూండండి. అంతఃపురంలో వుంచి కంటికి రెప్పలా కాపాడుతూ వుండండి." అని ఆజ్ఞాపించాడు.


సుహాసిని, సుభాషిణి, సుకేశినిలు రాజుగారి అంతఃపురంలో, ఎలాంటి అసౌకర్యాలూ కలక్కుండా సుఖంగా వుంటున్నారు.

* * *

ఉదయనుడు క్రిందటిమారు శ్రావస్తి నగరానికి వెళ్ళొచ్చాడు. ఒకానొక రాజ్యం మధ్యనుంచి ప్రయాణించటం, అక్కడ ఒక అంధుడికి చూపు తెప్పించటం, అది

చూసి ఆ దేశపురాజు అతణ్ణి తన దగ్గిర వుండిపొమ్మనటం జరిగింది. ఇప్పుడు రాజకుమార్తెలను అడవిలో చూసి, తన కోటకు తెచ్చిన రాజు అతడే—ప్రతాప సింహుడు.

వాగ్దానం చేసిన విధంగా ఉదయనుడు తన వద్దకు తిరిగి వస్తాడని, అప్పుడు అతని చేత ఆ ముగ్గురికి అంగవైకల్యం పోగొట్టించవచ్చునని, రాకుమార్తెలను చూసిన క్షణమందే రాజు మనసులో అను కున్నాడు.



మరో వారానికల్లా ఉదయనుడు, ఈ మహారాజు వద్దకు రావటం తటస్థించింది. తలవనితలంపుగా అతడు తనంతట తనే వచ్చేసరికి, రాజు బ్రహ్మానంద భరితుడయాడు. ఉదయనుడు తన ఆస్థానంలో వుండిపోయేందుకే వచ్చా డనుకున్నాడాయన.

"వచ్చావా! నీవు ఎప్పుడు వస్తావా అని ఎదురు చూస్తున్నాను. రావలసిన సమయంలోనే వచ్చావు. సంతోషంగా వుంది. నువు వెళ్ళిన పని నెరవేరిందా?" అని అడిగాడు రాజు.

ఆ ప్రశ్నకు ఉదయనుడు, "మహా రాజా, నేను తలపెట్టిన కార్యం యింకా పూర్తికాలేదు. అందుకే తమ సహాయం కావలసి వచ్చాను," అన్నాడు.

"సహాయం కావాలా? ఏమిటది? మొహమాట పడకుండా చెప్పు. నా వల్ల ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తాను," అన్నాడు ప్రతాపసింహ రాజు.

అప్పుడు ఉదయనుడు తనను గురించి, తన సోదరులను గురించి సర్వం రాజుకు చెప్పి, తాను ఆ కనిపించకుండా పోయిన రాకుమార్తెల కోసం వెతుకుతున్నానని, తన వద్ద వున్న అంజనాలూ, భస్మాలూ మహిమ కూడా ప్రతాపసింహ మహా రాజుకు వివరించాడు.

అంతా విన్న మహారాజు అతణ్ణి, "అయితే, యిప్పుడు నేను చేయవలసిం దేమిటి?" అని ప్రశ్నించాడు.



"తమ ఆస్థాన చిత్రకారుణ్ణి, ఒక పర్యాయం నాతో పంపాలి. ఇద్దరం వారం రోజుల్లో తిరిగి వచ్చేస్తాం," అన్నాడు ఉదయనుడు.

రాజు సరేనని, చిత్రకారుణ్ణి పిలిపించి, అతణ్ణి ఉదయనుడికి పరిచయం చేశాడు. మర్నాడే ఉదయనుడు, చిత్రకారుణ్ణి వెంటబెట్టుకుని బయలుదేరి, రాక్షసుడి భవనాన్ని చేరాడు. అక్కడ అతడు చిత్రకారుడి పైన భస్మం చల్లి, తనపైన కూడా చల్లుకున్నాడు. ఇద్దరూ అదృశ్యులయారు. రోజల్లా వాళ్ళు కొలను ఒడ్డున వుండిపోయి, మర్నాడు తిరిగి మాళవరాజ్యానికి బయలుదేరారు.

వారం రోజులకల్లా ఉదయనుడూ, చిత్రకారుడూ రాజమహలు చేరారు. చిత్రకారుడు తాను తయారు చేసిన చిత్రాలన్నిటినీ వరసగా పేర్చాడు. ఒక్కొక్క బొమ్మనూ పరిశీలిస్తూ, ఆ వెంటనే ఉదయనుడి వైపు చూస్తూ వస్తున్నాడు. మధ్యలో ఒక బొమ్మ వద్దకు వచ్చేసరికి చిత్రకారుడు, ఉదయనుడి వైపుకు చూసి, ఆ బొమ్మ ఉదయనుడి పక్కనే పెట్టి మళ్ళీ చూసి, "భేష్! ఇది మీకు సరిపోయింది. ఈ వేషం వేస్తే మిమ్మల్ని ఆ రాక్షసుడి భటులు కాదుగదా, ఎవరూ పోల్చుకోలేరు," అన్నాడు.

"అవును," అన్నాడు ఉదయనుడు ఆ బొమ్మకేసి చూస్తూ సంతోషంతో నిండిన హృదయంతో.

ఆ వెంటనే ఉదయనుడికి రాక్షసుల అనుచరులలో ఒకనిలాగా వేషం వేశాడు చిత్రకారుడు. ఒకటికి రెండుసార్లు ఉదయనుడు తన రూపాన్ని అద్దంలో చూసుకున్నాడు. "ఆహా, చాలా బాగా కుదిరింది!" అనుకుని, మర్నాడే రాజు వద్ద సెలవు తీసుకుని, తిరుగా కొలనుకు బయలుదేరాడు.

ఉదయనుడు కొలనుకు చేరుకుంటూనే, తన వద్దవున్న భస్మం కొనమును, ఎప్పటిలాగా అలవాటు ప్రకారం దుస్తు

తడివి చూసుకున్నాడు. కాని, భస్మం కనిపించలేదు. గత్యంతరం ఏమిటా అని కొంతసేపు ఆలోచించి, ధైర్యం తెచ్చుకుని, చీకటిపడే వరకూ ఎవళ్ళ కంటా పడకుండా, ఒక పొద చాటున దాక్కున్నాడు.

చీకటి పడింది. రాక్షసుడి పరివారంలో మరికొందరు, కొలను దగ్గిరకు వచ్చి, అంతకు ముందు అక్కడ కాపలా కాస్తున్న జట్టును విడుదల చేశారు. విడుదలైన వాళ్ళు పాతాళగృహం చేరుకొని, ఒక్కొక్కరే లోపలికి ప్రవేశించారు. చిట్టచివరి వాడు అందులో ప్రవేశించబోయే సమయంలో, ఉదయనుడు కూడా యుక్తిగా అతని వెంట లోపలికి వెళ్ళాడు.

తన మాయ వేషం ఎక్కడ తెలిసి పోతుందో అని ఉదయనుడు లోలోపల జంకుతూనే వున్నాడు. అయితే దైవ వశాత్తు ఇంతవరకు అలాటిదేమీ జరగలేదు. కారణం ఏమిటంటే—ఉదయనుడి వేషం చూసి, అతను తమలోవాడే అనుకున్నారు తక్కినవాళ్ళు.

ఈ సారి ఉదయనుడు మెట్లన్నీ దిగి, ఆ సింహాల పక్కగానే పోయాడు. జట్టులో కలిసిపోయి వుండటం వల్ల, ప్రత్యేకించి అవి తనను పసికట్టలేవని ఉదయనుడి ధైర్యం. అయితే అవి కొత్తమనిషిని యిట్టే పసికట్టినై. వెంటనే అతడి పైనబడి చంపబోయాయి. కెవ్వున కేక వేసి ఉదయనుడు పడిపోయాడు.



ఈ దృశ్యం చూసి మిగతావాళ్ళంతా పరుగెత్తుకుంటూ వచ్చి, ఒక్క వేటుతో సింహాలు రెండింటినీ నరికివేశారు. తరవాత ఉదయునెత్తి వెంటదీసుకు వెళ్ళి చుట్టూ గుమిగూడారు. "మననే చంపబోయి నయ్యే, యీ సింహాలు! ఎంత పొగరు. వాటికి మంచి శాస్తే చేశావులే!" అని సింహాలను చంపినవాడిని అందరూ మెచ్చుకున్నారు.

తరవాత వాళ్ళు ఉదయుడికి పరిచర్య చేశారు. గాయాలకు కట్లు కట్టారు. కాస్తంత తేరుకున్న వెనక, "తమ్ముడూ! నీ గాయాలు పూర్తిగా మానిపోయేవరకు రెండు రోజులపాటు యిక్కడే వుండు. అంతవరకు కాపలా పని మేము చూచుకుంటాంలే," అన్నారు.

"అయితే మరొక్క ఉపకారం చేసిపెండి. నేను కాలు కదపలేకుండా వున్నాను. కనుక నా తిండి ఏర్పాటు కూడా చేసిపెండి. మీకు పుణ్యం వుంటుంది," అన్నాడు ఉదయుడు.

అందుకు సరే అని, కాపలావాళ్ళు ఉదయుడికి మాంసమూ, పానీయాలూ తెచ్చి ఇచ్చారు. తరవాత తిండికీ, పడకకూ సదుపాయం చేసి, ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

తెల్లవారింది. రాక్షసుడి పరిచారకులు కొలువుకు బయలుదేరి వెళ్ళి, అక్కడి కాపలావాళ్ళను విడుదల చేశారు. మరి కొద్దిసేపటికల్లా వాళ్ళు, ఉదయుడి దగ్గిరకొచ్చి, "అదృష్టవంతుడివిరా, తమ్ముడూ!" అని అభినందించారు. రాత్రల్లా కాపలా కాసి వుండటాన వాళ్ళు మరి కొంచెం సేపటిలోనే గుర్రుపెడుతూ నిద్రపోసాగారు.

సరిగా అర్ధరాత్రి వేళ రాక్షసుడు వచ్చేశాడు. వస్తూనే మెట్లకింద సింహాలు రెండూ చచ్చిపడి వుండటం చూశాడు. వాడికి పట్టరానంత కోపం వచ్చింది. "ఎవడిదిరా, ఈ పని?" అని బొబ్బలు పెడుతూ ఉదయుడు పడుకొనివున్న చోటుకు వచ్చాడు. —(ఇంకా వుంది)






16

[రాక్షసుడు, రాకుమార్తెలు ముగ్గురినీ మూగవాళ్ళుగా చేసి అరణ్యంలో వదిలాడు. మాళవ దేశపురాజు వాళ్ళను రక్షించి, తన భవనానికి తీసుకుపోయాడు. ఉదయుడూ, మారు వేషంలో రాక్షసుడి సేవకులుండేచోట చేరాడు. అక్కడికి అర్ధరాత్రి సమయంలో రాక్షసుడు వచ్చి, సింహాలను చంపినవాడెవడంటూ, ఉదయుడి కేసి రాసాగాడు. తరవాత—]

రాక్షసుడు పెడబొబ్బలు పెడుతూ, తన దగ్గరకు రావటం చూస్తూనే, ఉదయుడు భయంతో గజగజలాడిపోయాడు. అతడు ఏదో జవాబు చెబుదామనుకునేంతలో, రాక్షసుడి పరిచారకులంతా పరుగుపరుగున అక్కడికి వచ్చారు.

వాళ్ళల్లో సింహాలను చంపినవాడు చేతులు కట్టుకుని, "నేనే, బాబయ్యా, యీ పని చేసింది. మన భవనంలో వుంటూ, మన చేతికింద పెరుగుతూ అవి మనల్నే మాటువెయ్యజూశాయండి. నేనే గనక సమయానికి అడ్డుకోకపోయి నట్టయితే, ఈ పాటికి పాపం, నాథు యమలోకానికి పోయేవాడే!" అని రాక్షసుడికి విన్నవించుకున్నాడు.

అందుకు రాక్షసుడు, "ఆం, అలాగా! మంచిపని చేశావు. ఈ సింహాలకు కొంచెం కొవ్వెక్కినట్టుంది. తక్కినవాటికి ఒక



వారం రోజులపాటు కడుపు ఎండగట్టింది. అవే దారికొస్తాయి." అంటూ అక్కడి నుంచి చరచరా వెళ్ళిపోయాడు.

అప్పటికిగాని ఉదయనుడికి ప్రాణాలు కుదుటపడలేదు. ఏమీ ఎరగనట్టు పడుకున్నాడే కాని, రాక్షసుడు ఎటు పోయిందీ, ఓరకంట కనిపెడుతూనే వున్నాడు ఉదయనుడు.

రాక్షసుడు చావడి చివర ఒక పెద్ద ద్వారం వద్దకు వెళ్ళి, మొలలో నుంచి ఒక చిన్న తాళపుచెవి తీసి, ఏదో మంత్రం చదివాడు. మంత్రం చదవటం పూర్తయేసరికి, ఆ చిన్న తాళపుచెవి కాస్తా ఏడడుగుల పొడవున పెరిగిపోయింది. అప్పుడు రాక్షసుడు దానితో, ఆ ద్వారం తలుపులు తెరిచి లోపలప్రవేశించాడు.

ఉదయనుడు ఆ లోపల ఏమున్నదో లేచి వెళ్ళి చూద్దామనుకున్నాడు. కాని, పట్టుబడిపోతే ప్రాణాలు దక్కవే? అందుకని ఏమి జరిగేదీ జాగ్రత్తగా కనిపెడుతూ, అలానే పడుకుండి పోయాడు.

మరి కాసేపటికల్లా రాక్షసుడు ఇవతలికి వచ్చి, యథాప్రకారం తలుపు మూసి వేశాడు. మళ్ళీ మంత్రం ఉచ్చరించేసరికి, తాళపుచెవి తిరిగి చిన్నదయిపోయింది. అది బొడ్డులో దోపుకొని, రాక్షసుడు పాతాళ గృహం లోంచి బయటికి వెళ్ళిపోయాడు.

మిగతా పరివారం తిరిగి ఎవరి చోట్లకు వారు వెళ్ళి, గుర్రుకొట్టి నిద్రపోసాగారు. ఈ అదునులో ఉదయనుడు మెల్లగా లేచి, రాక్షసుడు తెరిచి, మూసిన పెద్ద ద్వారం వద్దకు వెళ్ళాడు. తాళపుచెవి దూర్చే బిల్లంలోనుంచి తొంగి చూశాడు. చూడగా ఉదయనుడు తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. ఎందుచేతనంటే, తను ఎవరికోసమైతే తపించిపోతున్నాడో, ఆ గర్తపువాడు అక్కడ తలక్రిందుగా వ్రేలాడ తీయబడివున్నాడు. సంధ్యానికి ధులు మాత్రం లేదు.

ఇది చూసేసరికి ఉదయనుడికి భయమూ, ఆశ్చర్యమూ కలిగినై. తన




సోదరులేమైనట్లు? గడ్డపువాడిని కలుసుకుంటే తెలుస్తుందేమో! కాని, తాళపుచెవి లేకుండా లోపల ప్రవేశించటం ఎలా? ఉదయనుడికి ఏమీ పాలుపోయింది కాదు.

అలాగే కొంతసేపు ద్వారం వద్ద నిలబడి, ఎంతకూ ఏమీ తోచక, ఉదయనుడు విసిగి విసిగి, తన చోటుకువచ్చి పడుకున్నాడు. పడుకున్నాడే కాని నిద్ర పట్టితేనా? ఆ గదిలో ప్రవేశించటం ఎలాగ? గడ్డపువాడిని కలుసుకోవటం ఎలా? సోదరులు ఏమయారు? రాత్రంతా ఉదయనుడికి యిదే ఆలోచన.

తెల్లవారింది. రాత్రికాపలా కాసినవాళ్ళు తిరిగి పాతాళగృహం చేరుకున్నారు. వాళ్ళు రావటంతోటే, యిక్కడవున్న కాపలావాళ్ళు కొలనుకు బయలుదేరి పోయారు. ఉదయనుడికి ఆ వచ్చిన వాళ్ళ ద్వారా, గడ్డపువాడు వెళ్ళాడుతున్న గదిని ప్రవేశించేమార్గం అడిగి తెలుసుకుందామా అన్న కోరిక కలిగింది. కాని, వెంటనే ఒక సందేహం కూడా కలిగింది. ఈ ప్రశ్న అడగ్గానే తన మారువేషం బయటు పడుతుందేమో! తను పట్టుబడి పోతారేమో! అందుచేత ఉదయనుడు, ఆ ఆలోచన అంతటితో కట్టిపెట్టివేశాడు.

ఒకవారం రోజులకల్లా రాకినుడు తిరిగివచ్చాడు. మునుపటిలాగానే మొలలో నుంచి తాళంచెవి తీసి, మంత్రం వేసి పెట్టదివేశాడు. గది తలుపులు తెరిచి లోపల ప్రవేశించాడు. ఉదయనుడు కూడా, అతడితోపాటు యుక్తిగా వాకిలి దాటి లోపల అడుగుపెట్టాడు.

వాకిలికి పక్కగా మనిషి నిలువుకు సరిపడే మూడు పెద్దపెద్ద బానలూ, వాటి పైన మూతలూ వున్నై. మొదటిదాని పైనవున్న మూత తీశాడు, ఉదయనుడు. దానిలో ఎవరో మనిషి వున్నట్టు కనిపించింది. గబుక్కున మూసివేశాడు. రెండో బాన మూతతీసి చూశాడు. అందులోనూ అలాగే మనిషి కనిపించాడు. అది మూసివేశాడు. మూడవ బాన చూశాడు. ఖాళీగా



వుంది. గుట్టుచప్పుడు కాకుండా, దానిలో దిగి మూత వేసుకుని కూర్చున్నాడు. ఆ సమయంలో రాక్షసుడు ఎక్కడ వున్నదీ ఉదయనుడికి తెలియదు.

మరికాసేపటికి రాక్షసుడు ఆ బానల దగ్గిరకు వచ్చాడు. 'ఒకటి' అని అరుస్తూ, మొదటి బాన మీది మూత ఎత్తాడు. లోపలవున్న మనిషి లేచి నిల బడ్డాడు. రాక్షసుడు వాడిని జుట్టు పట్టు కుని బైటికి లాగాడు. తర్వాత 'రెండూ' అంటూ కేక పెట్టి, రెండో బాన మీది మూత ఎత్తాడు. దానిలోవున్న మనిషి కూడా లేచి నిలబడగా, వాణ్ణికూడా జుట్టు పట్టు కుని ఎత్తి బైటికిలాగాడు.

తరవాత రాక్షసుడు, వాళ్ళను వెంట బెట్టుకుని గది బయటికి వచ్చేశాడు. తలుపులు ఎప్పటిలా మూసి, తాళం చెవి మొలలో దోపుకున్నాడు. వాళ్ళ నిద్దరని వేరే గుప్పిటలో పట్టుకుని, పాతాళగృహం లోంచి బయటికి వెళ్ళి పోయాడు.

ఉదయనుడు ఏ మాత్రం ఆలస్యం చెయ్యలేదు. వెంటనే బాన మూత ఎత్తి పైకి రాబోయాడు. కాని దిగటమంత తేలికగా కనబడలేదు, పైకిరావటం. ఒక్క ఎగురు ఎగిరాడు. పైకంటా ఎగర లేక పోయాడు. బాన అంచు కాలికి తగిలి, దానితోసహా కిందపడ్డాడు. పడిపడటం తోటే బాన ముక్కముక్కలై పోయింది.

ఇలా ఉదయనుడు బైటపడ్డాడు. మరి కొద్ది దూరంలోనే వేలాడుతున్న గద్దపు వాడు కనిపించగా, ఒక్క పరుగున వాడి దగ్గిరకు వెళ్ళాడు, ఉదయనుడు. "అదేమిటయ్యా, ఈ శిక్ష? నా సోదరులు ఏమైనారు? చెప్పు. రాక్షసుడు రాక ముందే నేను పోవాలి. చెప్పు, త్వరగా చెప్పు!" అని, గద్దపువాణ్ణి తొందర పెట్టాడు ఉదయనుడు.

ఉదయనుడు మారువేషంతో వచ్చా డని, గద్దపువాడు యిట్టే గ్రహించాడు. వాడు వెంటనే, "నువ్వేనటోయ్! గాభరా

పడకు. వాడు యింకో వారం రోజుల వరకూ రాడులే. ముందు నా కట్లువిప్పు చెబుతా," అన్నాడు.


ఉదయనుడు, గడ్డపువాడి కట్లు విప్పాడు. బంధాలు పోగానే గడ్డపువాడు యిలా చెప్పాడు: ''నువ్వు యీ లోపలకు రావటం, బానల మీది మూతలు తీసి చూడటం—అంతా నేను గమనిస్తూనే వున్నాను. ఆ రెండు బానలలోనూ నీవు చూచిన మనుషులు ఎవరనుకున్నావు? వాళ్ళు నీ సోదరులు, అంకానయుం. వాడు మూడో బాన మీది మూత తియ్యలేదు. తీసినట్టయితే, నీ గతి ఏమయ్యేదో!''

అంతా విని ఉదయనుడు ఆత్రంగా, ''ఏమిటీ, వాళ్ళు నా సోదరులా? సంధ్యా, విశదులా? ముందు వాళ్ళను విడిపిద్దాం పద,'' అంటూ గడ్డపువాణ్ణి వేగిరపెట్టాడు.

గడ్డపువాడు విరగబడి నవ్వుతూ, ''ఓరి, పిచ్చితండ్రీ! వాళ్ళు యింకా వాటిలో వున్నారనుకొంటున్నావా? ఒకటి, రెండూ అని, రాక్షసుడు పిలవటం వినిపించలేదా? వాళ్ళను ఆ బానల్లో నుంచి పైకిలాగి, తనతో తీసుకొని పోయాడు,'' అన్నాడు.

''సరేకాని, ముందు యీ సంగతి చెప్పు. వాడు, నిన్నెందుకిలా తల క్రిందులుగా వేళ్ళాడదీశాడు? ఎందుకోసమని, నా సోదరులను బానలలో పెట్టాడు? అసలు మమ్మల్ని యీ పాతాళ గృహం





లోకి తీసుకువచ్చిన తర్వాత, ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు ఉదయనుడు.

"ముందు పగిలిన ఆ బాన ముక్కలు దాచేసెయ్యాలి. తర్వాత మిగతా విషయాలు చెబుతాను." అంటూ గడ్డపువాడు వెళ్ళి, ఆ ముక్కలన్నీ ఎత్తాడు. ఆ పని పూర్తిచేసి అతడు, ఉదయనుడితో, "నీవు ఎక్కడికి పోయింది, మాకు తెలిసిపోయింది కూడా. మేము దాస్తున్నామనీ, ఆ సంగతి వెల్లడించేవరకూ మమ్మల్ని నానాయాతనా పెడతానని, రాక్షసుడు బెదిరించాడు. అయితే మేము ఏమాత్రం సంగతి బయట పెట్టలేదు. అప్పుడువాడు, మా ముగ్గురినీ, ఆ మూడు బానలలోనూ పెట్టి బంధించాడు. అప్పటికీ నేను రహస్యం బయట పెట్టకపోయేసరికి, నన్ను యిలా వేలాడదీశాడు. అయినా నేను మొండిగా, నీ సంగతి నాకు ఏమీ తెలియనే తెలియదని చెబుతూవచ్చాను. నన్ను చేసినట్టుగానే, నీ సోదరులను కూడా వేలాడదీస్తాడనుకున్నాను. కాని, అలా చేసినట్టు కనబడదు. మరి ఎక్కడికి తీసుకుపోయాడో, నాకూ బోధపడటంలేదు," అన్నాడు.

తర్వాత ఉదయనుడు, తను ఎలా మాయవేషం వేసుకుని అక్కడికి చేరుకున్నదీ వివరంగా చెప్పి, భస్మాలూ, అంజనాలూ మొదలైనవి పోగొట్టుకున్న సంగతి కూడా చెప్పాడు.

అంతావిని గడ్డపువాడు, "వాటిని ముమ్మాటికీ ఆ రాజే కాజేసివుంటాడు. ఏదో ఒక ఉపాయంచేత యిక్కడినుంచి బైట పడి, మళ్ళీ ఆ రాజు దగ్గిరకుపోయి, వాటిని తిరిగి సంపాదించే మార్గం చూడాలి." అన్నాడు.

అదేప్రకారం గడ్డపువాడూ, ఉదయనుడూ కలిసి ఆలోచించసాగారు.

* * *

ఇక మాళవదేశ రాజైన ప్రతాపసింహుని కొలువులోవున్న ముగ్గురు రాజకుమార్తెల విషయంలో ఒక చిత్రం జరిగింది. ఉదయనుడు ఆ రాజు దగ్గిర కొచ్చి,

మర్నాడు వెళ్ళిపోతాడనగా రాజు ఒక పథకం వేశాడు. ఉదయనుడు రాత్రివేళ గాఢనిద్రలో వుండగా, అతడి దగ్గిరవున్న భస్మాలనూ, అంజనాలనూ రాజు దొంగిలించి, ఏమీ ఎరగనట్టు వూరుకున్నాడు. మర్నాడు ఉదయనుడు వెళ్ళిపోగానే, రాజు తనే స్వయంగా రాకుమార్తెలను చేరపిలిచి, అంజనాలూ, భస్మాలూ ప్రయోగించి, వాళ్ళ అంగవైకల్యాలు పోగొట్టాడు. ఇప్పుడు వాళ్ళు ఏలోపం లేకుండా కనబడగానే, రాజు వాళ్ళ అందచందాలు చూసి తన్మయుడై పోయాడు.

రాజు ప్రతాపసింహుడు, కవలలను వివాహమాడదలిచి, ఆ మాట వాళ్ళకు చెప్పాడు. కాని, వాళ్ళు, అతణ్ణి వివాహం ఆడేందుకు అంగీకరించలేదు. రాజు, వాళ్ళను బెదిరించిచూశాడు. ప్రయోజనం లేకపోయింది. దానితో అతడు రాకుమార్తెలను కారాగారంలో పెట్టించాడు. అనుకోని విధంగా వచ్చిన యీ ఆపాంతరానికి, రాకుమార్తెలు దుఃఖంతో కుమిలిపోసాగారు.

ఇక భూగృహం నుంచి సంధ్యా సికేడులను తీసుకుపోయిన రాకీసుడు, వాళ్ళద్దర్నీ కొలను ఒడ్డున నిలబెట్టి, "ఒరే, ఆఖరుసారిగా మీకు అవకాశం యిస్తున్నా, మీ సోదరుడు ఎక్కడికి పారిపోయాడో, యిప్పుడైనా నిజం చెప్పండి. లేకుంటె మరొకక్షణంలో, మీ పుర్రెలు ఎగిరి



పొత్తై." అంటూ గండ్రగొడ్డళ్ళతో సిద్ధంగా వున్న భటులను చూపించాడు.

సంధ్యానిశీధులు ఒక్క క్షణం అలానే నిలుచుండి పోయారు. ముందుగా నిశీధుడు ధైర్యం తెచ్చుకుని, రాక్షసుడితో, "అయ్యా, వాడు ఎక్కడికిపోయిందీ, మాకూ తెలియదు. కాని యిక్కడినుంచి బైటపడితే, ఎలాగో తిప్పలుపడి వాడిని వెతికి కలుసుకోగలమనే ఆశ, నాకున్నది. కనుక మా మాటమీద నమ్మకంవుంచి, మమ్మల్ని విడుదల చెయ్యి. త్వరలోనే, మా సోదరుడితో సహా తిరిగివస్తాము." అన్నాడు.

"ఓహో, బలేపాచిక వేశావే! నీ దొంగ వేషాలు నా దగ్గిర సాగవు. ఇదివరకు చేసిన మోసాలన్నీ మరిచాననుకున్నావా? నీ విక్కడికి తిరిగివస్తానని నమ్మకమేమిటి?" అన్నాడు రాక్షసుడు.


అందుకు నిశీధుడు, సంధ్యని చూపుతూ, "ఐతే దీనిని నీదగ్గిరే బంధించి వుంచుకో. నీ కోసం కాదనుకో. తోటి సోదరుని వదులుకోగలమనుకున్నావా? అతణ్ణి రక్షించుకోవటానికైనా, మేము తిరిగి నీ దగ్గిరకు రాక తప్పదుగదా?" అన్నాడు.

"సరే, మరొకవిషయం. ముఖ్యంగా నేను, నీ సోదరుని పట్టాలంటున్నది ఎందుకో తెలుసా? ముఖ్యమైన భస్మాలూ, అంజనాలూ అతడి వద్ద వుండిపోయాయి. అవి అతడి వద్ద వున్నంతవరకూ, నాకు నిద్రపట్టదు. కనుక, అతనే రావక్కర లేదు. నీవైనాసరే, ఆ భస్మాలూ అవీ తెచ్చి నాకు ఒప్పగిస్తేచాలు. ఏనాడైతే ఆ పని చేస్తావో, ఆ నాడే నీ సోదరునికూడా విడుదలచేసివేస్తాను. తెలిసిందా?" అన్నాడు రాక్షసుడు.

సంధ్య కూడా యీ పద్ధతికి ఒప్పుకున్నాడు. నిశీధుడు బయలుదేరాడు. మిగతా హంసలతో పాటు, సంధ్యని కొలనులో వుంచమనిచెప్పి భటులకు ఒప్పగించి, రాక్షసుడు వెళ్ళిపోయాడు.

—(ఇంకావుంది)





# 17

[పాతాళగృహం లోని ఒక గదిలో నిర్బంధించబడి వున్న గజ్జవువాళ్ళ, ఉదయుడు కలుసుకున్నాడు. పింగాక్ష నిశదులు, రాకసుడికి బందీలుగా వున్నారని, వారు వాళ్ళను హింసిస్తున్నారని గజ్జవువాడు చెప్పాడు. ఉదయుణ్ణి, అంజనాలూ, భస్మాలనూ వెతికి తెస్తానని మాట యిచ్చిన మీదట రాక్షసుడు నిశదుణ్ణి వదిలిపెట్టాడు. తరవాత—]

ఉదయుడు ఎక్కడ వున్నదీ తెలుసుకుని, అతణ్ణిగాని లేకపోతే అతని వద్ద వున్న భస్మాలూ, అంజనాలూగాని తప్పక తెస్తానని నిశదుడు, రాకసుడికి వాగ్దానం చేశాడు. కాని, తీరా నిశదుడు బయలుదేరే సమయంలో రాకసుడు అతణ్ణి మూగవాణ్ణి చేసి వదిలాడు.

నిశదుడు కొన్నాళ్ళు ప్రయాణించి, చివరకు మాళవదేశం చేరుకున్నాడు. ఉదయుడికీ, నిశదుడికీ రూపంలో ఏ మాత్రం తేడా లేనందున, నిశదుణ్ణి— తాము లోగడ ఎరిగిన ఉదయుడనుకుని, రాజుగారి నౌకర్లు అతణ్ణి, తమ రాజు వద్దకు తీసుకువెళ్ళారు.

రాజు ప్రతాపసింహుడు కూడా వచ్చినది ఉదయుడే అనుకున్నాడు. తను అతని భస్మాలూ, అంజనాలూ కాజేసినందుకుగాను, కసితో తిరిగి వాటిని



తీసుకుపోవాలని వచ్చి వుంటాడనుకుని, భయపడ్డాడు. అయితే, పైకి మాత్రం ఏమీ తొణకకుండా, "ఏమోయ్! నీవు వెళ్ళిన పని కాయా, పండా?" అని ఎంతో ఆప్యాయంగా ప్రశ్నించాడు.

ఆ దేశానికి తాను యింతవరకూ ఏనాడూ రాకపోయినా, రాజుగారి నౌకర్లూ, రాజూ కూడా తన నెందుకిలా ఆదరిస్తున్నారో నిశీధుడికి బోధపడింది కాదు. పోనీ, "మీరు ఎవరిని చూచి, ఎవరనుకుంటున్నారో?" అని అందామంటే, తనను రాక్షసుడు మూగవాణ్ణి చేసి పంపాడాయె! నిశీధుడు ఏమి చెయ్యటమా అని ఆలోచించి, చివరకు సంజ్ఞలవల్ల తను మూగవాణ్ణి అంటూ రాజుకు తెలియచెప్పాడు.

రాజుకు చాలా ఆశ్చర్యం వేసింది. "అదేమిటి, ఉదయునా? నీవు క్రిందటి మారు వెళ్ళేటప్పుడు పలకటంగా వెళ్ళితివి కదా? ఇప్పుడు మూగవాణ్ణయినంటావేమిటి?" అన్నాడాయన విస్తుపోతూ.

"ఉదయునా!" అని ఎప్పుడైతే రాజు అన్నారో, నిశీధుడికి అంతా అర్థమై పోయింది. వ్రాతపరికరాలు తెప్పించమని సంజ్ఞచేశాడు, నిశీధుడు. అవి రాగానే, తను ఉదయుణ్ణి కానని, ఉదయుడు తన సోదరుడేనని, ఆతడి జాడ తెలియకనే తను యిలా బయలుదేరి వచ్చాననీ—తన సోదరుడు ఎక్కడ వున్నదీ తెలియజేస్తే, సంతోషిస్తానని వ్రాశాడు.

రాజుకు అప్పుడు అంతా అర్థమైంది. తన బండారం ఎక్కడ బయట పడుతుందో అని, భయపడి పోయాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, రాజుకు పచ్చి వెలక్కాయ గొంతుకు పడ్డట్టయింది. "ఎలాగో ఉదయుణ్ణి మోసపుచ్చి భస్మాలూ, అంజనాలూ కాజేసి, వాడి పీడ వదిలించుకున్నానుగదా అని సంతోషిస్తే, మళ్ళీ వీడు తయారయ్యాడే!



ఉదయుడి వివరాలు నాకు తెలిసినట్లు, వీడికి తెలిసే ప్రమాదం కోరి తెచ్చుకున్నట్లవుతుంది." అనుకున్నాడు రాజు.

అప్పుడు రాజుకు మరో దుర్బుద్ధి పుట్టింది. "ఉదయుడు ఎలాగో యీపాటికి రాక్షసుడి చేతిలో చనిపోయే వుంటాడు. వీడిని కూడా కడతేర్చానంటే, ఇక మిగిలిందల్లా మూడోవాడు. వాడూ ఎప్పుడో నా చేతిలో చిక్కి పోగలడు. అప్పుడు యిక రాకుమార్తెలకు వేరే మార్గం వుండదు." అనుకున్నాడు.

రాజు యిలా ఆలోచించి, నిశధుడితో, "అబ్బాయ్! నీ సోదరుడు యిక్కడికి వచ్చినమాట అయితే నిజమే. కాని, అతడు యిక్కడ ఒక్క పూట మాత్రమే వున్నాడు. ఆ తర్వాత అతని దారిన అతను వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్లాడో నాకు తెలియదు. అయితే, యీ కష్ట దశలో నేను, నీకు చెయ్యగలిగిన సహాయం అంతా చేస్తాను. ఉదయుడిని వెతకటంలో నీకు సహాయం కావాలంటే, నా సేవకులలో ఒకరిద్దర్ని వెంట పంపుతాను." అన్నాడు.

అంతే చాలన్నట్లుగా నిశధుడు తల వంచి, రాజుకు నమస్కరించాడు. ఆ వెంటనే రాజు తన మంత్రిని పిలిచి, రహస్యంగా, "ఈ కుర్రవాడి వెంట మన భటులనిద్దర్ని పంపించు. ఊరి వెలపలకు చేరుకోగానే, మూడో కంటికి తెలియకుండా చంపివేయమను." అని చెప్పాడు.

మంత్రి నిశ్చేష్టుడయాడు. కాని, రాజాజ్ఞ పాటించకపోతే, ముందు తన తల ఎగిరిపోతుందే! చేసేదిలేక రాజాజ్ఞ ప్రకారం యిద్దరు భటులను తోడిచ్చి, నిశధుడిని సాగనంపాడు.

ఇక గర్దభువాడి వెంట వున్న ఉదయుడు, ఇంక రెండు రోజులలో రాక్షసుడు తిరిగి వస్తాడనగా, ఏమి చేయటమా అన్న దాన్ని గురించి గర్దభువాడితో సంప్రతించాడు. బాగా ఆలోచించిన మీదట గర్దభు



వాడు. "ఉదయనా, నన్ను ఎప్పటిలాగా వేలాడదియ్యి. నువ్వు మాత్రం రాక్షసుడు వచ్చేసరికి, గదిలో ఏదో మూల జాగ్రత్తగా నక్కి ఉండు. వీలువెంట తరవాత బయటికి పారిపోవచ్చు. ఆ తరవాత తక్కిన కావలా వాళ్ళతో కలిసి, నువ్వూ కావలాకుపోయి, నీ సోదరులు ఏమయ్యారో తెలుసుకునేందుకు ప్రయత్నించు. ఇప్పుడు చేయవలసింది యింతకన్న మరేంలేదు." అన్నాడు.

"మరి వాడు యిక్కడికి వచ్చి వస్తాడు, మూడో బాన ఏదని అడుగుతాడేమో నిన్ను. అప్పుడేం చేస్తావు?" అన్నాడు ఉదయనుడు.

"దానికి ఒక ఉపాయం ఉందిలే. మనం పోగుచేసిన బాన పెంకులన్నీ, మళ్ళీ తెచ్చి యిక్కడ పోద్దాం." అన్నాడు గడ్డపువాడు.

అదే ప్రకారం యిద్దరూ పెంకులు తెచ్చి పోశారు. రాక్షసుడు యిక రేపు వస్తాడనగా, ఉదయనుడు, గడ్డపువాడిని ఎప్పటిలా వేలాడదీసి, తను గదిలో ఒక మూల నక్కి వున్నాడు.

అనుకున్నట్టే మర్నాడు రాక్షసుడు వచ్చాడు. తలుపు తెరుస్తూనే మూడవ బాన ముక్కలై వుండటం చూసి, "ఇది ఎవరి పనిరా?" అని పెడబొబ్బలు పెట్టుకుంటూ గడ్డపువాడి దగ్గరకు వచ్చాడు.

గడ్డపువాడు యేమీ తొణకకుండా, "నేనే, బాబయ్యా! వేలాడి వేలాడి విసుగుపుట్టి, కాసేపు ఊగుదామనిపించి, ఊగటం మొదలు పెట్టానండి. నాకు తెలియకుండానే బ్రహ్మాండంగా ఊగానండి. ఆ ఊపులో నేను వెళ్ళి, ఆ బానకు కొట్టుకున్నానండి. అది కాస్తా కిందపడి, యిలా ముక్కలైపోయిందండి. మన్నించాలి," అన్నాడు.

"ఆపోరించలేకపోయావ్!" అని విసుక్కున్నాడు రాక్షసుడు.

ఈ గొడవ జరుగుతున్నప్పుడే, ఉదయనుడు గదిలోంచి చల్లగా జారుకున్నాడు.



పగటి కాపలా బట్టు వాళ్ళు కొలనుకు బయలుదేరుతుంటే, వాళ్ళతోపాటు తనూ వెళ్ళాడు. ఆ రోజున మాటల సందర్భంలో, అతడు—తనను వెతికి తెచ్చేందుకు వెళ్ళాడనీ, రాక్షసుడు చంపినట్టూ సంధ్య ఒక్కతే కొలనులో వున్నట్టూ తెలుసుకున్నాడు.

ఈ సంగతి తెలిసేసరికి, ఉదయనుడు తెల్లబోయాడు. తను ఒక్కడే వుంటే, తన కోసం వీరుడు ఎక్కడని వెతగ్గలడు? ఎలాగయినా అతనిని కలుసుకుంటే బాగుండును! కాని అదెలా సాధ్యం? ఉదయనుడికి ఏమీ పాలుపోయింది కాదు. ఇందుకు ఏదైనా ఉపాయం చెబితే, గర్దభువాడే చెప్పాలి అనుకున్నాడు.

అదే ప్రకారం ఆ సాయంత్రం తిరిగి పాతాళగృహం చేరుకోగానే, ఒక్క పరుగున గర్దభువాడి గది దగ్గిరకు వెళ్ళాడు. కాని, చిత్రమేమిటో, గదితలుపులు బార్లా తెరిచి వున్నై. లోపల గర్దభువాడు లేడు. రాక్షసుడూ లేడు. దూలానికి కట్టిన తాడు మాత్రం వేళ్ళాడుతున్నది.

ఈ దృశ్యం కంటబడగానే, ఉదయనుడు నిలువునా నీరైపోయాడు. "నా ఆశలన్నీ గర్దభువాడి మీద పెట్టుకుని వస్తే, యిలా అయిందేమిటి? వాడు ఏమైనట్టు? ఇదంతా చూస్తూంటే, రాక్షసుడు గర్దభువాడి మీద మండిపడి వున్నట్టు తోస్తుంది. వాడు గర్దభువాడిని హతమార్చి లేదుగదా కొంపదీసి? ఉహుఁ, అలా జరిగి వుండటానికి వీల్లేదు. గర్దభువాడు ఏదో తంత్రం చేసి, రాక్షసుణ్ణి మాయపుచ్చగలడు. ఇక్కడే మరి ఏ గదిలోనన్నా వాడు బంధించబడి వుండవచ్చు.'' అనుకుంటూ ఉదయనుడు గదులన్నీ గాలించటం మొదలుపెట్టాడు.

అలా వెతుకుతూండగా, ఉదయనుడి కాలు నేల మీద ఒక మీట పైన పడింది. అలా పడగానే ఎదురుగా వున్న గోడ రెండుగా విచ్చి దారి ఏర్పడింది. ఉదయనుడు ముందుకు ఒక్క అడుగు వేశాడు.



అంతే. రెండవ అడుగు వడవేలేదు. ఎందుచేతనంటే—అతని కెదురుగా ఒక బంగారు ద్వారం కనిపించింది. దానిపై నుంచి భీకరమైన మూడు సర్పాలు బ్రహ్మాండంగా బుసలుకొడుతున్నై. గర్వపువాడు ఆ లోపల వున్నాడేమో! కాని, సర్పాలను తప్పించుకు వెళ్ళటం ఎలా? ఉదయనుడు తీవ్రంగా ఆలోచించసాగే సరికి, మెరుపులా ఒక ఉపాయం తట్టింది.

అతడు గర్వపువాడి గదిలోవున్న బాన నెమ్మదిగా దొర్లించుకు వెళ్ళాడు. బానలో దూరి మూతవేసుకుని, ఒక్క విసురులో బంగారు ద్వారంలోంచి దూసుకు పోయాడు. మూత తొలగించి తొంగి చూశాడు. మరేం ప్రమాదం లేదని తేలి బైటపడ్డాడు.

ఆ గది చూసేసరికి ఉదయనుడి కళ్ళు మిరుమిట్లు గొలిపినై. గది గోడలూ, నేలా అంతా బంగారుమయమే. కొంత సేపు విస్తుపోతూ అలాగే గది అంతా పరికిస్తూ వుండిపోయాడు. కాని, అంతలోనే తను వచ్చిన పని గుర్తుకు వచ్చింది. గర్వపువాడి కోసం మూల మూలలా వెతక సాగాడు. కనిపించలేదు. కాని, అలా వెతుకుతూండగానే, అక్కడున్న మరో మీట పైన కాలుపడి, ఎదురుగావున్న గోడ ఇది వరకటిలాగానే చీలి, దారి ఇచ్చింది. క్రిందటి మారు జరిగినట్టుగానే, ఏదో చిత్రం జరుగుతుందనుకుంటూ, ఉదయనుడు అడుగు ముందుకు వేశాడు.

క్రిందటి మారులాగానే, ఈసారి కూడా ఒక పెద్ద ద్వారం కనిపించింది. అయితే, ఇది వెండిద్వారం. దీనికి ఆరు సర్పాలు వేళ్ళాడుతున్నై. ఒకసారి ఉపాయం కనిపెట్టి వున్నవాడే కనక, ఈ మాటు కూడా బానలో దూరి, ఈ ద్వారంలోంచి కూడా దూసుకుపోయాడు. కాని దురదృష్టవశాత్తూ, ఈసారి బాన విసురుగా దొర్లుకుంటూ పోయి, వెండి గది గోడకు కొట్టుకుని ముక్కలు ముక్కలై పోయింది.



ఉదయనుడు బావినుంచి బైటపడ్డాడు. గది గోడలూ, నేలా అంతా వెండి మయం. అయితే, ఆ వింత చూస్తూ, విస్తుపోతూ వుండిపోక ఉదయనుడు ముందుకు పోయే మార్గం ఏమిటా అని వెతికాడు. కాని, యిక్కడ మెట్ల ఏది కనిపించ లేదు. అయితే, గది పై కప్పు నుంచి, వెండి గొలుసు ఒకటి వేళ్ళాడుతున్నది. ఒక్క ఎగురు ఎగిరి అది పట్టుకుని లాగాడు. ఎదురుగా వున్న వెండిగోడ, మెల్లిగా పైకి లేచిపోయి దారి ఏర్పడింది. లోపలకు అడుగు పెట్టాడు, ఉదయనుడు. ఈసారి కూడా ఒక పెద్ద ద్వారం కనిపించింది. అయితే, యిది రత్నాలతో పొదగబడిన ద్వారం. దీని పై నుంచి పన్నెండు సర్పాలు వేళ్ళాడుతున్నై.

ఉదయనుడు యింతవరకూ బావిలో దూరి ఎలాగో బంగారు ద్వారం, వెండి ద్వారం దాటుకొచ్చాడు. ఆ బావి కాస్తా పగిలిపోయింది. ఏమిటి మార్గం? ఇలాంటివి యింకా ఎన్ని ద్వారాలు దాటాలో, యింకా ఎన్ని ప్రమాదాలు ఎదుర్కోవలసి వుంటుందో, అనుకున్నాడు ఉదయనుడు. తిరిగి పోవాలన్నా, ద్వారాల దగ్గర వున్న సర్పాలతో ప్రమాదం వున్నది. పోనీ తెగించి రత్నాల ద్వారం ప్రవేశించేందుకు ప్రయత్నిద్దామా అంటే, ఒకటి కాదు, రెండు కాదు, పన్నెండు సర్పాల నుంచి తప్పించుకోవాలి!

ఉదయనుడు, "ఏమిటాదారి, భగవంతుడా!" అనుకుంటూ, ఆ రత్నాల గదిలోనే కూర్చుని తీవ్రంగా ఆలోచించ సాగాడు. కాని ఎంత ఆలోచించినా, ప్రాణాలకు తెగించి లోపలకు పోవటం తప్ప వేరే మార్గం కనిపించలేదు. అంటే ముందు ద్వారానికి వేలాడుతున్న సర్పాలను సంహరించాలి.

మారు ఆలోచన లేకుండా ఉదయనుడు చప్పున కత్తి దూసి, వేలాడుతున్న ఆ సర్పాల పైన ఒక్క వేటు వేశాడు. ఆ దెబ్బతో ఆరు సర్పాల తలలు తెగి

పడినై. మరో దెబ్బ వేశాడు. ఈసారి అయి దింటి తలలు ఎగిరి పోయినై. ఒక్క సర్పం మిగిలింది. దానిని తెగటార్చితే, ఇక లోపలకు ప్రవేశించవచ్చు!

ఉదయనుడు గురి చూసి కత్తి విసిరాడు. కాని సర్పం యీసారి దెబ్బ తప్పించుకొని, ఒక్క విసురులో వచ్చి ఉదయనుడి చేతి మీద కాటువేసింది. అతడి చేతిలోని కత్తి కాస్తా కిందపడింది.

విషం ఎక్కి పోతున్నది ఉదయనుడికి. ముచ్చెమటలు పోసినై. ఆలశ్యమైతే ప్రాణానికే మోసం. ఉదయనుడు కత్తి తీసుకుని ఒక్క వేటుతో చెయ్యినరికి వేసుకున్నాడు. మరో దెబ్బతో ఆ సర్పాన్ని కూడా ఖండించివేశాడు. మరుక్షణమే స్పృహ తప్పి పడిపోయాడు.

అలా ఎంతసేపు పడివున్నాడో తెలియదు. తిరిగి స్పృహ వచ్చి చూసేసరికి, తెగిన చేతినుండి కారిన రక్తం మడుగు కట్టివుంది. ఇంకా రక్తం కారుతూనే వుంది. ఏమిటి చేయటం. భరించటం తప్ప! బాధపడుతూనే ముందుకు సాగాడు ఉదయనుడు.

కొంత దూరం వెళ్ళేసరికి ఒక పెద్ద గుహ కనిపించింది. అందులో రాక్షసుడు కొలుస్తూవున్న దేవి విగ్రహం కనిపించింది. దేవి మెడలో నూట ఒక్క పుర్రెలు వెళ్లాడుతున్నై. నోటిలో నుంచి భుగ భుగమంటూ అగ్ని జ్వాలలు వస్తూవున్నై. కళ్ళల్లో నుంచి తీవ్రమైన వెలుగు, వెలుగులోంచి కిరణాలు వస్తున్నై. దేవి చెయ్యి చాచివున్నది. అరచేతిపైన ఒక గద్ద నిలబడివున్నది. ఆ వాతావరణమంతా చాలా భయంకరంగా వున్నది.

అయినా ఉదయనుడు చలించలేదు. ధైర్యం కూడదీసుకొని, విగ్రహం వైపుకు నడిచాడు. నాలుగడుగులు వేశాడో లేదో, దేవి వెనక నుంచి బ్రహ్మాండమైన పొగ వెలువడి. గుహ అంతా ఒక్క సారిగా కమ్ముకున్నది. ఆ పొగలో ఉదయనుడు ఉక్కిరి బిక్కిరై పోసాగాడు.

—(ముగింపు పై సంచికలో)





# శిథిలాలయం

## 18

[రాక్షసుడి అనుమతితో ఉదయనుణ్ణి వెతుకుతూ, నిశీథుడు బయలుదేరాడు. ఈ లోపల పాతాళగృహంలో వున్న ఉదయనుడు, విషసర్పాలు కాపలా కాస్తున్న కొన్ని ద్వారాలు దాటి, ఒకచోట రాక్షసుడు పూజించే దేవీవిగ్రహాన్ని చూస్తూనే, విగ్రహం వెనక నుంచి వెలువడుతున్న పొగలో చిక్కుకుని, దారికానక ఉక్కిరిబిక్కిరయాడు. తరవాత—]

ఉదయనుడు భయకంపితుడైపోయి. యిక తనకు చావు తప్పదనుకునేంతలో, హఠాత్తుగా పొగ మాయమైపోయింది. ఆ వెంటనే రకరకాల ధ్వనులతో దేవీ విగ్రహం వున్న గుహ అంతా మార్మోగ సాగింది. ఉదయనుడు యిప్పుడు ధైర్యం తెచ్చుకుని, దేవీ విగ్రహం ముందు నిలబడి, ''తల్లీ! ఇందరు అమాయకుల ప్రాణాలను బలి కోరటం ఏం న్యాయం? ఆ దుర్మార్గుడైన రాక్షసుడికి, మరింత బలం ప్రసాదించటంలో, లోకానికి జరిగే మేలేమిటి, తల్లీ?'' అన్నాడు.

దేవి ఉలకలేదు; పలకలేదు. ఉదయనుడు ఒక క్షణం ఆగి, ''తల్లీ! ఇంత వరకూ నిద్రాహారాలు లేక పడరాని కష్టాలు పడ్డాము. ఆ రాక్షసుణ్ణి హతమార్చాలి. వాడి ప్రాణాలెక్కడున్నాయో చెప్పి పుణ్యం కట్టుకో!'' అన్నాడు.



దేవి, యీ కోర్కెకూ సమాధానం చెప్పలేదు. ఇది పనిగాదని ఉదయనుడు, దేవి చేతిలో వున్న గద్దను తన కత్తితో ఒక్క వ్రేటుకు నరికి వేశాడు. గద్ద కాస్తా అగ్నిగుండంలో పడింది. దేవి విగ్రహం మాయమై, ఆ ప్రదేశమంతా వెలుగుతో నిండిపోయింది.

ఉదయనుడు గిరుక్కున వెనుదిరిగి చూశాడు. అంతకు ముందు తను దాటి వచ్చిన ద్వారాలూ, గదులూ ఏవీలేవు. అంతా ఒక ఎడారిలా తయారైంది.

ఉదయనుడు తిరుగు ముఖం పట్టాడు. అంతకు ముందు రత్నాలద్వారం వున్న చోట, రత్నాలతో పొదగబడిన ఒక బాతు గుడ్డు వంటి గుడ్డు కనిపించింది. దానిని తీసుకుని మరికొంత దూరం వచ్చేసరికి, అలాంటిదే వెండి గుడ్డు కనిపించింది. అది తీసుకుని మరికొంత దూరం వెళ్ళేసరికి, బంగారుగుడ్డు కనిపించింది. దానిని తీసుకుని ముందుకు సాగేసరికి, గద్దపు వాడు వేళ్ళాడ దీయబడిన గది కూడా కనుపించకుండా పోయింది.

ఉదయనుడు విస్తుపోతూ పాతాళం లోంచి బయిటికి వచ్చాడు. అప్పుడే రాక్షసుడి సేవకులు వచ్చి చుట్టుముట్టారు. వాళ్లతోపాటు కొలనులో హంసల రూపంలో వుంటున్న వాళ్ళు కూడా మామూలు స్వరూపాలు పొంది వచ్చేశారు. సోదరుడు కనబడగానే సంధ్య ఒక్క పరుగున వచ్చి కౌగలించుకున్నాడు.

ఇంతలో రాక్షసుడి సేవకులు ఉదయనుడిని అమాంతం భుజాల పైకి ఎక్కించుకుని, "నీవు దేవుడివే, మా రాజా! నీ ధర్మమా అని, ఇన్నాళ్ళకు మాకు ముక్తి దొరికింది!" అన్నారు.

ఒకడు ఉదయనుడి మొండిచేతి నుంచి కారుతున్న రక్తం చూశాడు. వాడు వెంటనే, "చూస్తారేమ్రా! పసరు తెండి," అని కేకవేశాడు.

ఒకడు పసరు తెచ్చి ఉదయనుడి చేతికి రాచి కట్టుకట్టాడు. అప్పుడు ఉదయనుడు

వాళ్ళ నందరినీ తీసుకుని, కొలను వైపుకు వెళ్ళాడు. తీరా చూడగా అక్కడ కొలనులేదు. శిలలుగా మారిపోయిన దురదృష్టవంతుల ప్రతిమలు మాత్రం నిలిచివున్నై.

ఉదయనుడు వెంటనున్న వాళ్ళను, "కొలను ఏది ?" అని అడిగాడు.

"ఇంకా కొలను ఎక్కడుంటుంది, బాబూ! దేవి మాయంకావటంతో అన్నీ మాయమైపోయినై," అన్నారు వాళ్ళు

"మరైతే, యీ శిలా ప్రతిమల గతేమిటి ?" అన్నాడు ఉదయనుడు.

"వాళ్ళ గతి అంతే! కొలను కాస్తా పోయె. వాళ్ళకు మామూలు స్వరూపాలు ఎలా వస్తవి ?" అన్నారు సేవకులు.

"అయ్యో, ఎంత దారుణం! నిష్కారణంగా యిందరి ప్రాణాలు హరించి పోవటానికి కారకుణ్ణయానే," అంటూ విచారించసాగాడు ఉదయనుడు.

ఆటు తరువాత, "సోదరుడు నిశిధుడు ఏమయ్యాడో! ఆ గద్దవువాడు ఏమయ్యాడో! రాజకుమార్తె లేమయ్యారో తెలియులేదు. ఆ సంగతులన్నీ తెలుసుకోవాలి," అన్నాడు ఉదయనుడు.

"మరి పదండి!" అన్నారు సేవకులు.

"అలా కాదు. మీరంతా యిక్కడే వుండండి," అని వాళ్ళనక్కడ కాపలా



పెట్టి, సంధ్య, యితర పరివారాన్ని తీసుకుని, వెంటనే ఉదయనుడు బయులుదేరాడు. ముందుగా అతడు ప్రతాపసింహుడి రాజ్యం చేరి కోగట్టాచేశాడు.

"అబ్బే, ఎవరూ రాలేదు. నీవు అప్పుడు వెళ్ళటం, నిన్ను మళ్ళీ యిప్పుడే చూడటం. ఆ రాక్షసుణ్ణి తప్పించుకుని ఎలా వచ్చావోయ్ ?" అని ప్రశ్నించాడు ప్రతాపుడు.

"వాడి సంగతే తెలియులేదు. అయితే, వాడి మాయా భవనం మాత్రం మట్టిపాలు చేసి వేశాను. నా సోదరుడూ, రాజకుమార్తెలూ ఏమయారో తెలుసుకోవాలి," అన్నాడు ఉదయనుడు.



"కావాలంటే, నా పరివారాన్ని కూడా పంపుతా." అన్నాడు రాజు ఎంతో దయతో.

"మీ అభిమానం వుంటే చాలు," అంటూ ఉదయనుడు, రాజు వద్ద సెలవు తీసుకుని, మళ్ళీ పరివారంతో సాగిపోయాడు.

• • •

రాజు ప్రతాపసింహుడి మాట నమ్మి, అతడి సేవకులను నిశీధుడు వెంట తీసుకుపోవటం ప్రమాదకరమే అయింది. అదను చూసి ప్రతాపుడి సేవకులు, నిశీధుడి తల తెగవేసి, అరణ్యంలో పార వేసి చక్కాపోయారు. మరునాడు, ఆ చుట్టు ప్రక్కల ఆశ్రమంలో వుంటున్న ఒక ఋషీశ్వరుడు, ఆ దారిన వస్తూ, నిశీధుడి తలా, మొండెమూ చూచాడు. వాటిని తన ఆశ్రమానికి చేర్చి, వాటికి సంబంధించిన వాళ్ళెవరైనా వస్తారా అని ఎదురు తెన్నులు చూస్తూ వున్నాడు.

కొద్దిరోజులకే దానశీల మహారాజు పంపిన ఆయన మంత్రి, ఈ ఋషీశ్వరుని ఆశ్రమం చేరుకోవటం తటస్థించింది. నిశీధుని తలా, మొండెమూ చూచి గుర్తు పట్టాడు. "అయ్యో, ఇదేమి ఘోరం!" అంటూ గుండెలు బాదుకున్నాడు మంత్రి.

"నాయనా, విచారించి ప్రయోజనం లేదు. దుఃఖించకు. నేనూ, నీ వెంట వస్తాను. కలిసిపోదాం, పద. నేను చేయ గల ఉపకారమల్లా ఒకటే; ప్రాణం పోయుటం నా చేతకాదు. కాని ఎంత కాల మైనా సరే, యీ కళేబరము చెడి పోకుండా నిలవ చేయుగలను." అని మంత్రిని ఓదార్చాడు ఋషీశ్వరుడు.

"అంతకంటె కావలసిందేమున్నది! ఈ ఆపద సమయమందు మీరు దేవుడి లాగా వచ్చారు. మనం ఈ స్థితిలో శ్రావస్తీనగరం చేరుకుంటే చాలు. తర వాత సంగతి ప్రభువులే ఆలోచించ గలరు." అన్నాడు మంత్రి.

ఋషీశ్వరుడూ, మంత్రీ కొద్దిరోజుల్లో శ్రావస్తీనగరం చేరారు. నిశీధుడి కళే

బరం చూసి అందరూ కొయ్యబారి
పోయారు. సంధ్య, ఉదయనుడూ, వాళ్ల ముసలి తల్లి పేగులు తరుక్కుపోయేట్టు విలపించసాగారు. ఈ స్థితిలో గర్ధపువాడు అక్కడికి వచ్చాడు.



గర్ధపువాడు చాలా విచిత్ర పరిస్థితుల్లో అక్కడికి చేరుకోవటం జరిగింది. రాక్షసుడికి వాడంటే ఎప్పుడూ అనుమానమే. తన మాయా భవనంలో వదిలిపోతే, ఏదో ముప్పు తెస్తాడని అతడు భావించాడు. అందువల్ల రాక్షసుడు సంచారానికి బయలుదేరినప్పుడు గర్ధపువాణ్ణి తనవెంట తీసుకుపోయాడు.


ఆ పరిస్థితుల్లో ఒకరోజున రాక్షసుడు, గర్ధపువాడితోపాటు ఆకాశమార్గాన సంచరిస్తున్నాడు. దిగువ అంతా మహా సముద్రం. సరిగా అదే సమయంలో ఉదయనుడు, దేవిచేతిపైన ఉండే గర్ధను పడగొట్టటం జరిగింది. ఇక్కడ ఉదయనుడు గర్ధను పడగొట్టటమేమిటి, ఆకాశమార్గాన గర్ధ రూపంలో వున్న రాక్షసుడు నిజరూపం పొంది, ఒక చావు కేకపెట్టి, సముద్రంలో పడి మరణించటం ఏమిటి- రెండూ ఒకేసారి జరిగాయి.

రాక్షసుడితోపాటు సముద్రంలో పడిన గర్ధపువాడు మాత్రం, రెండు రోజులపాటు శ్రమపడి సముద్రం యీది, చివరకు కొన ప్రాణాలతో ఒడ్డుకు చరుకోగలిగాడు. వాడు గజ ఈతగాడు.

మాయాభవనం మట్టి పాలయిందనీ, ఇక ఏ విధమైన బాధలూ వుండవనీ, గ్రహించాడు గర్ధపువాడు. తను చేరుకున్న సముద్ర తీరపు నగరం ఏదో అక్కడి వాళ్ళను అడిగి తెలుసుకున్నాడు. అది శ్రావస్తినగరం అని తెలుసుకోగానే, అతడి ఆనందానికి మేరలేకపోయింది.

గర్ధపువాడు ఉత్సాహంగా రాజభవనం ప్రవేశించేసరికల్లా, అక్కడ ఏడుపులూ పెడబొబ్బలతో, అంతా గోలగా వున్నది.

గర్ధపువాడు శత్రువులు వేసిన ఎన్నెన్నో వ్యూహాలను ఛేదించినవాడు. ఖ్యాతి



పొందిన రాక్షసుడి చేతిలో మసలిన వాడు. మామూలు మానవులలాగా ప్రతి విషయంలోనూ అధైర్యం చెందడు. అతను అందరినీ ఊరడిస్తూ, "ఇప్పటివరకూ అంతా సవ్యంగానే నడిచింది. కంగారు పడవద్దు." అన్నాడు.

గర్ధపువాడు, ఉదయనుణ్ణి చేరబిలిచి, "అబ్బాయీ, ఇదంతా ప్రతాపసింహుడి కుట్రగాని, వేరుగాదు. భస్మాలూ, అంజనాలూ వాడే కాజేసి వుంటాడు. ముందు వాటిని తిరుగా చిక్కించుకోవాలి. ఈ పని చూడు," అన్నాడు.


ఉదయనుడు క్షణమైనా నిలవలేదు. దానశీల మహారాజుగారి సైన్యాన్ని తీసుకున్నాడు. గర్ధపువాడిని వెంటబెట్టుకుని, మాళవ రాజ్యం చేరుకున్నాడు. నగరం చూడబోతే పందిళ్ళతో, పచ్చటి తోరణాలతో కళకళ్ళాడుతూ వున్నది. ఈ వేడుకంతా ఏమిటని భోగట్టాచేయగా, ప్రతాప మహారాజులుంగారికి ఒక్కసారిగా ముగ్గురు మహారాణులు కాబోతున్నారని అబ్బురంగా చెప్పుకుంటున్నారు అందరూ.

గర్ధపువాడు చేసిన సూచనలు అక్షరాలా నిజమయేటట్టుగానే తోచింది ఉదయనుడికి. ఆశ్చర్యంతో వాళ్ళు మహలు ప్రవేశించారు. పెళ్ళిపీటల మీద వరసగా సుహాసినీ, సుభాషిణీ, సుకేశినీలు ముగ్గురూ తీర్చి కూర్చుని వున్నారు. కులుకుతూవున్న ప్రతాపుడు మూడు మంగళ సూత్రాలు చేతపట్టుకొనివున్నాడు.

ఉగ్రమూర్తి అయినాడు ఉదయనుడు. ఒక్కలిప్తలో బాకు దూశాడు. కాని, గర్ధపువాడు అడ్డుకున్నాడు. అంతలోనే సైన్యమంతా ముట్టడివేసింది. ప్రతాప మహారాజు చేతులకు సంకెలలు తగిలించగానే ఆయన తెల్లబోయి నిశ్చేష్టుడయాడు.

సంగతి అర్థమైన తరవాత ప్రతాపుడు, ఉదయనుడికి దాసోహం అని, తాను చేసినతప్పులన్నీ ఒప్పుకున్నాడు. కాజేసిన

శస్త్రాలూ, అంజనాలూ ఒప్పగించి వేశాడు. అంతేకాక ఉదయనుడికీ, గద్దపువాడికీ మ్రొక్కి, ''బాబూ, మీ బానిసను. నా సర్వస్వమూ మీదే. మన్నించండి,'' అని క్షమాపణ చెప్పుకున్నాడు.



ఎన్నోకష్టాల కోర్చి, గండాలు గడిచి, తమను రక్షించటానికి జీవితాన్నే అర్పించటానికి సిద్ధపడిన సాహసుడు ఉదయనుణ్ణి చూడగానే, రాజకుమార్తెలు ముగ్గురకూ ప్రాణం లేచివచ్చింది. చెప్పలేని ఆవేశంతో ఉదయనుడి వద్దకు వచ్చారు. అప్రయత్నంగా జలజలమంటూ వారి కన్నుల వెంట ఆనంద బాష్పాలురాలినై.

అయితే, ఉదయనుడి చెయ్యి మొండిగా వుండటం వాళ్ళు వెంటనే కనిపెట్టి వేశారు. నిజానికి యీ సందడిలో అతడి చెయ్యి సంగతి అందరూ మరిచే పోయారు. కాని, సారథి అయిన గద్దపువాడు నించున్నపాటున పాతాళగృహానికి పోయి, అక్కడ పడివున్న ఉదయనుడి చేతిని స్వయంగా పట్టుకవచ్చాడు. అంజనాలు ప్రయోగించి చేతిని మామూలుగా అతికించివేశాడు.

రాక్షసుడు లోగడ రాకుమార్తెలను మూగవాళ్లనుగా చేసి వదిలాడు. అయితే, దేవి చేతిలోని గద్ద ఎప్పుడైతే భూపతనమైనదో, అప్పుడే రాక్షసుడు కూడా మరణించాడు. రాక్షసుడితోనే పోయినై, అతడు ప్రయోగించిన మాయలన్నీ. ఆ మాయలలో ఒకటైన రాకుమార్తెల మూగతనమూ పోయింది. ఇప్పుడు వాళ్లు మామూలుగా చిలకల్లాగా మాట్లాడుతున్నారు.

ఈ విధంగా రాకుమార్తెలనే కాక; మాళవరాజ్య లక్ష్మిని కూడా సంపాయించుకు వచ్చిన ఉదయనుడు, అందరినీ వెంటబెట్టుని శ్రావస్తీనగరంలో అడుగు పెట్టాడు. గద్దపువాడు శస్త్రాల, అంజనాల ప్రభావంతో నిషధుని తలా, మొండెమూ అతికించి జీవంపోశాడు.

రాజ్యంలోని ప్రజయావన్మందీ, ఆనంద డోలికలలో తేలిపోయారు. రాజా, రాణీ కవలసోదరుల ఋణం ఎన్ని జన్మాలకైనా తీర్చుకోలేమంటూ, వాళ్ళను ఎంతగానో అభినందించారు.

అప్పుడు కవలసోదరులు ముగ్గురినీ దానశీల మహారాజు చేరదీసుకుని, సుహాసిని చేతిని ఉదయనుడి చేతిలోనూ, సుభాషిణి చేతిని సంధ్య చేతిలోనూ, సుకేశిని చేతిని నిశీధుడి చేతిలోనూ వుంచాడు. గురుతుల్యుడైన గడ్డపువాడు దీవించగా, ముగ్గురు కవలలకూ, ముగ్గురు రాకుమార్తెలకూ అతివైభవంగా వివాహం జరిగింది.

తరువాత దానశీలమహారాజు, గడ్డపువాడిని మాళవదేశానికి అధిపతిగా వుండమనికోరాడు. కాని, సర్వసంగ పరిత్యాగి, నిమిత్త మాత్రుడు అయిన గడ్డపు వాడికి రాజ్యాలేలాలని లేదు. ప్రతాపసింహుడు పశ్చాత్తాపం తెల్పగా, అతని రాజ్యం అతనికి తిరుగా యిప్పించివేశాడు.

దానశీల మహారాజు తన రాజ్యాన్ని ముగ్గురు కవలసోదరులనూ పంచుకోమని కోరాడు. కాని, కవలలు ఎంత మాత్రమూ అందుకు ఆశపడలేదు. సర్వ సమర్థుడైన ఉదయనుడు, తను రాక్షసుడి భవనంలో చేజిక్కించుకున్న గుడ్లుమూడూ బయటికి తీశాడు. కొంత కొంత దూరాన విడివిడిగా గడ్డపువాడి సలహామీద, వాటిని మూడు చోట్లపెట్టి బద్దలు కొట్టేసరికి, అక్కడ వరసగా వెండికోటా, బంగారుకోటా, రత్నాల కోటా మూడూ ఏర్పడినై. ఆ కోటలలో కవలలు సుఖంగా ఉండసాగారు.

ఇంత హడావిడిలోనూ వారు ఒక్క విషయం మటుకు మరవలేదు. దుష్ట రాక్షసుడి బలికి ఆహుతిఅయి శిలలుగా మారిపోయిన, ఆ ప్రతిమల సంగతి ఉదయనుడిమనసును బాధిస్తూనేవున్నది. ఆ మహావీరులకు స్మారక చిహ్నంగా ఒక చక్కటి భవనం నిర్మించి, ఆ భవనం చుట్టూ, ఈ ప్రతిమలను స్తంభాలుగా అమర్చాడు. —(అయిపోయింది)

